ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ప్రకాశం

జిల్లా వార్తలు

ఆదివారం 23, మార్చి 2025



వాన నీటిని ఒడిసిపడదాం

జిల్లాఅంతటా భారీగా నీటి సంరక్షణ పనులు

జిల్లాలో అత్యధిక ప్రాంతం వర్షాధారమే! అన్నిచోట్లా అరకొర నీటి సౌకర్యాలే! సరైన వానలు లేక ఏటా కరువు బారిన పడుతూ సాగుకే కాక తాగు, ఇతర సాధారణ అవసరాలకు కూడా నీరు అందుబాటులో లేక అవస్థలు పడుతున్న పరిస్థితి. ఈనేపథ్యంలో ప్రజల నీటి అవసరాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అందులో భాగంగా నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన చర్యలు ప్రారంభించింది. వాన నీటిని ఒడిసిపట్టేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఆ మేరకు పొలాల్లో భారీగా పంట కుంటలు తవ్వాలని నిర్ణయించింది. ఉపాధి హామీ పథకం అనుసంధానం చేసి కరువు బారిన పడుతున్న జిల్లాలో పెద్దఎత్తున నీటి సంరక్షణ పనులకు శనివారం శ్రీకారం చుట్టింది. మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా సింగరాయకొండ మండలం కనుమళ్లలో పంట కుంట తవ్వకాన్ని ప్రారంభించారు.

కనుమళ్లలో ప్రారంభం

జిల్లాలో శనివారం పంట కుంటల తవ్వకాల పనులకు యంత్రాంగం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో లక్షా 55వేల పంట కుంటలు లక్ష్యం కాగా జిల్లాలో 9,500 తవ్వాలని నిర్ణయించారు. సగటున ఒక్కో కుంట తవ్వకానికి రూ.50వేల వరకు ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం ఈ పనులను జల దినోత్సవం సందర్భంగా డ్వామా ఆధ్వర్యంలో చేపట్టగా సింగరాయకొండ మండలం కనుమళ్లలో మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పంట కుంటల తవ్వకం పనులు ప్రారంభించారు. కలెక్టర్ అన్సారియా, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ పాల్గొన్నారు. అక్కడ రూ.2.32లక్షలతో తవ్విన మోడల్ పంట కుంటను ఈ సందర్భంగా మంత్రి ప్రారంభించారు. మార్కాపురం మండలం గోగులదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ పనులను ప్రారంభించారు. పెద్దారవీడు మండలం శివాపురంలో పంటకుంట తవ్వకం పనులను ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు ప్రారంభించగా జిల్లాలోని అన్ని మండలాల్లోనూ డ్వామా సిబ్బంది నేతృత్వంలో ఈ పనులు మొదలయ్యాయి.

ఉపాధి పథకంతో అనుసంధానం

పంట కుంటలు, ఇంకుడు గుంతలు, చెరువుల ఆధునికీకరణ పనులు ప్రారంభం

- జల దినోత్సవం సందర్భంగా పంట కుంటల తవ్వకాలకు శ్రీకారం
- కనుమళ్లలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా
- ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రం ప్రారంభం



ఒంగోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వాన నీరు వృథా కాకుండా ఒడిసి పట్టే లక్ష్యంతో చిన్న, మధ్య తరహా స్థాయిలో కుంటల తవ్వకాలను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో పొలాల్లో అన్ని అవసరాలకు ఉపకరించేలా రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55వేల పంట కుంటల (ఫాం పాండ్స్)ను 2025-26 ఆర్థిక సంవత్సరంలో తవ్వాలని నిర్ణయించారు. అలాగే ఇళ్ల, కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు, ఊరూరా ఉండే చెరువులు, కుంటలలో పూడికతీత, ఇతర ఆధునికీకరణతోపాటు పది రకాల నీటి సంరక్షణ పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో 380 గ్రామాల్లో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయినట్లు కేంద్రం గుర్తించగా అందులో అత్యధికంగా జిల్లాలోనే 93 ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాలో భారీగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో కలెక్టర్ అన్సారియా, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్ కార్యాచరణ రూపొందించారు. ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నీటి సంరక్షణ పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత పొలాల్లో పంట కుంటలపై దృష్టి పెట్టింది. సంబంధితశాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కర్నూలు జిల్లాలో పంట కుంటల తవ్వకం పనులు ప్రారంభించగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పనులు ప్రాధాన్యత ఉన్న జిల్లాల్లో అక్కడి మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

మిగతా 6వ పేజీలో

ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం

- రూ.20.80 లక్షలతో లెవలింగ్, ట్రాక్ ఆధునికీకరణ
- ప్రారంభించిన కమిషనర్ వెంకటేశ్వరరావు
- మొత్తం రూ.93.85 లక్షలతో వివిధ రకాల పనులు
- మూడింటికు టెండర్లు పూర్తి
- వచ్చేనెలలో వాటినీ చేపట్టేలా కార్యాచరణ
- ఎమ్మెల్యే జనార్దన్ ఆదేశాలతో కదలిక



ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు, ఏఈ చంద్రయ్య, కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్

ఒంగోలు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌లో కీలక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు కార్పొరేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. తొలిగా ఆ డివిజన్‌తో పాటు పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది వచ్చి వాకింగ్ చేసే ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానంగా అవసరమైన పార్కులో లెవలింగ్, రెండువైపులా వాకింగ్ ట్రాక్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. సుమారు రూ.20.80 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం, సదుపాయాల మెరుగు లక్ష్యంగా 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ప్రజల సమక్షంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చావేదికలను నిర్వహించిన

మిగతా 6వ పేజీలో

స్కూల్ గ్రాంట్ వినియోగంలో నిర్లక్ష్యం

- రూ.9లక్షలు వెనక్కు వెళ్లే ప్రమాదం
- 87 పాఠశాలల హెచ్‌ఎంల నిర్వాకం



ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంపోజిట్ స్కూలు గ్రాంట్ విడుదల చేయకపోతే పాఠశాలల నిర్వహణ ఎలా అని ప్రధానోపాధ్యాయులు గతంలో గగ్గోలు పెట్టారు. తీరా విడుదల చేస్తే నిధులు వినియోగించడంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో 87 పాఠశాలలకు విడుదల చేసిన సుమారు రూ.9లక్షలు వెనక్కు వెళ్లే ప్రమాదం ఏర్పడింది. నెలాఖరులోగా ఆ నిధులను వినియోగించకపోతే ఆ మొత్తాలను పాఠశాలలు వదులుకోవాల్సిందే. ప్రభుత్వ రంగంలోని 1 నుంచి 12 తరగతుల వరకూ విద్యార్థులు ఉన్న విద్యా సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంపోజిట్ స్కూల్ గ్రాంటు పేరుతో మౌలిక వసతులకు నిధులు విడుదల చేస్తున్నాయి. ఆయా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా వీటిని ఇస్తున్నాయి. 2023-24 విద్యాసంవత్సరంలో జిల్లాలోని పాఠశాలలకు ఈ నిధుల కింద ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో రాష్ట్రప్రభుత్వం పాఠశాలలకు రావాల్సిన కాంపోజిట్ గ్రాంట్‌లో 50శాతం విడుదల చేసింది. గత ఏడాది నిధులు లేక పాఠశాలల కనీస అవసరాలకు తమ జేబులోని డబ్బులు పెట్టామని గగ్గోలు పెట్టిన హెచ్‌ఎంలు ఈ ఏడాది నిధులు జమ కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో పాఠశాలలకు సమగ్ర శిక్ష ద్వారా రూ.2.81కోట్లు విడుదల చేశారు. ఈ నిధుల వినియోగానికి సంబంధించి ఎస్‌ఎంసీ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయాలి. వాటికి అనుగుణంగా చేపట్టే పనులు, కొనుగోలు చేసే మెటీరియల్‌కు సంబంధించిన అంచనాలను ముందుగా హెచ్‌ఎంలు పీఎంసీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దానికి అనుగుణంగా ప్రింట్ పేమెంట్ అడ్వయిస్(పీపీఏ) తయారు చేసి సంబంధిత మండల విద్యాధికారి ధ్రువీకరణతో పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా బ్యాంకుకు సమర్పిస్తే నిధులు హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ జాయింట్ ఖాతాకు జమ అవుతాయి. వీటి వినియోగానికి సంబంధించిన బిల్లులు, ఓచర్లు కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ నిధుల వినియోగానికి ఇంత తతంగం ఉండగా ఇప్పటివరకు 87 పాఠశాలలకు సంబంధించి విడుదలైన రూ.9 లక్షల్లో ఒక్క పైసా కూడా ఖర్చుచేయలేదు. ఇప్పటికైనా తొందరపడకపోతే ఆ నిధులను వదులుకోవాల్సిందే.

7

సీఎం సభ పేరుతో వసూళ్లు..!

- ఒక్కో రిసోర్స్‌పర్సన్ రూ.400 ఇవ్వాల్సిందే
- సీవోలు, సీఎంఎం డిమాండ్

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండలోని వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా నిర్వహించిన ఎడ్ల బలప్రదర్శన హోరాహోరీగా సాగింది. రాత్రికి రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. వాటిపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



జయహో.. జవాన్..





తీరప్రాంత పరిరక్షణ కోరుతూ పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్‌ఎఫ్) చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం ఒంగోలుకు చేరుకుంది. ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘన స్వాగతం పలికారు. ఈనెల 7న కోల్‌కతా సమీపంలోని బక్కలి నుంచి 50 మంది జవాన్‌లతో ఈ యాత్ర ప్రారంభమైంది. ఈనెల 31న కన్యాకుమారికి చేరుకోనుంది.

- వివరాలు 7వ పేజీలో..



ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినిని పరామర్శిస్తున్న ఎస్పీ దామోదర్

విద్యార్థుల విహారయాత్ర బస్సుకు ప్రమాదం

- రోడ్డుపై ఆగివున్న లారీని ఢీకొన్న వైనం
- 13 మంది విద్యార్థినులు, ముగ్గురు టీచర్లకు గాయాలు
- ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స.. ఎస్పీ దామోదర్ పరామర్శ
- క్షతగాత్రులంతా కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని ప్రభుత్వ స్కూళ్లకు చెందిన వారు

6

ఏసీబీ వలలో ప్రిన్సిపాల్

- డబ్బులిస్తేనే జీతం బిల్లు చేస్తానని డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన అటెండర్
- చీమకుర్తిలోని నివాసంలోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- ఆయనపై ఇప్పటికే పలు ఆరోపణలు

చీమకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : లంచం తీసుకుంటూ గిరిజన రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ ఏసీబీకి చిక్కారు. తన పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అటెండర్ నుంచి డబ్బులు తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన శనివారం చీమకుర్తిలో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శిరీష కథనం ప్రకారం.. చీమకుర్తి పట్టణంలో గరికమెట్ట వద్ద ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్

మిగతా 6వ పేజీలో



పట్టుబడిన డబ్బుతో ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.26 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 4.52 (సోమవారం ఉదయం)

విద్యార్థుల విహారయాత్ర బస్సుకు ప్రమాదం

రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న వైనం

13 మంది విద్యార్థినులు...

మరో ముగ్గురు ఉపాధ్యాయులకు గాయాలు

బాధితులంతా కృష్ణా జిల్లా వాసులు



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు, లారీ

నాగులుప్పలపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రయాణిస్తున్న విహారయాత్ర బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న 13 మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు వైద్యసేవల నిమిత్తం తరలించారు. ఈ ఘటన నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు సమీపంలోని హైవేపై శనివారం తెల్లవారుజామున జరిగింది.



ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 88 మంది విద్యార్థులు, 11 మంది ఉపాధ్యాయులు చెన్నై, తిరుపతి నగరాల్లో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు ఈనెల 20న మూడు టూరిస్ట్ బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. అక్కడ సైన్స్ ఫెయిర్ అనంతరం పలు ప్రదేశాల్లో విహారయాత్ర ముగించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో శనివారం తెల్లవారుజామున విద్యార్థినులు ప్రయాణిస్తున్న బస్సు ఉప్పుగుండూరు సమీపంలోని గొల్లవానికుంట వద్ద మరమ్మతులకు గురై హైవే పక్కన ఆగి ఉన్న ధాన్యం లోడు లారీని ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న 13 మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. ముగ్గురు ఉపాధ్యాయులు స్వల్పంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను పరిశీలించి కేసు నమోదు చేశారు.

క్షతగాత్రులకు ఎస్పీ పరామర్శ

ఒంగోలు క్రైం: ఉప్పుగుండూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధిత విద్యార్థినులను ఎస్పీ ఏఆర్.దామోదర్ పరామర్శించారు. సమాచారం తెలుసుకున్న ఎస్పీ నగరంలోని జీజీహెచ్‌కు వెళ్లి క్షతగాత్రులతో మాట్లాడారు. తన ఫోన్‌తో వారి తల్లిదండ్రులతో మాట్లాడించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. విద్యార్థినుల తల్లిదండ్రులతో ఎస్పీ మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం వారికి పండ్లతో పాటుగా అవసరాల నిమిత్తం కొంత నగదును అందించారు. ప్రమాదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్రరావు, సీఐలు నాగరాజు, శ్రీనివాసరావు, అజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, ఎస్‌ఐ శ్రీకాంత్, అజయ్‌బాబు పాల్గొన్నారు.



గాయాలపాలై చికిత్స కోసం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చేరిన విద్యార్థినులు



క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

డివైడర్‌ను ఢీకొట్టిన ఆటో

ఇద్దరికి గాయాలు

సింగరాయకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలుకు చెందిన ఆటో డ్రైవర్ వల్లారయ్య శనివారం కావలి నుంచి ఒంగోలు వెళ్తుండగా పెరల్స్ డిస్టలరీ సమీపంలోకి వచ్చే సరికి ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అతనితోపాటు అందులో ప్రయాణిస్తున్న గురవయ్యకు గాయాలయ్యాయి. ఆటో ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాన నీటిని ఒడిసిపడదాం

(5వ పేజీ తరువాయి)

భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఆదేశించింది. నీటి సమస్య పరిష్కారం, సంరక్షణ పనుల పర్యవేక్షణ లక్ష్యంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆలోచన మేరకు ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రం పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలదినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఆ కేంద్రాన్ని ప్రారంభించగా కలెక్టర్ అన్సారియా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌లు పాల్గొన్నారు. జిల్లాలో నీటి వనరులు, భూగర్భ జలాల స్థితిగతులు, వాటిని సంరక్షించుకునేందుకు ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనుల నమూనాలు ఇందులో ఉంటాయి. డ్వామా సిబ్బందితోపాటు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రౌండ్‌వాటర్ ఇతర సిబ్బంది సమన్వయంతో ఈ కేంద్రం నడవనుంది. అన్నిరకాల నీటి సమస్యలను ఈ కేంద్రం వారు తీసుకోనే కాల్ సెంటర్ లాగా కూడా ఇది ఉపకరించనున్నట్లు సమాచారం.

ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం

(5వ పేజీ తరువాయి)

విషయం విదితమే. అందులోభాగంగా జనవరి 28న నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ పార్కులో ఏర్పాటు చేసిన సదస్సులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావులు పాల్గొనగా 37వ డివిజన్‌లోని వివిధ కాలనీలకు చెందిన ఐదారు వందల మంది ప్రజానీకం హాజరయ్యారు. తమ ప్రాంత సమస్యలను, మౌలిక సదుపాయాల మెరుగు అంశాలను ఆంధ్రజ్యోతి చర్చావేదికలో వారి దృష్టికి తీసుకొని రాగా కొన్నింటిపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వారికి హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. తక్షణ పనులపై ఎమ్మెల్యే ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు తొలుత ఆ ప్రాంతంలో శానిటేషన్ మెరుగు, ఆక్రమణల తొలగింపు పనులు చేశారు. ఆయా ప్రాంత ప్రజలు కోరిన పనులలో ప్రాధాన్యత గల వాటిని గుర్తించారు. సుమారు రూ.93.85 లక్షలతో 13 పనులకు ప్రతిపాదనలు తయారు చేశారు. దాదాపు ఇప్పటికే వాటిలో మూడొంతుల పనులకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తిచేశారు.

వాకింగ్ ట్రాక్‌ల ఆధునికీకరణ

37వ డివిజన్ ప్రజలందరి ఉమ్మడి అవసరాలలో కీలకమైన ఎన్టీఆర్ పార్కులో మూడు భాగాలుగా రూ.20.80 లక్షలతో లెవలింగ్, వాకింగ్ ట్రాక్‌ల ఆధునికీకరణ పనులకు టెండర్లు ఖరారయ్యాయి. కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ వారంరోజుల క్రితం ఇచ్చారు. ఆ పనులను శనివారం ఉదయం కార్పొరేషన్ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాలరావు, మునిసిపల్ ఇంజనీర్ చంద్రయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెన్నుపాటి ప్రసాదరావు, గణపతి మాస్టారు, మన్నం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. ఈ పనులను పది రోజుల్లో పూర్తిచేయాలని కమిషనర్ ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. డివిజన్‌లో ప్రతిపాదించిన ఇతర రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు, పార్కులో ఆట స్థలంలో కొత్త పరికరాల ఏర్పాటు తదితరాలపై దృష్టిసారించి కొద్దిరోజుల్లోనే వాటిని కూడా పూర్తి చేస్తామని కమిషనర్ తెలిపారు. కాగా పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం అక్కడి వాటర్ ట్యాంకు ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని స్థానికులు పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వాటర్ ట్యాంకు మెట్లపైకి ఇతరులు ఎక్కే అవకాశం లేకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

ఏసీబీ వలలో ప్రిన్సిపాల్

(5వ పేజీ తరువాయి)

బాలుర పాఠశాలలో ఎం.ప్రవీణ్‌కుమార్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్)గా వీరయ్య విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా వేసవి సెలవుల్లో పనిచేసినందుకు రెండు నెలలపాటు వచ్చే జీతానికి బిల్లులు పంపించాలంటే ఒక నెల జీతం తనకివ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేశాడు. దీంతో వీరయ్య అంతమొత్తం ఇచ్చుకోలేక ఒంగోలు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారిచ్చిన ప్లాన్ ప్రకారం శనివారం చీమకుర్తి పట్టణంలో తూర్పుబజార్‌లో నివాసం ఉంటున్న ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ ఇంటికి వెళ్లిన వీరయ్య రూ.17,500ను ఇచ్చారు. అదే సమయంలో అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు ప్రవీణ్‌కుమార్‌ని పట్టుకున్నారు. అక్కడి నుంచి అతనిని పాఠశాలకు తరలించారు. తదుపరి ఒంగోలుకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టనున్నారు.

ప్రిన్సిపాల్ వైఖరిపై పలు ఆరోపణలు...

ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌పై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డి పాఠశాలను సందర్శించారు. నాసిరకం బియ్యం, సరుకులతో వంటలు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నట్లు ఆయన గుర్తించారు. దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ ఇచ్చారు. అలాగే పాఠశాలలో పనిచేస్తున్న ఆయాకు జీతం చేసినందుకు లంచం తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 22 ఆంధ్రజ్యోతి: మార్కాపురంలో వెలసిన రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనా చార్యులు చెన్నకేశవస్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్ల మూలవిరాట్‌లకు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. రాయలసీమ నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో గొలమారి శ్రీనువాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

- పోటెత్తిన ప్రజలు.. 150 అర్జీలు అందజేత
- ఆరోగ్యం సహకరించకున్నా స్వీకరించిన ఎమ్మెల్యే కందుల



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గతంతో పోల్చితే ప్రజలు సమస్యలను తెలియజేసేందుకు భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలే దాఖలయ్యాయి. ప్రతి సమస్యను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు సూచించారు. మొత్తం 150 అర్జీలు దాఖలుకాగా సుమారు 80 వరకు అర్జీలకు వెంటనే పరిష్కారం చూపారు. కార్యక్రమంలో నియోజకవర్గ పోల్‌మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సెలైన్ పెట్టుకుని అర్జీలు స్వీకరణ

ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నంతసేపు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేతికి సెలైన్ పెట్టుకున్నారు. రెండు రోజులుగా ఆయన డయేరియాతో బాధపడుతున్నారు. ముందుగానే కార్యక్రమాన్ని ప్రకటించి ఉండటంతో ఆరోగ్యం సహకరించకున్నా ప్రజాదర్బార్‌ను కొనసాగించారు. ఒకవైపు ఎడమ చేతికి సెలెన్ పెట్టుకుని మరీ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

'ఉన్నతి' రుణాలను పంపిణీ చేసిన మంత్రి డోలా

టంగుటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కొండపి నియోజకవర్గంలోని 60 మంది మహిళా లబ్ధిదారులకు ఉన్నతి జీవనోపాధుల రుణాలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖమంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి శనివారం పంపిణీ చేశారు. మండలానికి 10మంది వంతున నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 60 మందికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ టి.నారాయణ, ఎస్సీ కార్పొరేషన్ డీడీ లక్ష్మానాయక్, ఈడీ అర్జున్‌నాయక్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు గడ్డం కవిత, ఆరు మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.



కోనేరు వద్ద స్వామివారికి నైవేద్యం వండుతున్న మహిళలు

వైభవంగా వెలుగొండ తిరునాళ్ల

- స్వామివారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొనకనమిట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండలోని వేంకటేశ్వరస్వామి బ్రహోత్సవాలలో భాగంగా శనివారం అంగరంగ వైభవంగా తిరునాళ్ల నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం కొండపై వెలసిన లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా స్వామివార్లకు గజోత్సవం, మోహిని ఉత్సవం వేడుకగా నిర్వహించారు. తిరునాళ్లకు వచ్చిన భక్తుల కోసం దేవాలయ ఆవరణలో, వివిధ అన్నదాన సత్రాలతో భక్తులకు అన్నదానం చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు కుందురు కాశి రెడ్డి కార్యక్రమాలు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వివిధ రాజకీయపార్టీల ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. విద్యుత్ ప్రభలపై సాంస్కృతిక నాటకాలు, పాటకచేరీలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిదంగా కొనకనమిట్ల వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పొదిలి సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 135 మంది సిబ్బందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం పొదిలి ఆర్టీసి డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.



గ్రామోత్సవంలో వేంకటేశ్వరస్వామి

'బయోగ్యాస్' భూమిపూజ పనులు ముమ్మరం

- ఒక్కరోజులోనే వంద ఎకరాల్లో ముళ్లపొదల తొలగింపు
- పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

పీసీపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణానికి ఏప్రిల్ 2న భూమిపూజ చేయనున్న దృష్ట్యా సంబంధిత పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. వెంగళాయపల్లి పంచాయతీలోని సర్వేనెంబరు 652లో 475.57ఎకరాల భూమిని రిలయన్స్‌కు ప్రభుత్వం కేటాయించింది. శనివారం 40 ఎక్స్‌కవేటర్లతో సుమారు వంద ఎకరాల్లో ముళ్లపొదలను తొలగించారు. వెంగళాయల్లి నుంచి భూమిపూజ చేసే ప్రతిపాదిత స్థలం వరకు రోడ్డు పనులను చేపట్టారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఉగ్ర అధికారులు, స్థానిక నాయకులతో కలిసి జరుగుతున్న పనులను పరిశీలించారు. తొలగించిన ముళ్లపొదలన్నింటినీ దూరంగా ఒకచోట కుప్పగా వేయాలని అధికారులను ఆదేశించారు. మరో రెండుమూడు రోజుల్లో జంగిల్ క్లియరెన్స్‌ను పూర్తిచేయించాలని ఆదేశించారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

బయోగ్యాస్ భూమిపూజకు గడువు సమీపిస్తున్న కొద్దీ అధికారులందరూ యుద్ధప్రాతిపదికన పనులు చేస్తుంటే విద్యుత్ అధికారులు నిబంధనలను సాకుగా చూపి నిర్లక్ష్యం వహించడంపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దివాకరపల్లి రోడ్డు మార్గంలో అడ్డుగా ఉన్న విద్యుత్‌స్తంభాలను మార్చాలని ఆదేశించినా వారిలో స్పందనలేదు. భూమిపూజ జరిగే ప్రాంతంలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఆదేశాలు ఉన్నా నేటివరకు ఎటువంటి పురోగతి లేదని రిలయన్స్ ప్రతినిధులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడగా వైర్ అందుబాటులో లేదని కుంటిసాకులు చెప్పారు. దీంతో వారి తీరుపై ఆగ్రహించిన ఎమ్మెల్యే ఉగ్ర రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఫోన్ ద్వారా వివరించారు. స్పందించిన మంత్రి సోమవారంలోగా విద్యుత్ లైన్లు ఏర్పాటుచేయకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని ఉగ్రకు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కరణం తిరుపతయ్య, బత్తిన రాధాకృష్ణ, వీరయ్య, మహేష్, కొండారెడ్డి, మనోజ్, చెన్నుపాటి అంజయ్య, వీరయ్య, దశరధరాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

అవినీతికి పాల్పడితే ఇంటికే!

- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర హెచ్చరిక

కనిగిరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై వచ్చే ప్రజల నుంచి ముడుపులు తీసుకుంటే ఆయా అధికారులను ఇంటికి పంపిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్‌ను తొలగిస్తున్నట్టు వస్తున్న ప్రచారం అవాస్తవమన్నారు. ఎస్సీ హాస్టల్ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులకు అసౌకర్యంగా ఉందన్నారు. మరమ్మతుల దృష్ట్యా విద్యార్థులను మరో హాస్టల్‌కు తరలించినట్టు చెప్పారు. ప్రజల్లో తప్పుడు ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు సమస్యలపై ఇచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. పరిష్కారం కాని వాటి వివరాలను తెలియజేస్తూ తగు వివరణ ఇవ్వాలని సూచించారు. అలాకాకుండా కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకుంటే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

26న విద్యార్థులకు అవగాహన సదస్సు

ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఈనెల 26న విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీ.నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ బృందం అవగాహన కల్పిస్తుందని, జిల్లాలోని విద్యార్థులందరూ ఈ సదస్సుకు హాజరుకావాలని ఆయన కోరారు.



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం..!

వైభవంగా శ్రీనివాస కల్యాణం

సింగరాయకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో శనివారం రాత్రి శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి తరించారు. గోవింద నామస్మరణతో రైల్వేస్టేషన్ రోడ్డు మార్మోగింది. తెనాలి నుంచి తిరుమల వరకు పాదయాత్ర చేస్తున్న పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి, ఆర్యవైశ్య ప్రతినిధులు కొత్తూరి రంగనాయకులు, ఆర్యవైశ్యనాయకులు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు.



సీఎం సభ పేరుతో వసూళ్లు..!

- బ్యాంకర్లకు బహుమతులు..
- ఒంగోలులో ఒక్కో రిసోర్స్‌పర్సన్ రూ.400 ఇవ్వాల్సిందే
- సీవోలు, సీఎంఎం డిమాండ్

ఒంగోలు మెప్మాలో వసూళ్ల వ్యవహారం విమర్శలకు తావిస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ముఖ్యమంత్రి సభ పేరుతో ఖర్చులు భరించాలంటూ సీఎంఎం, సీవోలు డిమాండ్ చేయడం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. అలాగే పొదుపు సంఘాలకు రుణాలు మంజూరు చేస్తున్న క్రమంలో కొన్ని బోగస్ గ్రూపులు కూడా ఉండటం ఆ వ్యవహారంలో మెప్మా సిబ్బందికి కూడా పెద్దమొత్తంలో లబ్ధి చేకూరడంతో అందుకు బ్యాంకర్లకు బహుమతులు అందజేసినట్లు తెలిసింది. అయితే ఈ వ్యవహారాన్ని దాచిపెట్టి, సీఎం సభకు రూ.లక్షలు ఖర్చయ్యాయి. ఆ ఖర్చును ఆర్పీలు కూడా భరించాలనే పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.400 వసూలు చేయడం ఇప్పుడు విమర్శలకు తావిస్తోంది.

- ఒంగోలు, కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

సీఎం సభ పేరుతో వసూళ్ల భాగోతం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈనెల 8న రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో మార్కాపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. అయితే ఆ సభకు పట్టణ పొదుపు సంఘాల నుంచి ఆర్పీలు, సీవోలు, సీఎంఎంలు వెళ్ళారు. సభ కోసం మెప్మా ఆధ్వర్యంలో నాలుగు ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. అయితే సభ ముగిసి పదిహేను రోజుల తర్వాత అధికారులు వసూళ్ల పర్వానికి తెరతీయడంపై సర్వత్రా విమర్శలకు వినిపిస్తున్నాయి. ఒంగోలు నగరంలోని మెప్మా పరిధిలో ఒక సీఎంఎంతోపాటు, సుమారు 30 మంది సీవోలు, 154 మంది ఆర్పీలు పనిచేస్తున్నారు. మార్కాపురంలో సీఎం సభకు రూ.లక్ష వరకు ఖర్చయ్యిందని నగర పరిధిలోని మెప్మా కీలక అధికారి ప్రతి ఆర్పీ రూ.400 చెల్లించాలని డిమాండ్ చేయడంతో వారు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

బ్యాంకర్లకు బహుమతులు..!

ఆర్పీల నుంచి డబ్బులు డిమాండ్‌పై కొందరు తమకెందుకులే అని చెల్లించగా, కొందరు మాత్రం సీఎం సభ అయిపోయాక ఈ వసూళ్ల ఏమిటని వారిస్థాయిలో విచారణ చేశారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సంఘాలకు బ్యాంకులు విరివిగా రుణాలు అందజేస్తుండటంతో అందుకు సీఎంఎం ఆధ్వర్యంలో పెద్దమొత్తంలో బహుమతులు అందజేసి, బ్యాంకర్ల మెప్పు కోసం ప్రయత్నించినట్లు తెలిసింది. అలా చేయడం నిబంధనలకు విరుద్ధం కావడంతో సీఎం సభ ఖర్చు పేరు చెప్పి వసూళ్లకు పాల్పడటంతో నగదు చెల్లించిన వారు ఈ వ్యవహారాన్ని తప్పుబడుతున్నారు.

విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం సభ కోసం ప్రభుత్వం నుంచి రూ. 2లక్షలు ఇచ్చారు. ఎక్కడ ఎలాంటి లోటు లేకుండా, ఇబ్బందులు రాకుండా ఖర్చుచేశాం. సీఎం సభ విజయవంతంలో మెప్మా భాగస్వామ్యం కావడం పట్ల సంతోషంగా ఉంది. అయితే సీఎం సభకు ఖర్చు పేరుతో ప్రతి ఆర్పీ నుంచి రూ.400 వసూలు చేస్తున్నట్లు వస్తున్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తాము. వాస్తవమని తేలితే అందుకు బాధ్యులుపై శాఖపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రభుత్వపరంగా నిర్వహించే కార్యక్రమాలలో మెప్మా భాగస్వామ్యం ఉంటుంది. అయితే ఆ కార్యక్రమాలకు ఎవరిక దగ్గర నుంచి ఎలాంటి వసూళ్ళు చేయకూడదు. ఇది చట్టవిరుద్ధం.

- శ్రీహరి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్

పెళ్లయిన తొమ్మిది రోజులకే..

- గుండెపోటుతో వైద్యుడు మరణం



శివాచారి(32)

పెదకాకాని, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పారాణి ఆరకముందే ఒక యువ వైద్యుడు గుండెపోటుతో కన్నుమూశాడు. ఈ హృదయ విదారక ఘటన గుంటూరు జిల్లా పెదకాకాని మండలంలోని వెనిగండ్లలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఒంగోలుకు చెందిన శివాచారి(32) డాక్టర్. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామంలోని ఆస్పత్రికి వైద్యుడిగా పనిచేస్తున్నారు. కుటుంబ పెద్దలు లావణ్య అనే వైద్యురాలితో ఈనెల 13వ తేదీన ఒంగోలులో వివాహం జరిపించారు. భాగస్వామితో జీవితాన్ని ప్రారంభించిన డాక్టర్ శివచారి రెండు రోజుల క్రితం అర్ధరాత్రి అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని చికిత్స కోసం విజయవాడలోని ఒక ప్రైవేటు వైద్యశాలలో చేర్చారు. గుండెకు ఆపరేషన్ చేశారు. అయినా కానీ ఆయన కోలుకోలేకపోయారు. శస్త్రచికిత్స జరిగిన కొన్ని గంటలకే కన్నుమూశారు. పెళ్లి జరిగిన 13 రోజుల్లోనే శివాచారి మృతిచెందటం రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది.

పాఠశాలల పనివేళలు మారాయి

- ఐదు రోజుల్లో మూడు సార్లు మార్పు

ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల పనివేళలు మళ్లీ మారాయి. ఈనెల 17 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభమైన ఐదు రోజుల్లో పాఠశాలల పనివేళలను మూడు సార్లు మారుస్తూ విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఈనెల 15 నుంచి పాఠశాలలు ఒంటిపూట నిర్వహించేందుకు ఉదయం 7.45 నుంచి 12.30 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో పరీక్ష జరిగిన రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తరగతులు నిర్వహించాలని, పరీక్షలేని రోజు యథావిధిగా నిర్వహించాలని కమిషనర్ ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఆ ప్రకారమే రెండు రోజులు జరిగాక ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రంగప్రవేశం చేసి కమిషనర్ ఉత్తర్వులను తూచ్ అని పక్కన పెట్టి పరీక్షా కేంద్రాలున్న పాఠశాలలను పరీక్ష ముగిసే వరకు పరీక్ష ఉన్నా లేకున్నా పాఠశాలలను మధ్యాహ్నం 1.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్ష లేని రోజుల్లో విద్యార్థులు మధ్యాహ్నం ఎండకు పాఠశాలలకు వెళ్లాలంటే ఎంతో ఇబ్బంది కలుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహించారు. శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ నిర్వహించిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో పలువురు సంఘ నాయకులు సమస్యను కమిషనర్‌కు వివరించారు. దీనిపై స్పందించిన కమిషనర్ విషయాన్ని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌కు చెప్పి వెంటనే పనివేళలు సవరించమని ఆదేశించారు. దీంతో గత్యంతరం లేక ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవి కృష్ణారెడ్డి పాఠశాలల పనివేళలను మళ్లీ సవరించారు. పరీక్ష ఉన్న రోజు మాత్రమే విద్యార్థులకు మధ్యాహ్నం తరగతులు నిర్వహించాలని, పరీక్షలేని రోజుల్లో యథావిధిగా ఉదయమే తరగతులు నిర్వహించాలని అదేశాలు జారీ చేశారు.

మోటారు బైకును ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వరికుంటపాడు బస్టాండ్ సెంటర్ సమీపంలోని జాతీయ రహదారిపై వెళ్తున్న మోటారు బైకును శనివారం వెనుక నుంచి కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. మరొకరికి గాయాలయ్యాయి. పల్నాడు జిల్లా భీమవరం గ్రామానికి కృపారావు(35), జ్ఞానయ్య(42) టంగుటూరులో పొగాకు క్యూరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిద్దరూ నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం పొంగూరులోని బంధువుల వద్దకు వెళ్లి తిరిగి మోటారుబైకుపై టంగుటూరుకు ప్రయాణమయ్యారు. ఆ సమయంలో దుత్తలూరు నుంచి లింగసముద్రం వెళ్తున్నకారు వేగంగా ఢీకొంది. దీంతో ఒకరికి తీవ్రంగా, మరొకరికి స్వల్పంగా గాయాలవడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన కృపారావును ఉదయగిరి నుంచి మెరుగైన చికిత్స కోసం ఆత్మకూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు.



జవాన్ల సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ఎస్పీ దామోదర్

తీరప్రాంత పరిరక్షణకు సీఐఎస్ఎఫ్ సైకిల్ యాత్ర

- ఘన స్వాగతం పలికిన జిల్లా పోలీసులు
- 50 మంది జవాన్ల సాహసం

ఒంగోలు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అంతర్గత శాంతి భద్రతల పరిరక్షణలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్) పాత్ర గణనీయమని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. తీర ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఈనెల 7న కోల్‌కతా సమీపంలో బక్కలి నుంచి బయలుదేరిన ర్యాలీ 31కి కన్యాకుమారికి చేరుకుంటుందని అన్నారు. ర్యాలీలో 50 మంది జవాన్లు పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ర్యాలీకి ఎస్పీ ఏఆర్.దామోదర్ నేతృత్వంలో పోలీసులు స్వాగతం పలికారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన స్వాగత కార్యక్రమంలో సీనియర్ కమాండెంట్ సంజిత్ కుమార్ మాట్లాడుతూ 50 మందితో బయలుదేరిన సైకిల్ యాత్రలో 14 మంది మహిళా జవాన్లు ఉన్నారని తెలిపారు. అనంతరం ఒంగోలు నుంచి కన్యాకుమారికి బయలుదేరిన ర్యాలీని ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొని వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌సింగ్, అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


రైతుల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు

- మంత్రి డాక్టర్ స్వామి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అన్నివర్గాల ప్రజలు, రైతుల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులను పటిష్టంగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి వెల్లడించారు. స్థానిక జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జలశక్తి కేంద్రాన్ని శనివారం మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో చేపడుతున్న నీటి సంరక్షణ పనుల నమూనాలను పరిశీలించారు. అనంతరం అక్కడ నిర్మించనున్న రూఫ్ వాటర్ హర్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి స్వామి మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భావితరాలకు నీటిని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కరువు ప్రాంతాల్లో పంటకుంటలు, చెక్‌డ్యామ్‌లు, ఇంకుడు గుంతల నిర్మాణాలతో పాటు ఇంటి రూఫ్ వాటర్‌ను నిల్వ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో వాటర్ గణంకాల ప్రకారం 12 మండలాల్లో 93 గ్రామాల్లో భూగర్భజలాలు బాగా అండుగుంటాయన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ డ్వామాతోపాటు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, భూగర్భజలశాఖలను సమన్వయంచేస్తూ డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కేంద్రం నుంచి జిల్లాలో నీటి సంబంధిత సమస్యలతో పాటు నీటి సంరక్షణకు చేపట్టే కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని చెప్పారు. రానున్న మూడు, నాలుగు నెలల్లో నీటి సంరక్షణ పనులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, డామా పీడీ జోసఫ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, భూగర్భజలశాఖ డీడీ విద్యాసాగర్, సోషల్‌వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్ తదితరులు ఉన్నారు.

క్షయ నిర్ధారణకు ప్రత్యేక యంత్రాలు

- జిల్లా వ్యాప్తంగా 4,784 వ్యాధి కేసులు నమోదు
- రేపు ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం



ఒంగోలు కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నిర్ధారణకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. క్షయను నిర్ధారించేందుకు ప్రత్యేక యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు.

క్షయ వ్యాధి లక్షణాలు

క్షయ వ్యాధి లక్షణాలను పరీక్షల ద్వారా గుర్తిస్తారు. రెండు వారాలకు మించి దగ్గు, రెండువారాలకు మించి జ్వరం, మూడు నెలల కాలంలో శరీర బరువులో ఐదు నుంచి పదిశాతం తగ్గడం, దగ్గినప్పుడు కళ్లెలో రక్తం పడటం, ఛాతి ఎక్స్‌రేలో ఏమైనా అనుమానస్పద మరకలు ఉండటం వంటి ద్వారా లక్షణలను గుర్తించారు. కోమోర్బిడిటీస్ ఉన్నవారు షుగర్, హెచ్ఐవీ, క్యాన్సర్, కిడ్నీవ్యాధులు, పౌష్టికాహార లోపం ఉన్నవారు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు ఒక్కరోజు దగ్గు వచ్చినా సమీపంలోని కళ్లె పరీక్షా కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని నిర్ధారించుకోవచ్చు.

జిల్లాలో పరీక్షలు చేసే కేంద్రాలు

ఒంగోలులోని జీజీహెచ్, మార్కాపురంలోని జిల్లా ఆస్పత్రిలో సీబీఎన్ఏటీ యంత్రాల ద్వారా పరీక్షలు చేస్తారు. 33ఆర్‌టీ పీసీఆర్ యంత్రాలు అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అన్ని మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 72 మైక్రో స్కోపీ ద్వారా కళ్లె పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లాలో 4784 కేసులు నమోదు

జిల్లాలో గత ఏడాది 4784 క్షయ వ్యాధి కేసులను గుర్తించారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 75150 కళ్లె పరీక్షలు నిర్వహించగా 4784 కేసులు నమోదు కావడంతో వారికి చికిత్స అందిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో 2823 కేసులు నమోదు కాగా ప్రైవేటు వైద్యశాలల్లో 1961 కేసులు వచ్చాయి. టీబీ రోగులు ఉన్న ప్రతి ఇంట్లో వారందరినీ, వారితో కలిసిన కాంట్రాక్ట్స్ ఉన్న వారందరూ తప్పనిసరిగా క్షయ వ్యాధి పరీక్షలు చేయించుకోవాలి. టీబీ ఇన్ఫెక్షన్ పాజిటివ్ వస్తే ముందస్తుగా టీబీ నివారణ చికిత్స మందులు ఇస్తారు. టీబీ రోగులకు గత ఏడాది నవంబరు 1కి ముందుగా గుర్తించి చికిత్స తీసుకున్న రోగులకు నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు ఇస్తారు. నవంబరు 1 తర్వాత క్షయ వ్యాధి సోకి చికిత్స పొందుతున్న రోగులకు నెలకు 1000 చొప్పున ఆరు నెలల పాటు ప్రధానమంత్రి నిక్షయ పోషణ పథకం కింద ఇస్తారు. జిల్లాలో 12 టీబీ యూనిట్లు ఉండగా వాటి ద్వారా అన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అనుసంధానం చేసి క్షయ వ్యాధి కేసులను గుర్తించి మందులు ఇస్తుంటారు.

అనుమానితులు పరీక్షలు చేయించుకోవాలి



అనుమానం ఉన్న వారందరూ తప్పనిసరిగా క్షయ వ్యాధి పరీక్ష చేయించుకోవాలి. అందుబాటులో కళ్లె పరీక్ష నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకున్నాం. జిల్లాలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈ పరీక్షలు చేయించుకోవడం ద్వారా జిల్లా నుంచి క్షయ వ్యాధిని నివారించొచ్చు. ప్రైవేటు హాస్పిటల్స్ ప్రైవేటు మందుల షాపుల భాగస్వామ్యంతో డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ అనుసంధానంతో ఎక్కడైనా టీబీ కేసులు ఉన్నా గుర్తించి మందులు పంపుతాం.

- డాక్టర్ బెజవాడ శ్రీవాణి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్‌అండ్ టీబీ అధికారి

కుటుంబం అంతానికి పన్నాగం!

- విద్యుత్‌స్తంభం నుంచి ఇంటిలోకి తీగల ఏర్పాటు
- బాత్‌రూం నుంచి బయటకు వచ్చే తీగలను తాకేలా ఏర్పాటు
- త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడిన కుటుంబం
- ఇంటి పరిసరాలను పరిశీలించిన ఎస్సై

కంభం (అర్ధవీడు), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామంలో పురుగుమందుల వ్యాపారం చేసే గోదేశి ప్రసాద్ కుటుంబాన్ని హతమార్చేందుకు దండుగలు వ్యూహం పన్నారు. వివరాల్లోకి వెళితే... గోదేశి ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రోజు మాదిరిగా కుటుంబం ఇంటిలో నిద్రపోయింది. అయితే గుర్తుతెలియని వ్యక్తులు వారి ఇంటి వెనుకవైపు బాత్‌రూం సమీపంలో విద్యుత్ తీగలను నేలపై పరిచారు. అనంతరం ఆ తీగలను విద్యుత్ స్తంభం సర్వీసు వైరుకు కలిపారు. అయితే అగంతకులు రెండు తీగలను న్యూట్రల్‌కే తగిలించి వెళ్లారు. దీంతో బాత్‌రూం వద్ద పరిచిన తీగలకు విద్యుత్ ప్రసారం కాలేదు. ప్రసాద్ భార్య ఉదయం లేని ఇక్కడి తీగను గమనించకుండా తొక్కింది. అయితే చిన్నపాటి విద్యుత్ జర్క్ రావడంతో ఆమె కాలిని వెనక్కు తీసుకున్నారు. అనంతరం భర్త ప్రసాద్‌కు విషయం తెలియజేశారు. ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సుదర్శన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగలు విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన తీరును పరిశీలించారు. ఘటనపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. రెండు సంవత్సరాల క్రితం కూడా ప్రసాద్ వ్యవసాయ భూమి వద్ద విద్యుత్ ప్యానల్‌బోర్డుకు ఇలానే విద్యుత్ తీగలు అమర్చారు. అప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగలేదు. ఘటనపై అర్ధవీడు ఎస్సై సుదర్శన్ సమగ్రంగా విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రసాద్ ఇంటికి వచ్చి ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.



విద్యుత్ స్తంభానికి ఇచ్చిన కనెక్షన్



ప్రసాద్ ఇంటి పరిసరాల్లో వేసిన కరెంటు తీగలు

ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకోవాలి

మంత్రి బాలవీరాంజనేయస్వామి

కలెక్టర్ అన్సారియాతో కలిసి కనుమళ్లలో నీటికుంటకు భూమిపూజ



మామిడితోటలో సేద్యపు నీటికుంటకు భూమిపూజ చేస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

సింగరాయకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని వృథా చేయకుండా సంరక్షించుకుంటూ ప్రతి బొట్టూ భూమిలో ఇంకే విధంగా ఒడిసి పట్టుకోవాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. శనివారం మండలంలోని కనుమళ్ల గ్రామంలో నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న సేద్యపు నీటికుంటకు కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. ప్రజలతో నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సింగరాయకొండ బాలయోగినగర్‌లో రూ.2.30లక్షలతో నిర్మించిన ఫారంపాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఒంగోలు డ్వామా కార్యాలయంలో నీటి సమస్యలు పరిష్కరించేందుకు జలశక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. నీటిని సంరక్షించుకొనేందుకు నీటికుంట నిర్మాణాలకు చేపట్టాలని పిలుపునిచ్చారు. నీరు ఉంటేనే జీవకోటికి మనుగడ సాధ్యమని ప్రజలు గుర్తించి సంరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గత టీడీపీ ప్రభుత్వంలో నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా నీటి సంరక్షణకు చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కార్యక్రమాన్ని నిలిపివేసిందన్నారు. ప్రతి రైతు తమ పొలాల్లో కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎంతమంది రైతులు ముందుకొచ్చినా మంజూరు చేస్తామన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా వచ్చే 3,4 నెలల్లో 30 వేల ఇంకుడు గుంతలు, 9,500 నీటికుంటల నిర్మాణాలు చేపట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, తహసీల్దార్ రవి, ఎంపీడీవో జయమణి, పలుశాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

కొండపిలో..

కొండపి: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కొండపిలోని కళ్లగుంట ఆంజనేయులు అనే రైతు పొలంలో నీటి కుంట నిర్మాణానికి శనివారం ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి భూమిపూజ చేశారు. కార్యక్ర మంలో ఎంపీడీవో రామాంజనేయులు, ఉపాధి హామీ ఏపీవో మహాలక్ష్మి, ఈసీ ప్రసాద్, క్షేత్రసహాయకుడు డి.మస్తాన్ పాల్గొన్నారు.



కండే ఝాన్సీరాణికి ఘన నివాళి



ఝాన్సీరాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ సుజాత, కార్పొరేటర్లు, నాయకులు

ఒంగోలు(రూరల్), మార్చి22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం త్రోవగుంట గ్రామంలో పీడీసీసీ మాజీ చైర్మన్ కండే శ్రీనివాసులు సతీమణి ఝాన్సీరాణికి పలువురు ప్రముఖులు శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర టూరిజం చైర్మన్ నూకసాని బాలాజీ, పలువురు టీడీపీ నాయకులు హాజరై ఝాన్సీరాణి చిత్రపటం వద్ద పుష్పాలు సమర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కండే శ్రీనివాసులు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, త్రోవగుంట మాజీ సర్పంచ్ కట్టా శింగయ్య, నాయకులు వైవీ.సుబ్బారావు, కామేపల్లి శ్రీనివాసరావు, శింగరాజు రాంబాబు, డాక్టర్ మాదాసు వెంకయ్య, కసుకుర్తి అదెన్న, యాదాల రాజశేఖర్, పంబి బద్రిరెడ్డి, అనిల్‌కుమారి, మధుసూదనరావు, శ్రీపతి ప్రకాశం, కండే సుకుమార్, కండే నీలిమారాణి, నాయకులు ఎద్దు శశికాంత్‌భూషణ్, విజేంద్ర బహుజన్, జంక్షన్‌రావు, ప్రసన్నరాజు, కార్పొరేటర్లు బెంగుళూరు నరసయ్య, అంబడి ప్రసాద్, ఒంగోలు నగర టీడీపీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు టీడీపీ నాయకుల పరామర్శ



విద్యార్థినులను పరామర్శిస్తున్న వీరయ్యచౌదరి, మనోజ్‌కుమార్

నాగులుప్పలపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా మచిలీపట్నంకు చెందిన విద్యార్థినులు ప్రయాణిస్తున్న విహారయాత్ర బస్సు శనివారం తెల్లవారు జామున ఉప్పుగుండూరు సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఘటనలో క్షతగాత్రులను టీడీపీ నాయకులు పరామర్శించారు. ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న 13మంది విద్యార్థినులను, ముగ్గురు ఉపాధ్యాయులను మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి, టీడీపీ మండల అధ్యక్షులు మనోజ్‌కుమార్, మండల కోశాధికారి మెట్టు సుబ్బయ్యనాయుడు, ఎస్సీ సెల్ నాయకులు స్వర్ణ కిషోర్‌బాబు, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ పరామర్శించి ఆందోళన చెందవద్దని సూచించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకొన్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం అందించాలని వీరయ్యచౌదరి వైద్యులకు సూచించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు కృషి చేయాలని ఎస్ఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ వై.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక మంగమూరురోడ్డులోని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల తృతీయ సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభకు డైరెక్టర్ వై.సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాల నుంచి విద్యార్థులకు డిగ్రీ పట్టాతో పాటు ఉద్యోగ ఆఫర్ లెటర్‌తో బయటకు పంపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో ఇటీవల జరిగిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆయన ఆఫర్‌లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.రాజశేఖర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి రాజేంద్రబాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్కిల్‌హబ్'కు పేర్లు నమోదు చేసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలులోని ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీలో నిర్వహిస్తున్న స్కిల్‌హబ్ కంప్యూటర్ కోర్సుకు ఈనెల 28వతేదీలోపు రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జె.రవితేజయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. టెన్త్, ఆపై చదివిన నిరుద్యోగ యువతీ, యువకులకు మూడు నెలల పాటు కంప్యూటర్ కోర్సు ఉచితంగా నేర్పుతామని, వచ్చేనెల ఒకటో తేదీ కంప్యూటర్ కోర్సు ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు 7842004344 సెల్‌నంబరులో సంప్రదించాలని కోరారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి

● డీఏహెచ్‌వో బేబీరాణి



మందులను అందజేస్తున్న వైద్యాధికారులు, డీఏహెచ్‌వో బేబీరాణి

ఒంగోలు(రూరల్), మార్చి22(ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేయించాలని డీఏహెచ్‌వో బేబీరాణి కోరారు. ఒంగోలు నగరం కొప్పోలులో శనివారం రాష్ట్ర కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్, పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ రైతులు పశు సంపదను పెంచుకోవాలని, అధిక పాల ఉత్పత్తితో లాభాలు పొందాలని కోరారు. లేగదూడలకు నట్టల నివారణ మందు తాపించారు. పశుపోషకులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో డీడీ ఎస్.జగత్‌ప్రసాద్, ఏడీలు సురేంద్రప్రసాద్, డాక్టర్ బి.బసవశంకరరావు, డాక్టర్ సాహితి, మాజీ సర్పంచ్ కాట్రగడ్డ రఘుపతి, పాలకేంద్రం అధ్యక్షుడు కాట్రగడ్డ నాగేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

27న నాగన్నపాలెం ఉపసర్పంచ్ ఎన్నిక

మద్దిపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 27న నాగన్నపాలెం ఉప సర్పంచ్ ఎన్నికకు సమావేశం నిర్వహించనున్నట్లు ఈవోఆర్డీ రఘుబాబు శనివారం తెలిపారు. సమావేశానికి వార్డు సభ్యులందరూ హాజరు కావాలన్నారు. ఇందుకు సంబంధించి నోటీసులు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయాలి

● రాష్ట్ర అదనపు సంచాలకులు అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గర్భిణులకు నాలుగు నెలలకు ఒకసారి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. ఒంగోలులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం మాతాశిశు సంరక్షణ సేవలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ, కష్టతర కాన్పులకు అవసరమైన మౌలిక వసతులను అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదు అవుతున్న గర్భిణులకు ప్రణాళికాబద్ధంగా అన్ని వైద్యసేవలు సకాలంలో అందించి ఎంసీపీ కార్డు, ఆర్‌సీహెచ్ రిజిస్టర్, హెచ్ఎంఐఎస్ పోర్టర్‌లో నమోదు చేయాలని కోరారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి బర్త్‌ప్లాన్ తయారు చేయాలని చెప్పారు. ప్రధానంగా బాల్య వివాహాలను నివారించేందుకు లైన్ డిపార్ట్‌మెంట్ సహకారాలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు వైద్యశాలలో జరుగుతున్న ప్రసవాలపై ఆడిట్ నిర్వహించి నివేదికను అందించాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లో జాతీయ ఆరోగ్య కార్యక్రమలు అమలు చేయాలన్నారు. ఎన్‌సీడీ 3.0 ప్రకారం 18 ఏళ్ళు పైబడిన వారందరికీ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేటు వైద్యశాలలో జరిగే ప్రసవాలను గుర్తించి పోర్టర్‌లో వివరాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సమావేశంలో ఇమ్యూనైజేషన్ అధికారి పి.పద్మజ, డీపీఎంవో సౌజన్య, వైద్యాధికారులు వాణిశ్రీ, శ్రావణ్, సుజన, హేమంత్, సీనియర్ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

● కమిషనర్ వెంకటేశ్వరరావు



కబాడిపాలెంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్

ఒంగోలు కార్పొరేషన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు అలాగే, పాడైపోయి నిరుపయోగంగా ఉన్న డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని 12, 13 డివిజన్లలో పర్యటించిన ఆయన ఆయా డివిజన్‌లోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే. అక్కడి పారిశుధ్యం పరిశీలించిన కమిషనర్ మురుగునీటి పారుదల వ్యవస్థకు ఇబ్బందులను గుర్తించారు. కొత్తపట్నం బస్టాండ్ వైపు గల ప్రధాన కాలువ పాడైపోయిన కారణంగా కొత్తగా నిర్మాణానికి అంచనాలు వేయాలన్నారు. దాంతోపాటుగా కబాడిపాలెంలోని కమ్యూనిటీ హాలును పరిశీలించి దాని అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఎంఈ చంద్రయ్యకు సూచించారు. ఆయా డివిజన్‌లలో ప్రతిరోజు పారిశుధ్యం మెరుగుపరచాలని శానిటరీ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, డీఈ పద్మజ, ఏఈ రాజశేఖర్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి అమ్మనరాజు



చీమకుర్తిలో మాట్లాడుతున్న న్యాయాధికారి కోమలివల్లి

నాగులుప్పలపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫస్ట్ ఏడీజే కోర్టు న్యాయాధికారి డి.అమ్మనరాజు సూచించారు. శనివారం అమ్మనబ్రోలు గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు పోక్సో, సైబర్‌నేరాలు, బాలికలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చట్టాలు, సమాజంలో జరుగుతున్న నేరాలపై అమ్మనరాజు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ఎన్.శ్రీకాంత్, ఎస్ఐ బి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

చీమకుర్తిలో...

చీమకుర్తి: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై స్పెషల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి ఎస్.కోమలివల్లి విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సుకన్య, సీడీపీవో ఇవాంజిల్, నీలిమ, ఎస్ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పేస్ కళాశాలలో

ఒంగోలు విద్య: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు పోక్సోచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో చట్టం స్పెషల్ న్యాయాధికారి శైలజ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. లైంగిక వేధింపులు, అశ్లీలత వంటి నేరాల నుంచి పిల్లలను రక్షించేందుకు ఈ చట్టం ద్వారా ప్రత్యేకం పోక్సో కోర్టులు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, వీరాంజనేయులు, రమణబాబు, డీన్ సీవీ.సుబ్బారావు, రూప ఆక్ష్మేష్, ఎన్.వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ జిల్లా అధికారిగా నాగేశ్వరరావు

ఒంగోలు నగరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ జిల్లా అధికారిగా ఎం.నాగేశ్వరరావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు మత్స్యశాఖ జిల్లా అధికారిగా పనిచేసిన ఆవుల చంద్రశేఖరరెడ్డి అడిషనల్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. కాకినాడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీలో అడిషనల్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆయన విధుల నుంచి రిలీవ్ కాగా ఆ స్థానంలో నెల్లూరు జిల్లా మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు ఎం.నాగేశ్వరరావుకు జిల్లా మత్స్యశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా ఆయన సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

వెల్లంపల్లి హైవేపై సీసీ కెమెరాలు



సీసీకెమెరాలను ఏర్పాటు చేయిస్తున్న ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి జాతీయ రహదారిపై శనివారం ఎస్ఐ శివరామయ్య ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై వాహన ప్రమాదాలను నివారించటానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఈక్రమంలో సీసీకెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతకు అభినందన



మహేష్‌కు చెక్‌ను అందజేస్తున్న వైస్‌చాన్స్‌లర్ మూర్తి

ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పంజాబ్‌లో ఇటీవల జరిగిన ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజిత పతకం సాధించిన మహేష్‌కు స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో వీసీ డీవీఆర్.మూర్తి శనివారం రూ.20వేలు పారితోషికం అందజేశారు. సీఎస్‌పురం మండలంలోని బెల్లంకొండ డిగ్రీ కళాశాలలో చదువుతున్న మహేష్ ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరుపున ఈ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచారు. 72 కేజీల విభాగంలో రన్నరప్‌గా నిలిచిన మహేష్‌కు వీసీ రజిత పతకాన్ని అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో తెలంగాణ పోలీసుల హడావుడి

ఓ అపార్ట్‌మెంట్‌లో తనిఖీలు ● నివాసితుల ఆందోళన

ఒంగోలు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లో తెలంగాణ పోలీసులు హడావుడి సృష్టించారు. ట్రంకు రోడ్డు చివరలో ఉన్న బీకే అపార్ట్‌మెంట్‌లో శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. దీంతో అందులోని నివాసితులు భీతిల్లిపోయారు. స్థానిక పోలీసులకు సమాచారం అంది వారు రంగంలోకి రావడంతో గంటన్నర తర్వాత అక్కడ హడావుడి తగ్గింది. అందిన సమాచారం మేరకు.. తెలంగాణ రాష్ట్రంలో ఒక చెక్కు బౌన్స్ కేసులో విజయ్‌కుమార్ అనే వ్యక్తికి నాన్‌బెయిలబుల్ వారెంటు జారీ అయ్యింది. కోర్టు ఆదేశాల మేరకు ఆయన్ను అరెస్టు చేసేందుకు గాలింపు చేపట్టిన తెలంగాణ పోలీసులకు విజయ్‌కుమార్ ఒంగోలులోని బీకే అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో వారు శనివారం రాత్రి ఇక్కడికి చేరుకున్నారు. విజయ్‌కుమార్ అందుబాటులో లేకపోగా పోలీసుల గాలింపుతో బీకే అపార్ట్‌మెంట్‌లోని నివాసితులంతా భీతిల్లిపోయారు. వెంటనే వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సిబ్బంది కూడా ఫిర్యాదు చేశారు. దీంతో నగరంలోని పోలీసులు రంగంలోకి వచ్చి బీకే అపార్ట్‌మెంట్‌లో హడావుడి చేస్తున్న తెలంగాణ పోలీసులతో మాట్లాడారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా దాడులు చేయడం సమంజసం కాదని చెప్పి అక్కడి నుంచి వారిని తీసుకెళ్లారు. గంటన్నర తర్వాత అపార్ట్‌మెంట్‌లో పరిస్థితి చక్కబడింది.

30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

● బ్రహ్మయ్య మాదిగ



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

నాగులుప్పలపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్ల ఉద్యమ పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నట్లు ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో రెండు తెలుగు రాష్ట్రాలలోని ముఖ్యమంత్రులు శాసనసభల్లో చట్టం చేసిన సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ఉద్యమ గడ్డ ఈదుమూడి గ్రామంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్యమాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాత్ర మరువలేనిదన్నారు. ఎంతో మంది మాదిగ బిడ్డల ఆత్మ బలిదానాలు, త్యాగాలతో వర్గీకరణ సాధించామని, ఇది సాధన ఏ ఒక్కరి కృషి కాదని చెప్పారు. తమకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పానుగంటి షాలెంరాజ్, ఏటుకూరి విజయకుమార్, మానికొండ శ్రీధర్, ఎస్.వెంకటేశ్వర్లు, రాజు, జి.సుభాషిణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దర్శి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దర్శి మండలం బొట్లపాలెం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. మద్దిపాడు మండలం తెల్లబాడు గ్రామానికి చెందిన ఎం. అన్వేష్‌బాబు(36) దర్శిలోని స్టేట్‌బ్యాంక్‌లో హోమ్‌లోన్ డిపార్ట్‌మెంట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మోటార్‌సైకిల్‌పై వచ్చి వెళ్తుంటాడు. ఈనెల 21న విధులు ముగించుకొని రాత్రి దర్శిలో తిరునాళ్ల ఉండటంతో అక్కడే ఉన్నాడు. తిరునాళ్ల చూసి తెల్లవారుజామున ఇంటికి బయలుదేరాడు. సుమారు 4 గంటల సమయంలో బొట్లపాలెం దగ్గర చెట్టుకు ఢీకొని తీవ్ర గాయాలై మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

సచివాలయ ఉద్యోగినికి గాయాలు

మద్దిపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఏడుగుండ్లపాడు హర్షిణి కళాశాల వద్ద శనివారం స్కూటీ అదుపు తప్పి మహిళకు గాయాలయ్యాయి. అద్దంకి నుంచి ఒంగోలు సచివాలయంలో విధులు నిర్వర్తించేందుకు తన స్కూటీపై బయలు దేరిన మాధురికి పక్కగా కారు వేగంగా రావడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆమె గాయపడగా చికిత్స నిమిత్తం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

ఒంగోలు విద్య, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కాంపోజిట్ కోర్సు, ఓఎస్ఎస్‌సి పేపర్-1 పరీక్షకు 3700 మందికి 3690 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. తొమ్మిది ఫయింగ్ స్క్వాడ్లు 39 పరీక్షా కేంద్రాలను సందర్శించారని డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి

నాగులుప్పలపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరులోని చింతతోపు కాలనీలో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు శనివారం సర్పంచ్ దేవరకొండ జయమ్మ, కార్యదర్శి కిరణ్‌కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, యు.వెంకటేశ్వర్లు, ఎస్.రామారావు, కె.శ్రీనివాసరావు, జి.బసవపున్నయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి

మద్దిపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరిచేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ నారాయణరావు పేర్కొన్నారు. శనివారం మద్దిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ప్రసంగించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల వారీగా తాను త్వరలో పర్యటిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాద్, ఈవోఆర్డీ రఘుబాబు, ఏఈలు బాబు, రవి తదితరులు పాల్గొన్నారు.



అవీ..ఇవీ

ఆత్మరక్షణ విద్యలు అవసరం


ఆత్మరక్షణ విద్యను అభ్యసిస్తున్న బాలికలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలకు ఆత్మరక్షణ విద్యలు అవసరమని కరాటే మాస్టర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో శక్తిటీం బాలికలకు మహిళా సిబ్బంది, ఉపాధ్యాయులకు శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయించి నేరాల గురించి వివరించారు. అత్యవసరమైన నెంబర్లు 112, 181, 24 గంటలు అందుబాటులో ఉండే 1098లకు ఏ విధంగా ఫిర్యాదు చేయాలో వివరించారు. కరాటే మాస్టర్ శ్రీనివాసరెడ్డి వివిధ ఆత్మరక్షణ మెలుకువలు నేర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగయ్య, శక్తిటీం సభ్యులు పావని, రవి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గిద్దలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం గ్రామంలో దుగ్గెపోగు రాములమ్మకు చెందిన పూరిళ్లు అగ్ని ప్రమాదానికి ఆహుతైంది. దీంతో ఆ కుటుంబానికి వైసీపీ నాయకులు వేమిరెడ్డి రామచంద్రారెడ్డి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. పూరిళ్లు దగ్ధమైన సమయంలో ఆమె కుమార్తె వివాహం కోసం దాచివుంచిన నగదు, దుస్తులు కూడా దగ్ధమయ్యాయి. దీంతో రాములమ్మ కుటుంబానికి రామచంద్రారెడ్డి సాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ ఛైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి, సర్పంచ్ బి.సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ పొట్రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు నోటీసులు

గిద్దలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సరైన అనుమతులు తీసుకోకుండా, అలాగే అనుమతులు తీసుకుని అతిక్రమించి నిర్మాణాలు చేస్తున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతమంది వ్యక్తులు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాలకు అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేస్తున్నట్లు తెలిపారు. మరి కొందరు అనుమతులు తీసుకున్నప్పటికీ ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారందరికీ నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. సరైన అనుమతులు లేకపోతే మున్సిపల్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భవిష్యత్తు కోసం కలలు కనాలి


గ్రాడ్యుయేషన్ డే లో చిన్నారులు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం కలలు కని వారిని ఉన్నత శిఖరాలలో నిలబెట్టడానికి ప్రీ ప్రైమరీ నుంచే సిద్ధం చేయాలని కమలా విద్యా సంస్థల కరస్పాండెంట్ పెనుగొండ పవన్‌కుమార్ అన్నారు. స్థానిక కమలా సీబీఎస్ఈ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ వేడిక శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమలా విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ పెనుగొండ సింధూజ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఉన్న పరిస్థితులను గమనించి నైపుణ్యాధారిత విద్యా ఆవశ్యకత తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వరూప్ రంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గిద్దలూరుటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు సబ్‌డివిజన్ పరిధిలోని అంబవరం, సంజీవరాయునిపేట 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌డివిజన్ పరిధిలోని అంబవరం, సంజీవరాయునిపేట, ఉయ్యాలవాడ, బురుజుపల్లె, ముండ్లపాడు, కృష్ణంశెట్టిపల్లె, కంచుపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలతోపాటు గిద్దలూరు సెక్షన్‌లోని పీఆర్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పీఆర్‌కాలనీ, అర్బన్ కాలనీ, ఏబీఎంపాలెం, కొంగలవీడురోడ్డు, ఎస్టీకాలనీ, నరవ, బయనపల్లె, నల్లగట్ల, బ్రాహ్మణపల్లె, కొంగలవీడు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

జార్జిలో ముగిసిన ఎమర్- 2025


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి సురేష్

మార్కాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయస్థాయి టెక్నో, కల్చరల్ ఫెస్ట్ ఎమర్- 2025 శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో దాదాపు 200 టెక్నికల్ పేపర్లు, 50 పోస్టర్ ప్రజెంటేషన్లను విద్యార్థులు అందజేశారు. సుమారు 10 ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాల్లో ప్రతిభచాటిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను కాలేజీ టెక్నికల్ అడ్వైజర్, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అందజేశారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.రాజబాబు, డీన్ డాక్టర్ ఎం.మస్తానయ్య, కన్వీనర్లు డాక్టర్ పీపీఎస్ నాయక్, ప్రొఫెసర్ వైవీ ఆదిసత్యనారాయణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండవరోజు కొనసాగిన ఎండ్ల పందేలు

కొనకనమిట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలుగొండలో రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు రెండవరోజు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. వెలుగొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ పోటీలను మేకలవారిపల్లి రెడ్లసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. రెండవ రోజు న్యూకేటగిరికి చెందిన మొత్తం 11 ఎడ్లజతలు పోటీలలో పాల్గొనగా మొదటి బహుమతి రూ.70 వేలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.35 వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదవ బహుమతి 15 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. ఎడ్లపోటీలను తిలకించేందుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఎడ్ల పోటీలను రైతులు మండుటెండను సైతం లెక్కచేయకుండా తిలకించారు. ఆదివారం సీనియర్ విభాగం ఎడ్లపోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఎడ్లపోటీల నిర్వాహకులు, మోరబోయిన బాబురావు, పలువురు టీడీపీ నాయకులు, పలువురు రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- ప్రపంచ జల వనరుల దినోత్సవం సందర్భంగా సేద్యపు గుంతల ఏర్పాటు


ఇంకుడు గుంత పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి నీటిబొట్టు చాలా విలువైనదని, నీటిని వృథా చేయరాదని, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా పలు సేద్యపు గుంతలకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు లేకపోతే సమస్త జీవరాసుల మనుగడ సాధ్యం కాదన్నారు. ప్రతి నీటిబొట్టును దాచుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజలు నీటిని ఆదాచేసే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని పేర్కొన్నారు. నీటి సంరక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, సర్పంచ్ పి.మల్లేశ్వర య్యయాదవ్, పీఆర్ డీఈ సుబ్బారెడ్డి, ఎంపీడీవో రమణరెడ్డి, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ విభాగాల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : సేద్యపు నీటికుంటలతో వర్షాభావ పరిస్థితితో పంటపొలాలకు మేలు జరుగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని శివాపురంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద ఏర్పాటు చేయనున్న సేద్యపు నీటికుంట(ఫాం ఫౌండ్)కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ నీటి వనరులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుచూపుతో జలవనరులు వృథా కాకుండా భూగర్భజలాల వృద్ధికి ఉపయోగపడేలా నీటికుంటలు, కొండశివారు ప్రాంతాలలో కందకాల త్రవ్వకాలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దీంతో భూగర్భజలాలు వృద్ధి చెంది నీరు కొరత లేకుండా భవిష్యతు తరాలకు ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జాన్‌సుందరం, ఈసీ నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసులరెడ్డి, నాయకులు గొట్టం శ్రీనివాసులరెడ్డి, గుమ్మా గంగరాజు, జడ్డా రవి, సుబ్బరామిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టేందుకు రైతులు సేద్యపు కంటలను ఏర్పాట్లు చేసుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని గోగులదిన్నె గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతు ఏర్పాటు చేసుకుంటున్న ఫారంపాండుకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. కందుల ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ మార్కాపురం మండలంలో 260 ఫారంపాండులు మంజూరయ్యాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలంటే రైతులు తప్పనిసరిగా ఫాంపాండ్ గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. దాని వలన పంటలను నీటి ఎద్దడి నుండి కాపాడుకోగలుగుతార ని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో జీవరత్నం, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, మాలపాటి వెంకటరెడ్డి, మోరా వెంకటరెడ్డి, గోగులదిన్నె గ్రామ టీడీపీ నాయ కులు కాశిరెడ్డి, వెంకటరెడ్డి, రాజయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు, పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : నీటికుంటల ఏర్పాటు ద్వారా వర్షపు నీటినిల్వతో రైతులకు వరంలా మారతాయని ఎంపీడీవో నాసర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన (ఫాంఫండ్) నీటికుంటల నిర్మాణాల్లో భాగంగా మండలంలోని అయినముక్కలలో ఏర్పాటు చేసిన ఫాంఫండ్‌ను ఎంపీడీవో నాసర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించేందుకు 140 ఫాంఫండ్‌ల కోసం ప్రతిపాదనలు పంపామని ప్రస్తుతం 60 మంజూరయ్యాయని తెలిపారు. ఈ క్రమంలో ఒకటి పూర్తవగా, మరొకటి 90శాతం పూర్తయిందని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వర్షాకాలం నాటికి పూర్తి చేసి నీటినిల్వకు సిద్ధం చేస్తున్నట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వినయ్ కుమార్, ఈసీ చాణక్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్‌రెడ్డి, చంటి, పీ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శివాపురంలో నీటికుంటకు శంకుస్థాపన చేస్తున్న ఎరిక్షన్‌బాబు, అయినముక్కలలో కుంటను ప్రారంభిస్తున్న ఎంపీడీవో

ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి
- సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సూచించారు. శనివారం గిద్దలూరు పట్టణంలోని గణేష్‌నగర్‌లోని 1, 2, 3 వార్డులకు చెందిన సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఉద్యోగుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలించారు. సచివా లయ సిబ్బంది మొత్తం హాజరయ్యారా.?, లేదా..? అని ఆయన వాకబు చేశారు. నిరంతరం ప్రజలు వారి అవసరం నిమిత్తం సచివాలయానికి వచ్చినపుడు వారికి సహకరిస్తూ వారి అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరూ జవాబుదారి తనంతో విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల అమలులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఇక నుంచి నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలను, సచివాలయాలను తప్పనిసరిగా తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, కౌన్సిలర్లు బూనబోయిన చంద్రశేఖర్, లొక్కు రమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు షానేషావలి, టీడీపీ నాయకులు పాలుగుళ్ల చిన్న శ్రీనివాసరెడ్డి, దేమా శ్రీరాములు, బిల్లా రమేష్ పాల్గొన్నారు.


గణేష్‌నగర్‌లో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

విద్యార్థులకు ఏకపాత్రాభినయం పోటీలు


షిరోస్ ఏకపాత్రాభినయం పాంప్లెట్‌లు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తర్లుపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు డా. జాస్తి శివరామకృష్ణ, అయ్యల సోమరాజులు రచించిన షిరోస్-256 పాత్రల ఏకపాత్రభినయంను విద్యార్థులు నిర్వహించారు. ఈ పోటీల్లో 25 మంది విద్యార్థులు వివిధ రకాల పాత్రలతో ఏకాపాత్రాభియం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. షిరోస్ జీవితాన్ని చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో సమన్వయకర్త ఓవీ రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు శోభారాణి, హేమలత, సుజాత, ఓ.నరసింహారావు, కోటిమోహన్, శంకర్‌రెడ్డి, ఎన్.కిశోర్‌రెడ్డి, ఆర్.అచ్చయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కంభం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైతు సాధికారత సంస్థ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీని నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో శనివారం కంభం మండల రైతుశిక్షణ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన, వెలుగు సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఏవో స్వరూపా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2025-26 ప్రకృతి వ్యవసాయం తరపున ప్రణాళిక తయారు చేశారని, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రతి రైతు మొత్తం విస్తీర్ణం పంట, పేరు నమోదు చేసుకోవాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, వెలుగు సిబ్బంది సహకారం ప్రకృతి వ్యవసాయానికి ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం మాధవి, సీసీ దానమయ్య, ట్రైనర్ లలితమ్మ, రవీంద్రరెడ్డి, బిఎలు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులపై అదనపు శ్రద్ధ తీసుకోవాలి

పుల్లలచెరువు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో ఇందిరాప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని కవలకుంట్లలో ఆయా విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని పరిశీలించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ విద్యార్థులను విద్యాశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారికి అవసరమైన మేటీరియల్‌ను అందజేయాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండులు వారికి అవసరమైన వస్తువులు ఇవ్వడంతో పాటు వారికి మనోధైర్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ మిగులు భూములు నిరుపేదలకు పంచాలని బహుజన రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య అన్నారు. స్థానిక బహుజన రైతుసంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. భూమి ఉంటే భుక్తి కలుగుతుందున్నారు. సమానత్వం ఏర్పడుతుందని, పేదలకు భూములు పంచి సమానత్వం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2000 కోట్లు నిధులు మంజూరు చేయాలన్నారు. అనంతరం జిల్లా బహుజన రైతు సంఘం అధ్యక్షులుగా వలపర్ల మోషేబాబును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు లక్ష్మయ్య, రాజయ్య, పిచ్చయ్య, అబ్రహం, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

కంభం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని, ఎంఈవో మాల్యాద్రి తెలిపారు. శనివారం మండలంలోని కందులాపురం ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, విలువలతో కూడిన విద్యను నేర్పే ఉపాధ్యాయులు ఉన్నారని అన్నారు. గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు ప్రభుత్వ రుణాలను అందిపుచ్చుకోవాలి

ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచన


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్ : మహిళలకు ప్రభుత్వం ఇస్తున్న రాయితీతో కూడిన రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. స్థానిక జవహర్ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి క్యాంప్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాల మహిళలకు పీఎం అజయ్ పథకం ద్వారా మంజూరైన రాయితీతో కూడిన రుణాలను లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడం కోసం ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని అందిపుచ్చుకొని మహిళలు ఉన్నతంగా రాణించాలని కోరారు. డీఆర్‌డీఏ వెలుగు మార్కాపురం క్లస్టర్ కో-ఆర్డినేటర్ సుధాకర్ మాట్లాడుతూ పీఎం అజయ్ ఉన్నతి పథకం ద్వారా మార్కాపురం నియోజకవర్గంలో 9 మంది మహిళా ఎస్సీ లబ్ధిదారుకు రూ.50 వేల రాయితీతో కూడిన రూ.13 లక్షల విలువైన చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు ఏపీఎంలు దుగ్గెం పిచ్చయ్య, పి రమేష్‌బాబు, ఎల్‌సి నాగభూషణం, సీసీలు నాగయ్య సాయిలు, టీడీపీ నాయకులు జవ్వాజి రామాంజులరెడ్డి, చిన్నపరెడ్డి, గోపినాథ్, మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలి

మార్కాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం పార్టీ మార్కాపురం మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోట విజయం సాధించేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. అందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ప్రతి గ్రామంలో 60 ఓట్లకు ఒక కుటుంబ సాధికారక సభ్యున్ని (కేఎస్ఎస్) నియమించాలన్నారు. ఇది ప్రతి ఒక్కరి కర్తవ్యమన్నారు. కష్టపడి పనిచేసే వారినే కెఎస్ఎస్ సభ్యునిగా ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఆయా గ్రామాల్లోని నాయకులు నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. నియామకాల అనంతరం నియోజకవర్గ వ్యాప్తంగా సభ్యత్వం కార్డులను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కార్యకర్తలకు నాయకులు తోడ్పాటునందించి పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మార్కాపురం, తర్లుపాడు మండలాల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామాంజులరెడ్డి, ఉడుముల చిన్నపరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు షేక్ మౌలాలి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, మాజీ అధ్యక్షులు గొలమారి నాసర్‌రెడ్డి, మట్టం వెంకటేశ్వర్లు, దూదేకుల మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేయడమే పార్టీ లక్ష్యమని ఆ పార్టీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కుటుంబ సాధికార సారథులను ఏర్పాటు చేసి పార్టీ బలోపేతం దిశగా పని చేయాలన్నారు. ప్రతి 60 మంది ఓటర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేయాలన్నారు. తద్వారా ప్రతి ఓటరుకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరు ఆ దిశగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వై.పాలెం, పుల్లలచెరువు మండల పార్టీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ యూనిట్ సభ్యులు, బూత్ ఇన్‌చార్జీలు తదితరులు పాల్గొన్నారు.

కాటమరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు

పెద్దారవీడు : కాటమరాజు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని దేవరాజుగట్టులో కాటంరాజు దేవస్థాన కమిటీ ప్రతినిధులు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా దేవస్థానం వద్ద విద్యుత్ సరఫరాకు అవసరమైన 30 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా తాగునీటి ఇబ్బంది తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా పోలీసు శాఖతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎరిక్షన్‌బాబును కలిసిన వారిలో ఆలయ కమిటీ ప్రతినిధులు పీఎల్పీ యాదవ్, గుమ్మా గంగరాజు, గోసు వెంకటసుబ్బారావు, అల్లంరాజు శ్రీనివాసయాదవ్, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, కాయకాకుల శ్రీనివాస్ యాదవ్, తదితరులున్నారు.

ఎర్రగొండపాలెంలోని అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల పూర్తి కోసం కూటమి ప్రభుత్వంలో తొలి విడతగా రూ2.63 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో కళాశాలకు ఒక్కరూపాయి కూడా మంజూరు కాలేదన్నారు.

పనిభారం తగ్గించండి

పొదిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ సెక్రెటరీలపై పనిభారం అధికంగా ఉంటుందని ఆ భారాన్ని తగ్గించాలని శనివారం ఎంపీడీవో శోభన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా సెక్రెటరీలపై పనిభారం అధికమౌతుందని గ్రామ పంచాయతీ, సచివాలయ పరిపానతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని వారు ఆవేధన వ్యక్తం చేశారు. ఒత్తిడుల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని దీంతో మానసిక వేధనకు గురవుతున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఎంతపని చేస్తున్నామో గుర్తించాలన్నారు. పనిభారం మోపడంతోపాటు ఏచిన్న పొరపాటు జరిగినా పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయడం క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. కనుక పంచాయతీ కార్యదర్శులు చేయాల్సిన పనులు వరకు కేటాయిస్తే ప్రజలకు మంచి సేవలు అందించేందకు వీలుంటుందన్నారు. ఈకార్యక్రమంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి చేయూత

కొమరోలు, మార్చి22 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తూ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన కార్మికుని కుటుంబానికి ఆ గ్రామ టీడీపీ నాయకులు బోయిళ్ల బాలిరెడ్డి, మాజీ సర్పంచ్ సుమిత్రలు శనివారం ఆర్థికసాయం అందజేశారు. సూరవారిపల్లి పంచాయతీలోని బోడుసుపల్లి గ్రామనికి చెందిన దమ్ము అల్లూరయ్య పారిశుధ్య కార్మికుడిగా పనిచూస్తున్నారు. 15 రోజుల క్రితం ఆయన అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. గతంలో పనిచేసిన జీతాలు కూడా రాకపోవడంతో ఆకుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బాలిరెడ్డి రూ 3500ల నగదును అందచేశారు. వేతన బకాయిలు అందేలా చూస్తామన్నారు.

కస్తూర్బాలో ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానం

పెద్దదోర్నాల, మార్చి22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశం కోసం ధరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎల్ అనూష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు, 7, 8, 9, 12 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 22వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీ వరకు ధరఖాస్తులు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు, 6వ తరగతిలో 40 ఖాళీలు, 12 వ తరగతిలో 13సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. సెమీ అర్బన్, అర్బన్‌కు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులు అర్హులన్నారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకోవాలని వివరించారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

» అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి హెచ్చరించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ ప్రకాశం అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి అభివృద్ధిలో అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి అధికారులు వారధిగా ఉండి ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకునే అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని డాక్టర్ ఉగ్ర చెప్పారు. గతంలో ఏడాదికోమారు పాఠ్య, నోట్ పుస్తకాలను ఇచ్చేవారన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆరు నెలలకు ఓ మారు పుస్తకాలను అందిచేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ ప్రభుత్వ స్కూళ్లలో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదిగినవారేనని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. త్వరలోనే మత్తు డాక్టర్‌ను కూడా నియమించనున్నట్లు చెప్పారు. అప్పటి వరకు పామూరు ప్రాంతానికి చెందిన మత్తు డాక్టర్‌ను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రజలు ధైర్యంగా ఆసుపత్రులకు వెళ్లి ప్రసవాలు, ఆపరేషన్లు చేయించుకోవచ్చునని చెప్పారు.

బొమ్మిరెడ్డిపల్లి, చినఇర్లపాడు ప్రాంతాల్లో సాగర్ నీరు రావటం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. సాగర్‌నీరు సరఫరా చేస్తున్న సమయంలో పైపులు పగిలిపోయి లీకై ఉన్నాయన్నారు. రూ.4.5 కోట్లతో మరమ్మతులు చేపట్టనున్నట్టు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ పీసీపల్లిలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఏప్రిల్ 2న మంత్రి లోకేష్ వస్తున్నట్లు తెలిపారు. ఆసమయంలో సాగర్‌నీటి సరఫరా కోసం రామతీర్థం నుంచి సాగర్‌నీటి సరఫరా కోసం అవసరమైన రూ.84 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయనున్నట్లు తెలిపారు. ఆయా నిధులు సమకూరితే కనిగిరి ప్రాంతంలో మంచినీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

సమావేశంలో ఎంపీపీ ప్రకాశం, జడ్పీటీసీ కస్తూరరెడ్డి, ఎంపీడీవో హనుమంతరావు, తహసీల్దార్ రవిశంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ టి.శ్రీరాం, వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నీటి కుంటలతో భూగర్భ జలాలు పెంపుదల

» పొలాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం
» రైతులను చైతన్య పరుస్తున్న ఉపాధి సిబ్బంది


దొనకొండ: చిన్నగుడిపాడులో నీటికుంటను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

దొనకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను పెంపొందించటమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం రైతుల పంటపొలాల్లో నీటి కుంటలు(ఫాం పాండ్స్) తవ్వకాలకు శ్రీకారం చుట్టింది. రైతులను చైతన్యం కల్పించి ప్రతి పంచాయతీలో నీటి కుంటలు ఏర్పాటుచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఈక్రమంలో జలదినోత్సవం సందర్భంగా శనివారం చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన రైతు పొన్నెబోయిన నాగేశ్వరరావు తన వ్యవసాయ పొలంలో నిర్మించిన నీటికుంటను ఏపీవో దేవయ్య, టీడీపీ నాయకులు శృంగారపు నాగసుబ్బారెడ్డి, నిమ్మకాయల సుబ్బారెడ్డి, కొత్తం రఘునాథరెడ్డి, మోడి ఆంజనేయులు తదితరులు ప్రారంభించారు.

ఉపాధి హామీ పథకంలో రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండా నీటికుంటల నిర్మాణాలు జరిపేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వర్షపునీటి నిల్వలో కీలకమైన నీటి కుంటల నిర్మాణాలను చేపట్టింది. నీటికుంటలతో ప్రయోజనాలపై మండలంలోని గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది రైతులకు వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 180 నీటికుంటల నిర్మాణం చే పట్టాలన్నదే లక్ష్యం. ఇప్పటికే దాదాపు 25 వరకు పనులు జరుగుతున్నాయని, ఆరు గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయినట్లు ఉపాధి సిబ్బంది తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ జలప్రయోజనాలు కలిగించేలా రైతుల పొలాల్లో 7 మీటర్లు వెడల్పు, 7 మీటర్లు పొడవు, రెండు మీటర్ల లోతుతో చుట్టూ రాతి కట్టడంతో రూ.65 వేల ఖర్చుతో నీటికుంటల నిర్మాణాలు జరుగుతున్నాయి.

నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలి

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి సంరక్షణకు ఫాం పాండ్‌లు నిర్మించుకోవాలని ఏపీవో బి.మాల్యాద్రి తెలిపారు. అంతార్జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని దాదిరెడ్డిపల్లి గ్రామంలో ఫాం పాండ్ నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని వృథా చేస్తే భావితరాలకు కన్నీరు తప్పదన్నారు. ప్రతి ఇంటిముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ బి.యాకోబు, టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వెలిగండ్ల, మార్చి 22 :(ఆంధ్రజ్యోతి) రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని ఇమ్మడిచెరువు పంచాయతీలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఫాంపాండ్ పనులను శనివారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంపీడీవో ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం పది ఫాం పాండ్స్ నిర్మించాలన్నదే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో నాయక్, ఈసీ మనోహర్, ముక్కు వెంకటశ్రీరాముల రెడ్డి, పెరుగు శివ, తదితరులు పాల్గొన్నారు.

వేసవి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

» దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ సంధ్యారాణి

దర్శి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో సాగుచేసిన పంటలకు సోకిన తెగుళ్ళ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని దర్శి వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ పి.సంధ్యారాణి సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన శిక్షణ, సందర్శన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వేసవిలో ఒక తడి నీటితో పంట చేతికొచ్చే నువ్వులు సాగు చేసుకోవాలని సూచించారు. పత్తి పంటకు సోకుతున్న రసం పీల్చే పురుగుల నివారణకు సకాలంలో మందులు పిచికారీ చేయాలన్నారు. పంట దశలో ఉన్న కంది, వరి పంటలకు తెగుళ్ళు సోకకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సాగుచేసిన పంటలను శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు సందర్శించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, సీనియర్ శాస్త్రవేత్త సీహెచ్ వరప్రసాదరావు, కనిగిరి, మార్కాపురం, దర్శి, ఒంగోలు, సింగరాయకొండ, గిద్దలూరు ఏడీఏలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.విజయనిర్మల సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రంలో దర్శి సబ్‌డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, సిబ్బందికి హోం కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్, మిర్చి తోటల పెంపకం తదితర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాల వద్ద మిగిలిన వ్యర్థాలను హోం కంపోస్టింగ్‌గా తయారుచేసి మిద్దెలపై సాగు చేసుకున్న తోటలకు, కూరగాయల మొక్కలు వేసుకొని స్వచ్ఛమైన దిగుబడులు సాధించాలన్నారు. రసాయన ఎరువులతో పనిలేకుండా సేంద్రియ ఎరువుల వాడకాన్ని అలవర్చుకోవాలన్నారు. దర్శి ఏడీఏ కె.బాలాజీనాయక్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి ఎం.రవివెంకన్న బాబు, వ్యవసాయాధికారులు బాల కృష్ణానాయక్, శైలజారాణి, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

దర్శి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ జి.రమేష్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రపంచ నీటి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణలో అందరూ భాగస్వాములై నీటి వనరులను పెంపొందించాలని సూచించారు. తక్కువ నీటితో పంటలను పండించేందుకు మైక్రో ఇరిగేషన్ విధానాన్ని అవలంబించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది, వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు


రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

తాళ్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ప్రచార ఆర్భాటాలే తప్ప రైతులకు లబ్ధి చేకూరిందిలేదు. రైతుల సంక్షేమం కోసం పాటు పడుతున్నామంటూ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసింది. వీటిల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటుచేసిన కియోస్క్ యంత్రాలతో రైతులకు ఒనగూరిందేమిలేదు. గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన కియోస్క్ యంత్రాల పని తీరు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. రాయితీలపై ఎరువులు, పురుగుమందులు, విత్తనాల కొనుగోలుకు ఈయంత్రాలను ఏర్పాటుచేశారు. తొలినాళ్లల్లో కొంతమంది రైతులు ఈయంత్రాల ద్వారా విత్తనాలు, పురుగు మందులు కొనుగోలుచేశారు. ఈ యంత్రాన్ని వినియోగించేందుకు ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి. రైతు భరోసా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారేతప్ప ఇంటర్నెట్ సదుపాయాన్ని కల్పించలేదు. దీంతో నాటి ఆర్‌బీకే సిబ్బంది తమ ఫోన్ల ద్వారా ఇంట ర్నెట్ సదుపాయాన్ని వినియోగించుకుని కొంతకాలం కియోస్క్ యంత్రాలను ఉపయోగించారు.

ఆతరువాత గత ప్రభుత్వం స్మార్ట్‌ఫోన్లలో సంబంధిత యాప్‌లను అందుబాటులోకి తేవటంతో రైతుభరోసా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది కియోస్క్ యంత్రాల జోలికి వెళ్లలేదు. దీంతో లక్షలాది రూపాయలతో ఏర్పాటుచేసిన కియోస్క్ యంత్రాలు దుమ్ము పట్టి అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.

తాళ్లూరు మండలంలోని 14 సచివాలయాలల్లో 14 కియోస్క్ యంత్రాలను రూ.13 లక్షలు వెచ్చించి ఏర్పాటుచేశారు. కొన్ని నెలలు మాత్రమే ఇవి పనిచేశాయి. ప్రస్తుతం అవి పనిచేయకపోవటంతో రూ.13 లక్షల నిధులు వృథా అయ్యాయి. ఈవిషయమై తాళ్లూరు మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావును వివరణ కోరగా రైతాంగానికి ఉపయోగపడే అంశాలు యాప్‌ల రూపంలో అందుబాటులోకి వచ్చాయన్నారు. దీంతో కియోస్క్ యంత్రాలను వినియోగించటం లేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దర్శి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొట్లపాలెం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందాడు. మద్దిపాడు మండలం తెల్లబాడు గ్రామానికి చెందిన ఎం. అన్వేష్‌బాబు(36) దర్శిలోని స్టేట్‌బ్యాంక్‌లో హోమ్‌లోన్ డిపార్ట్‌మెంట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తు న్నాడు. ప్రతిరోజు మోటార్‌సైకిల్‌పై వచ్చి వెళ్తుంటాడు. ఈనెల 21న విధులు ముగించుకొని రాత్రి దర్శిలో తిరునాళ్ల ఉండటంతో అక్కడేఉన్నాడు. తిరునాళ్ల చూసి తెల్లవారుజామున ఇంటికి బయలుదేరాడు. సుమారు 4 గంటల సమయంలో బొట్లపాలెం దగ్గర చెట్టుకు ఢీకొని తీవ్రగాయాలై మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలి

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఆదాయ మార్గాల కోసం కార్యదర్శులు కృషి చేయాలని డీపీఆర్సీ రాఘవులు సూచించారు. స్థా నిక చెత్త సంపద తయారీ కేంద్రంలో జరుగుతున్న ఎల్‌టీసీ శిక్షణ తరగ తుల రెండోరోజు కార్యక్రమం శనివారం ఈవోపీఆర్డీ అరవిందరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా రాఘవులు మాట్లాడుతూ మండలంలో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల పక్కన చెత్త కుప్పలు ఉంటే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఎస్‌పురం పంచాయతి కార్యదర్శి వి.బ్రహ్మ నందరెడ్డి, పామూరు మండల కార్యదర్శులు జి.నాగేశ్వరరావు, కృష్ణమూర్తి క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

ముఖాముఖి

ఉపాధి పనులతో వలసల నివారణ

బి.మురళి, ఏపీవో, తాళ్లూరు



ప్రశ్న: మండలంలో కూలీలకు పనుల కోసం ఏం చర్యలు తీసుకుంటున్నారు?
జవాబు: మండలంలోని గ్రామాల్లో వలసల నివారణకు జాబ్ కార్డుదారులందరికి ఉపాధి పనులు కల్పిస్తున్నాం.
ప్ర: మండలంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి ?
జ: 16 గ్రామపంచాయతీల్లో 11వేల 123 జాబ్‌కార్డులు ఉన్నాయి.
ప్ర: ఉపాధి పనుల్లో ఏవిధమైన పనులు చేస్తున్నారు?
జ: చెరువులు, రైతువారినీటికుంటలు, పంట కాలువల పూడికతీత, కాల్వ గట్లు, చెక్‌డ్యామ్ నీటి గుంతల్లో పూడిక తీత పనులు చేయిస్తున్నాం
ప్ర: పండ్లతోటల సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నారా?
జ: మండలంలో 45 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటలను రైతులు సాగుచేసి ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్నారు.
ప్ర: ఉపాధి నిధులతో గ్రామాల్లో ఏవిధమైన పనులు చేపట్టారు?
జ: ఉపాధి నిధులతో గ్రామాల్లో 58 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.3 కోట్లు, 20 గోకులం షెడ్లకు రూ.40 లక్షలు, మూడు బీటీ రోడ్డు నిర్మాణాలకు రూ.కోటి 75లక్షలు మంజూరు చేయగా పనులు చేపట్టాం.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. రవాణా రంగాన్ని రక్షించుకోవడానికి, తమ సమస్యల పరిష్కారానికి టాక్సీ డ్రైవర్లు సంఘటితం కావాలన్నారు. ఈనెల 24న నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను శనివారం స్థానిక ట్యాక్సీ స్టాండ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, వలి, అశోక్, సుల్తాన్, కొండయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తాళ్లూరు కస్తూర్బాగాంధీ విద్యాలయంలో 2025-2026 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పాలపర్తి సుజిత శనివారం తెలిపారు. 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. అలాగే, 7,8,9,10,12 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు ఏపీ కేజీబీవీఏపీసీఎఫ్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9515838862నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మిట్టపాలెంలో అభివృద్ధి పనులకు అంచనాలు

సీఎస్‌పురం(పామూరు), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలం మిట్టపాలెంలోని శ్రీనారాయణ స్వామి దేవస్థానానికి సంబంధించిన మహాప్రాకార నిర్మాణ ఆర్చి, పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంచనాల ప్లాన్ మ్యాప్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి శనివారం పరిశీలించారు. ఆర్చి నిర్మాణ పనులకు సంబంధించి దేవదాయశాఖ ఇంజనీర్లు రూపొందించిన ప్లాన్ మ్యాప్‌ను ఈవో నరసింహబాబు కనిగిరిలోని ఉగ్ర క్యాంపు కార్యాలంలో కలిసి వివరించారు. మ్యాప్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర భక్తులకు ఎలాంటి అవరోధకాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ టి.కిశోర్‌బాబు సూచించారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు బయటకు వెళ్లే సమయంలో లేదా ఇతర గ్రామాలకు పోయే సమయంలో ఇంటి చుట్టుపక్కల వారికిగాని, పోలీసులకుగాని సమాచారం ఇవ్వాలన్నారు. లేనట్లయితే మీవిలువైన వస్తువులకు మీదే బాధ్యత అని తెలిపారు. ఈమేరకు శనివారం మైకు ద్వారా పట్టణంలో ప్రచారం చేశారు.

భక్తి శ్రద్ధలతో పంచామృత అభిషేకాలు

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీమదన వేణుగోపాలస్వామి దేవస్థానంలో ప్రతి శనివారం జరిగే పంచామృతాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వార్లకు మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయ అర్చకులు నారాయణం సత్యంబాబు తులసి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ గద్దె ఏడుకొండలు, బండ్ల నారాయణ ప్రసాదు, సురేష్, పుట్లూరి యేగేశ్వరరెడ్డి, ఉభయదాతలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, పాపారావును సన్మానిస్తున్న కార్యకర్తలు

అన్నిరంగాల్లో దర్శిని అభివృద్ధి చేస్తాం

దర్శి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి దర్శిలో శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రభల వద్ద ప్రజల నుద్దేశించి ఆమె మాట్లాడారు. రాజకీయాల్లో తాను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఓడిన చోటనే గెలిచి చూపించిన నారా లోకేష్ సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని తాను పనిచేస్తున్నట్టు చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో ప్రజలకు అందిస్తుందని చెప్పారు. దర్శిలో ఏర్పాటుచేసిన టీడీపీ, జనసేన ప్రభల వద్ద డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావును కార్యకర్తలు సన్మానించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్ జి.స్టీవెన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పుల్లచెరువు చిన్నా, ఐటీడీపీ ఇన్‌చార్జ్ సందు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలి

దొనకొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంఈవో సాంబశివరావు అన్నారు. ఆస్థాయికి చేరుకోవాలంటే చిన్నతనం నుంచే కమశిక్షణ, అంకితభావం, పట్టుదల ఎంతో ముఖ్యమన్నారు. దొనకొండలోని సెయింట్ ఆంథోనీస్ ఉన్నత పాఠశాలలో శనివారం కరస్పాండెంట్ రెవరండ్ ఫాదర్ గుడిపల్లి థామస్ పర్యవేక్షణలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న రెవరండ్ ఫాదర్ పి.జోసఫ్, విద్యాశాఖాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌లు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ అరుణపవిత్ర, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరరావుకు నివాళి


కాళేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సభ్యుడుగా, వాసవీ మాత, సత్యదేవుని దేవస్థాన కమిటీ సభ్యులుగా దరిశి కాళేశ్వరరావు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని కనిగిరి మానవత సేవా సంస్థ అధ్యక్షుడు సోమిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. శనివారం కాళేశ్వరరావు దశదిన కార్యక్రమం స్థానిక డీవీ అపార్ట్‌మెంట్‌లో జరిగింది. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సాయిబాబా దేవస్థాన అధ్యక్షుడు సోమిశెట్టి మాల్యాద్రి, డీవీ మనోహర్, దరిశి రాము, యేల్చూరి బాలకొండలరావు, గాలికిరణ్, కాళేశ్వరరావు కుమారులు రవికుమార్, డాక్టర్ గోపినాథ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి నిధులతో నీటి కుంటల నిర్మాణం

ముండ్లమూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద నీటి కుంటలు నిర్మిస్తున్నారు. శనివారం ఆయా గ్రామాల్లో శనివారం ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది భూమి పూజ చేశారు. మండలంలోని పసుపుగల్లు, వేములబండ, వేముల, ఉల్లగల్లు, కెల్లంపల్లి, శంకరాపురం, పూరిమెట్ల, పోలవరం గ్రామాల్లో సేద్యపు కుంటల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

శివరాంపురంలో ఘర్షణ

తాళ్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివరాంపురం గ్రామంలో శుక్రవారం రాత్రి రెండు కుటుంబాల ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈమేరకు తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదయింది. గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు.. పోటు వెంకటేశ్వర్లు, పోటు సీతయ్యకు ప్రభుత్వ భూమిని ఉపయోగించే విషయంలో వివాదం నడుస్తుంది. ఈనేపథ్యంలో శుక్రవారం రాత్రి వీరిరువురు ఘర్షణపడ్డారు. పోటు వెంకటేశ్వర్లుకు మద్దతుగా వచ్చిన కొనికి కోటేశ్వరరావును గాయపరిచారు. దీంతో కోటేశ్వరరావు బంధువులు అదేరాత్రి సీతయ్యపై దాడి చేశారు. ఈక్రమంలో సీతయ్య తన బంధువులతో శుక్రవారం వేకువజామున వారి ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలను దుర్భాషలాడుతుండగా వీరాంజనేయులు అనే వ్యక్తి ప్రశ్నించాడు. దీంతో సీతయ్య, మరికొందరు వీరాంజనేయులుపై మారణాయుధాలతో దాడి చేయడంతో తీవ్రగాయాల్యయి. క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.వీరాంజనేయులు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదుమేరకు స్థానిక పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్శి సీఐ రామారావు శనివారం సాయంత్రం ఆగ్రామానికి వెళ్లి ఘర్షణలకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్సై ఎస్.మల్లికార్జునరావు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాళ్లూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. తద్వార వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. మండలంలోని తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బెల్లంకొండవారిపాలెం గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. 102 మందిని సాధారణ వ్యాధిగ్రస్థులుగా గుర్తించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగార్జున, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు మంజుల, కోటేశ్వరమ్మ, ఈశ్వరమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

పామూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సరం త్రైత శకం 47వ సంవత్సరం తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఎస్ఐ టి.కిశోర్ బాబు శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు జి.ప్రసాద్, జి.సుధాకర్, జి.పెంచలరత్నం, కె.వెంకటేశ్వర్లు, బి.మాలకొండారెడ్డి, వై .మహేందర్, ఎం.కొండారెడ్డి, కె.వెంకటసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పుల్లారావు

పీసీపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పొన్నలూరు తహసీల్దార్ వి.పుల్లారావు నియమితులయ్యారు. కలెక్టర్ అన్సారియా ఆదేశాల మేరకు డీఆర్వో చినఓబులేసు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీహెచ్ ఉష వ్యక్తిగత పనుల నిమిత్తం ఏప్రిల్ 15 వరకు సెలవులో ఉన్నారు. దీంతో కార్యాలయంలో సాధారణ పరిపాలనకు ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి అదనపు బాధ్యతలతో పుల్లారావును నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 23 మార్చి 2025



ఆంధ్రజ్యోతి నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా కార్యక్రమంలో డ్రా తీస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఐజీ త్రిపాఠి, డీజీఎం సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్య దేవర సాంబశివరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు



మొదటి బహుమతి విజేతకు ఫోన్‌చేసి మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



డ్రా తీస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఆంధ్రజ్యోతి.. అదృష్టవంతులు

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 128 మందిని వరించిన బహుమతులు
- డ్రా తీసి విజేతలకు ఫోన్ చేసి కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని సర్‌ప్రైజ్
- తొలి విజేతకు బైకు, రెండో విజేతకు రిఫ్రిజిరేటర్, మూడో విజేతకు కలర్ టీవీ
- విశిష్ట అతిథులుగా హాజరైన ఐజీ త్రిపాఠి, హోమియో వైద్యుడు ఓవీ రమణ

అట్టహాసంగా కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా

గుంటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పత్రిక 22వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులో నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో అదృష్టవంతులను బహుమతులు వరించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన గుంటూరులోని వెంగళాయపాలెం యూనిట్ కార్యాలయంలో శనివారం లక్కీ డ్రా పాఠకులు, ఏజెంట్ల సమక్షంలో అట్టహాసంగా జరిగింది. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ప్రముఖ హోమియో వైద్యుడు ఓవీ రమణ విశిష్ట అతిథులుగా హాజరై విజేతలను ఎంపిక చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చందాదారులు కార్యాలయనికి 25 వేల కూపన్లను పంపారు. వాటి నుంచి తొలి విజేతకు సంబంధించి కూపన్ కేంద్ర మంత్రి పెమ్మసాని తీయగా యడ్లపల్లి గౌరి అనే పాఠకు రాలిని అదృష్టం వరించింది. వెంటనే ఆమె మొబైల్‌కు పెమ్మ సాని ఫోన్ చేసి అమ్మా... మీరు ఆంధ్రజ్యోతి పాఠకులు కదా.. మీకు లక్కీ డ్రాలో బైక్ వచ్చింది అని చెప్పారు. దీంతో ఆమె అమితానందంతో పెమ్మసానికి కృతజ్ఞతలు తెలిపారు. మీరు తొలుత నాకే థాంక్స్ చెప్పాలంటూ సరదాగా పెమ్మసాని సంభాషించారు. ఆ తర్వాత ద్వితీయ బహుమతి కోసం కూపన్ తీయగా సయ్యద్ బీ బిహారీసాహెబ్ విజేతయ్యారు. ఆయనకు కూడా కేంద్ర మంత్రి ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. మూడో బహుమతి కోసం కూపన్‌ని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తీయగా దోరడ్ల సుజాత విజేతగా ఎంపికయ్యారు. కార్యక్రమానికి హాజరైన పాఠకులు, ఏజంట్లు మరో 125 మందికి కన్సోలేషన్ బహు మతులు ఇచ్చేందుకు లక్కీ డ్రా తీశారు.

విజేతలు వీరే..

- **మోటార్ బైక్ :** యడ్లపల్లి గౌరి, 6-19, కోస్టల్ బ్యాంకు దగ్గర, తక్కెళ్ళపాడు, పెదకాకాని మండలం, గుంటూరు జిల్లా.
- **185 లీటర్ల రిఫ్రిజిరేటర్:** బిహారీసాహెబ్, 5-17/2, మెయిన్‌రోడ్డు, పిన్నెల్లి, మాచవరం మండలం, పల్నాడు జిల్లా.
- **32 అంగుళాల కలర్ టీవీ:** దోరడ్ల సుజాత, బృందావనం అపార్ట్‌మెంట్(303), నారాయణపురం, 2వ లైన్, చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.



త్వరలో బహుమతుల పంపిణీ

విజేతలు 128 మందికి త్వరలోనే బహుమతులను అందజేస్తామని ఆంధ్రజ్యోతి డీజీఎం సూదా రామచంద్రరావు తెలిపారు. త్వరలో ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల పాఠకులకు జరగబోయే డ్రాలో బంపర్ బహుమతులుగా రెండు మారుతి స్విఫ్ట్ కార్లకు విజేతలు ఎంపిక జరుగుతుందన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆంధ్రజ్యోతి పాఠకులకు అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పాఠకులు పత్రిక చందాదారులైనందుకు కృతజ్ఞతగా సుమారు రూ.కోటి విలువ చేసే బహుమతులను ఈ లక్కీడిప్ ద్వారా ఇస్తుండటం అభినందనీయంవన్నారు. విజేతలకు, ఆంధ్రజ్యోతి పాఠకులకు పెమ్మసానితో పాటు ఐజీ త్రిపాఠి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి గుంటూరు ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, ఆంధ్రజ్యోతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో అభివృద్ధి

- హనుమంతరావు వర్ధంతి సభలో మంత్రి రవికుమార్
- 37 మంది దివ్యాంగులకు స్కూటీలు, రుణాల చెక్కుల పంపిణీ

అద్దంకి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిధులకు తోడు దాతల సహకారం, పలు సేవా సంస్థలు అందించే సీఎస్ఆర్ నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. దివంగత మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతిని పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్, అసిస్ట్, సీంథైట్ సంస్థల సహకారంతో 37 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలను శనివారం అద్దంకి మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అద్దంకి అభివృద్ధికి దాతలు ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. దాతల సహకారంతో వచ్చే విద్యాసంవత్సరంలో 10 వేలమంది విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేస్తామన్నారు. అనంతరం 17 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 13 స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు రూ.17.50 లక్షల రుణాల చెక్కును అందజేశారు. ముందుగా పట్టణంలోని నామ్ రోడ్డులో సత్యనారాయణ కళామందిర్ ఎదురు ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాపును మంత్రి ప్రారంభించారు.

ప్రజల నుంచి వినతి ప్రతాల స్వీకరణ

మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రజల నుంచి వినతిపత్రాలను మంత్రి రవికుమార్ స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి వినతిపత్రాన్ని తక్షణమే పరిష్కరించే విధంగా అధికారులు పనిచేయాలని మంత్రి తెలిపారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, సింథైట్, అసిస్ట్ సంస్థల ప్రతినిధులు సలాం, కృష్ణహరీష్, విష్ణు ప్రియ, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.



దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రేషన్ అక్రమాలకు.. ఇక చెక్

- ఈకేవైసీ తప్పనిసరి.. నెలాఖరు వరకు గడువు
- చేయించుకోకుంటే కార్డు దారులకు సరుకుల నిలిపివేత



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రేషన్ పంపిణీలో అక్రమాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది. అవకతవకలు నివారించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కార్డుదారులందరూ ఈకేవైసీ చేసుకోవాలని సూచించింది. ఈకేవైసీ చేయించుకోకుంటే కార్డుదారులకు రేషన్ నిలిచిపోయే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంటున్నారు. ఈకేవైసీకి నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. రెండు నెలలుగా ఈకేవైసీ నమోదు జరుగుతున్నా చాలా మంది కార్డుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోలేదు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 17,00,953 కార్డులు ఉన్నాయి. కార్డుదారులు చాలామంది జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుంటారు. వీరు నెలల తరబడి గ్రామాలకు రావడంలేదు. ఇలాంటి వారి పేర్లు కార్డులో తొలగించకుండా ఉండాలంటే ఈకేవైసీ చేయించుకోవాలి. ఇటువంటి వారు స్థానికంగానే కాకుండా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడి మీసేవ, చౌకధరల దుకాణం, ఆధార్ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటును కల్పించారు. అయితే ఈ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన లేదు. దీంతో ఈకేవైసీకి కార్డుదారులు పెద్దగా ముందుకు రాలేదు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు ఈకేవైసీ చేయించుకోకపోవడంతో నమోదు ప్రక్రియలో పెండింగ్ సంఖ్య ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.

డీలర్లపై బాధ్యత..

రేషన్‌కార్డులోని సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకునేలా డీలర్లు వారిళ్ల వద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పించి నిర్దిష్ట గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశించారు. సచివాలయాల పరిధిలో క్లస్టర్ల వారీగా ఈకేవైసీ పెండింగ్ జాబితాను అధికారులు డీలర్లకు అందజేశారు. కార్డు దారులందరికీ ఈకేవైసీ చేయించాలని డీలర్లకు రెవెన్యూ శాఖ బాధ్యతలు అప్పగించింది. ఈ నెలాఖరులోగా ఈకేవైసీని నూరు శాతం పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రేషన్ డీలర్లు, తహసీల్దార్లు, డీఎస్‌వోలు లాగిన్లలో ఈకేవైసీ వివరాలు అందుబాటులో ఉంచారు. గ్రామ, వార్డు సచివాలయాల మొబైల్ యాప్, రేషన్ షాపులోని ఈ-పోస్ పరికరాల ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకునే సౌకర్యం కల్పించారు. ఐదేళ్ల లోపు పిల్లలు మినహా కార్డులోని సభ్యులందరూ ఈకేవైసీ చేసుకోవాలని అధి కారులు సూచిస్తున్నారు. లేకపోతే కార్డుదారులకు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. కార్డుల్లోని సభ్యులు ఈకేవైసీ చేయించుకోకుంటే సంబంధిత సభ్యుడి పేరు కార్డులో ఉండదని అధికారులు చెబుతు న్నారు. ఈకేవైసీ చేయించుకుని వారికి భవిష్యత్‌లో రేషన్ అందే పరిస్థితి ఉండదంటున్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరుతోపాటు, కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు అవకాశం ఇవ్వనున్నది. ప్రభుత్వ పథకాలకు సంబంధించి కార్డు ఆధారంగా లబ్ధి చేకూరేందుకు ఈకేవైసీ ఉపయోగపడ నున్నది. ఈ పరిస్థితుల్లో కార్డు దారులు డీలర్ల వద్దకు వెళ్లి ఈకేవైసీ నమోదును పరిశీలించుకోవాల్సి ఉంది. ఈకేవైసీ కాకుంటే తప్పనిసరి గా ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి.

సూర్యలంకలో సీవీడ్ కల్చర్

- నిజాంపట్నం, ఓడరేవులలో ఫిషింగ్ హార్బర్లు
- మత్స్యశాఖ కమిషనర్ రమా శంకర్‌నాయక్



మాట్లాడుతున్న మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్ నాయక్

బాపట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూర్యలంక సముద్రతీరంలో సీవీడ్ కల్చర్‌కు శ్రీకారం చుడుతున్నట్లు మత్స్యశాఖ కమిషనర్ రమాశంకర్‌నాయక్ తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లోని మత్స్యకార కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిజాంపట్నం, ఓడరేవులలో రెండు ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సముద్రతీరంలోని వనరులను ఆక్వా కల్చర్ అభివృద్ధికి వినియోగించుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. జిల్లాలో రూ.28 కోట్లతో ఆక్వా పార్క్ త్వరలో అందుబాటులోకి రాబోతుందని తెలిపారు. మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్రప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జేడీ బి.కృష్ణకిషోర్, జాతీయ మత్స్యకార సంఘం నాయకులు అనంత నగేష్‌బాబు, మత్స్యశాఖ అభివృద్ధిఅధికారులు కిశోర్‌రెడ్డి, రవీంద్ర, సాయి సందీప్, రాయల్ మెరైన్ ఎండీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులు

న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఆరో అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబు

కర్లపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు, అశ్లీలత నేరాల కేసుల విచారణకు ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసినట్లు న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఆరో అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబు తెలిపారు. పిల్లలపై లైంగిక వేధింపులు అనే అంశంపై మండలంలోని పేరలి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎస్సీ, ఎస్టీలు, మానవ రవాణా బాధితులు, బిక్షాటన చేసేవారు, స్త్రీలు, పిల్లలు, మతిస్థిమితంలేనివారు, విపత్తుల్లో చిక్కుకున్న వారు, వార్షిక ఆదాయం 3 లక్షలకు మించని వ్యక్తులు కూడా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు. బాలబాలికలపై లైంగిక చర్య అత్యాచారంగానే పరిగణించి ఏడేళ్లు తగ్గకుండా జైలుశిక్ష, అపరాధ రుసుము లేదా జీవిత ఖైదీ కూడా విధిస్తామన్నారు. బాధితులకు అత్యవసర వైద్య చికిత్స, రక్షణ కల్పిస్తామన్నారు. లైంగిక దాడికి గురైన బాలికలకు నష్టపరిహారం అందుతుందన్నారు. సదస్సులో న్యాయవాదులు టి.విజయ్‌కుమార్, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, పారా లీగల్ వలంటీర్లు కె.శ్రీనివాసరావు, ఎన్.శామ్యూల్ జాన్సన్, ఎన్జీవో గొర్రెముచ్చు వందనం తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ఆరో అదనపు జిల్లా జడ్జి కె.శ్యాంబాబు

ఆదాయాభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలి

అధికారులకు కలెక్టర్ జె.వెంకటమురళి దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం, మత్స్యసంపద ఉత్పత్తుల విస్తీర్ణంతో ఆదాయం వృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆదాయాభివృద్ధి లక్ష్యాలపై కలెక్టరేట్‌లో శనివారం జరిగిన సమావేశంలో కలెక్టర్ వివిధశాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 10.7 శాతం లక్ష్యంతో అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రసాయన ఎరువులు, పురుగుమందులు లేని సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలన్నారు. 30,998 హెక్టార్లకు సేంద్రియ సాగు లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. తద్వారా జిల్లాకు రూ.4,943 కోట్ల ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. మత్స్యసంపద, ఆక్వాసాగు ద్వారా ఏడాదిలో 12,440 కోట్లు ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. ఏడాదిలో 13.41 వృద్ధి రేటు సాధన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఆరు బీచ్‌లను అభివృద్ధి చేయడం ద్వారా ఏడాదికి రూ.535 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామన్నారు. పర్యాటకంపై 18.88 వృద్ధి రేటు ఉంటుందన్నారు. అటవీసంపద వృద్ధి చేయాలని ముందుకు సాగాలని సూచించారు. ఉద్యాన పంటలు అదనంగా 1650 హెక్టార్లకు విస్తరింప చేస్తే రూ.4,065 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. 11.49 శాతం వృద్ధి రేటు సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. 3 వేల హెక్టార్లలో సూక్ష్మబిందు సేద్యం సాగేలా రైతులను చైతన్యపర్చాలన్నారు. కృత్రిమ పద్ధతిలో 49,675 గేదెలను ఉత్పత్తి చేయాలన్నారు. దీంతో పాలదిగుబడి పెరిగి ఆదాయం రూ.6,630 కోట్లకు చేరే లక్ష్యంతో 15.20 శాతం వృద్ధి రేటు సాధనకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రానైట్, ఇసుక, కంకర వనరులతో రూ.110 కోట్ల ఆదాయం లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల విస్తరణతో ఆదాయం రూ.1941 కోట్లకు పెంచాలన్నారు. రైల్వే లైన్ ద్వారా రూ.109 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తాజాగా రైల్వేగూడ్స్‌రాక్ వంటి వనరులతో ఏడాదిలో వృద్ధి రేటు 5.83 పెరగనున్నదన్నారు. సమావేశంలో జేసీ ప్రఖర్‌జైన్ పాల్గొన్నారు.

బెట్టింగ్ పెనుభూతం.. బలికావద్దు

యువతకు ఎస్పీ తుషార్‌డూడీ సూచన

బాపట్ల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ పెనుభూతం లాంటిదని, యువత ఆశపడి దానికి బలికావద్దని ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్‌లకు పాల్పడినా, ఇతరులను ప్రోత్సహించినా చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు మొదలైనందున సులభంగా పెద్దమొత్తంలో నగదు అర్జించవచ్చని యువతకు ఆశచూపుతూ బెట్టింగ్‌లకు తెరలేపే అవకాశం ఉందన్నారు. బెట్టింగ్‌లకు బలిఅవుతున్న వారిలో ఎక్కువశాతం యువతే ఉంటున్నారన్నారు. ఒక్కసారి బెట్టింగ్ లకు అలవాటు పడితే బయటకు రావడం కష్టమౌతుందన్నారు. బెట్టింగ్ నష్టాలను భర్తీ చేసుకునేందుకు చేసిన అప్పులను తీర్చడానికి యువత దొంగతనాలకు, ఇతర నేరాలకు పాల్పడుతూ భవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారన్నారు. గతంలో బెట్టింగ్‌లకు పాల్పడినవారిపై, అనుమానితులపై నిఘా ఉంచామన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.24 (ఆదివారం సాయంత్రం)
సహరి : 4.53 (సోమవారం ఉదయం)


టీడీపీ అద్దంకి మండల అధ్యక్షుడు కరారి నాగేశ్వరరావును పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

పలువురికి మంత్రి రవికుమార్ పరామర్శ

అద్దంకి, మార్చి22(ఆంధ్రజ్యోతి): గుండె శస్త్ర చికిత్సలు చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న ఇద్దరు టీడీపీ నేతలను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శనివారం పరామర్శించారు. మండలంలోని కలవకూరులో టీడీపీ మండల అధ్యక్షుడు కరారి నాగేశ్వరరావు, అద్దంకి పట్టణంలో టీడీపీ ఆర్యవైశ్య నేత గట్టుపల్లి రామారావులు ఇటీవల గుండె శస్త్ర చికిత్సలు చేయించుకొని విశ్రాంతి తీసుకుంటుండగా మంత్రి రవికుమార్ శనివారం ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. గరటయ్యకాలనీలో భువనగిరి వెంకటేశ్వర్లు దశదిన కర్మకు హాజరై చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ నేతలు కరి పరమేష్, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, కాకాని అశోక్, కోనేటి అనిల్, నందిరెడ్డి శ్రీనివాసరావు, కుందారపు రామారావు, లహరి తదితరులు ఉన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రూరల్ సీఐ శేషగిరిరావు, ఎస్సై వెంకటేశ్వర్లు

చలివేంద్రం ప్రారంభం

వేటపాలెం(చీరాల), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : వృత్తి రీత్యా కఠోరంగా వ్యవహరించే పోలీసులు మనసు కూడా సున్నితంగా ఉంటుందని, వారికి మానవతా విలువలు, సాయంచేసే గుణం ఉంటుందని రూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. స్టేషన్ ఎదురుగా ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ ప్రారంభించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ రహదారిలో రాకపోకలు సాగించే వారికి ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలి

మేదరమెట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం అని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. శనివారం మేదరమెట్లలో హెచ్ఐవీపై అవగాహన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సురక్షిత లైంగిక అలవాట్లతో పాటు అవగాహనతో నివారణ సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల ప్రోగ్రాం మేనేజర్ కోటేశ్వరరావు, అనిల్‌కుమార్, దుర్గా, సామ్రాజ్యం, కృష్ణవేణి , మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


పర్చూరు రోడ్డులో ఇలా ప్రమాదపు అంచున ఆటోలో ప్రయాణిస్తున్న చిన్నారులు

పట్టుజారితే అంతే...

నిత్యం పరిమితికి మించిన ప్రయాణికులతో ఆటోలు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఏదో ఓచోట ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలను కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నిత్యం ప్రధాన రోడ్డులో సైతం ఈ దృశ్యాలు కంట పడుతున్నా ఇది తమ పనికాదన్న చందాన పోలీసులు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆటోవాలాలకు అడ్డు అదుపులేకుండా పోయింది. చిన్నారులను సైతం పరిమితికి మించి ఇలా ఆటోలో ప్రయాణాలు సాగిస్తున్న దృశ్యం శనివారం ఆంధ్రజ్యోతికి కనిపించింది.

- ఆంధ్రజ్యోతి, పర్చూరు

స్కూల్ గ్రాంటు నిధుల వినియోగంలో నిర్లక్ష్యం

- రూ.9లక్షలు వెనక్కు వెళ్లే ప్రమాదం
- జిల్లాలో 87 పాఠశాలల నిర్వాకం

ఒంగోలు విద్య, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాంపోజిట్ స్కూలు గ్రాంటు విడుదల చేయకపోతే పాఠశాలల నిర్వహణ ఎలా అని ప్రధానోపాధ్యాయులు గతంలో గగ్గోలు పెట్టారు. తీరా విడుదల చేస్తే నిధుల వినియోగించడంలో నిర్లక్ష్యం చేశారు. దాంతో 87 పాఠశాలలకు విడుదల చేసి సుమారు రూ.9లక్షల నిధులు వెనక్కు వెళ్లే ప్రమాదం పొంచి ఉంది. నెలాఖరులోగా ఆ నిధులను వినియోగించకపోతే ఆ మొత్తాలను పాఠశాలలు వదులుకోవాల్సిందే. ప్రభుత్వ రంగంలోని 1 నుంచి 12 తరగతులకు విద్యార్థులు ఉన్న విద్యా సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంపోజిట్ స్కూలు గ్రాంటు పేరుతో మౌలిక వసతులకు నిధులు విడుదల చేస్తున్నాయి. ఆయా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని నిధులు విడుదల చేస్తారు. 2023-24 విద్యాసంవత్సరంలో జిల్లాలోని పాఠశాలలకు ఈ నిధుల కింద ఒక్క పైసా కూడా విడుదల కాలేదు. ప్రస్తుత విద్యా సం వత్సరంలో రాష్ట్రప్రభుత్వం పాఠశాలలకు రావాల్సిన కాంపోజిట్ గ్రాంటులో 50శాతం విడుదల చేసింది. గత ఏడాది నిధులు లేక పాఠశాలలు కనీస అవసరాలకు తమ జేబులోని డబ్బులు పెట్టామని గగ్గోలు పెట్టిన హెచ్‌ఎంలు ఈ ఏడాది నిధులు జమ కావడంతో సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో పాఠశాలలకు సమగ్ర శిక్ష ద్వారా రూ.2.81కోట్లు విడుదల చేశారు. ఈ నిధులను పాఠశాల హెచ్‌ఎం, ఎస్ఎంసీ జాయింట్ బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. ఈ నిధులు వినియోగానికి సంబంధించి ఎస్ఎంసీ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేయాలి. వాటికి అనుగుణంగా చేపట్టే పనులు, కొనుగోలు చేసే మెటీరియల్‌కు సంబంధించిన అంచనాలకు ముందుగా హెచ్‌ఎంలు పీఎంసీ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దానికి అనుగుణంగా ప్రింట్ పేమెంట్ అడ్వయిస్(పీపీఏ) తయారు చేసి సంబంధిత మండల విద్యాధికారి ధ్రువీకరణతో పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా బ్యాంకుకు సమర్పిస్తే నిధులు హెచ్‌ఎం, ఎస్ఎంసీ జాయింట్ ఖాతాకు జమ అవుతాయి. ఈ నిధులు వినియోగానికి సంబంధించిన బిల్లులు, ఓచర్లు కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ నిధుల వినియోగానికి ఇంత తతంగం ఉండగా ఇప్పటివరకు 87 పాఠశాలలకు సంబంధించి విడులైన రూ.9 లక్షల్లో ఒక్క పైసా కూడా ఇప్పటివరకు ఖర్చుచేయలేదు.

ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం

రూ.20.80 లక్షలతో లెవలింగ్, వాకింగ్‌ట్రాక్ ఆధునికీకరణ పనులు ప్రారంభించిన కమిషనర్ వెంకటేశ్వరరావు

మొత్తం రూ.93.85 లక్షలతో వివిధ పనులు

మూడొంతులకు టెండర్లు పూర్తి

వచ్చేనెలలో ఆయా పనులు చేపట్టేలా కార్యచరణ

ఎమ్మెల్యే జనార్దన్ ఆదేశాలతో కదలిక


పార్కులో పనులను కొబ్బరికాయకొట్టి ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌లో కీలక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులకు కార్పొరేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. తొలిగా ఆ డివిజన్‌తోపాటు పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది వచ్చి వాకింగ్ చేసే ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అందులో ప్రధానంగా అవసరమైన పార్కులో లెవలింగ్, రెండువైపులా వాకింగ్ ట్రాక్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. సుమారు రూ.20.80 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ పనులను నగర పాలక సంస్థ కమిషనర్ డాక్టర్ కే.వెంకటేశ్వరరావు శనివారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం, సదుపాయాల మెరుగు లక్ష్యంగా 'అక్షరమే అండగా- పరిష్కారమే అజెండాగా' ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థలు ప్రజల సమక్షంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చావేదికలను నిర్వహించిన విషయం విదితమే. అందులోభాగంగా జనవరి 28న నగరంలోని 37వ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ పార్కులో నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావులు పాల్గొనగా 37వ డివిజన్‌లోని వివిధ కాలనీలకు చెందిన ఐదారు వందల మంది ప్రజానీకం హాజరయ్యారు. తమ ప్రాంత సమస్యలను, మౌలిక సదుపాయాల మెరుగు అంశాలను ఆంధ్రజ్యోతి చర్చావేదికలో వారి దృష్టికి తీసుకొని రాగా పలు అంశాలపై ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వారికి హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో రూ.10కోట్లతో అభివృద్ధి పనులు చేస్తామన్నారు. తక్షణ పనులపై ఎమ్మెల్యే ఆదేశాలతో కార్పొరేషన్ అధికారులు తొలుత ఆ ప్రాంతంలో శానిటేషన్ మెరుగు, ఆక్రమణల తొలగింపు ఇతరత్రా అంశాలపై దృష్టిపెట్టి పనిచేయడంతోపాటు ఆయా ప్రాంత ప్రజలు కోరిన పనులలో ప్రాధాన్యత గల వాటిని గుర్తించారు. సుమారు రూ.93.85 లక్షలతో 13 పనులకు ప్రతిపాదనలు చేశారు. దాదాపు ఇప్పటికే వాటిలో మూడొంతుల పనులకు టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేశారు.

వాకింగ్ ట్రాక్‌ల ఆధునికీకరణ

అందులో ప్రథమంగా ఆ ప్రాంత ప్రజల అందరి ఉమ్మడి అవసరాలలో కీలకమైన ఎన్టీఆర్ పార్కులో మూడు భాగాలుగా రూ.20.80 లక్షలతో లెవలింగ్, వాకింగ్ ట్రాక్‌ల ఆధునికీకరణ పనులకు టెండర్లు ఖరారు కాగా కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ వారంరోజుల క్రితం ఇచ్చారు. ఆ పనులకు శనివారం ఉదయం కార్పొరేషన్ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాలరావు, మునిసిపల్ ఇంజనీర్ చంద్రయ్య, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెన్నుపాటి ప్రసాదరావు, గణపతి మాస్టారు, మన్నం హనుమంతరావు పాల్గొన్నారు. ఈ పనులను పది రోజుల్లో పూర్తిచేయాలని కమిషనర్ ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అలా పూర్తయిన పనులను ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ప్రారంభిస్తారని అప్పటికి డివిజన్‌లో ప్రతిపాదించిన ఇతర రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు, పార్కులో ఆటస్థలంలో కొత్త పరికరాల ఏర్పాటు తదితరాలపై దృష్టిసారించి కొద్దిరోజుల్లోనే వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. కాగా పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం అక్కడి వాటర్ ట్యాంకు ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. అక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పలువురు స్థానికులు ఆయన దృష్టికి తీసుకు రావడంతో వాటర్‌ట్యాంకు మెట్లపైకి ఇతరులు ఎక్కే అవకాశం లేకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి

మార్టూరు,మార్చి22(ఆంధ్రజ్యోతి): పోక్సోచట్టంపై బాలికల తల్లి తండ్రులు అవగాహన కలిగిఉండాలని మండల న్యాయ సేవాధికారసంస్థ చైర్మన్, అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి డి. నాగవెంకటలక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సుగాలికాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది.ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ మైనరు బాలికల తల్లి దండ్రులు తమ కుమార్తె ప్రవర్తన, నడవడికలను గమనిస్తూ, వారికి మానసిక స్థైర్యాన్ని కలిగించాలన్నారు. కోర్టులలో, పోలీస్‌స్టేషన్‌లలో వాస్తవాలను తెలియజేసినపుడే బాధితులకు పోక్సో చట్టంద్వారా న్యాయం జరుగుతుందన్నారు. అదేవిధంగా నిందితులకు కూడా చట్ట పరంగా శిక్ష పడుతుందన్నారు.సీఐ ఎం. శేషగిరిరావు మాట్లాడుతూ మైనర్లకు తల్లి దండ్రులు ద్విచక్రవాహనాలను ఇవ్వవద్దన్నారు. ప్రతి ద్విచక్రవాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. సదస్సుకు న్యాయవాది ప్రకాష్ అధ్యక్షత వహించారు. న్యాయవాది తాళ్లూరి మార్తా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


మార్టూరు సుగాలికాలనీలో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అద్దంకి సీనియర్ సివిల్ న్యాయాధికారి నాగవెంకటలక్ష్మి,వేదికపై సీఐ శేషగిరిరావు

విద్యార్థులు మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలి

- సీనియర్ సివిల్ న్యాయాధికారిణి ప్రశాంతి

యద్దనపూడి(పర్చూరు : విద్యార్థినులు విద్యతోపాటు మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని పర్చూరు కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారిణి కె.ప్రశాంతి అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్వర్యంలో శనివారం యద్దనపూడి బీఆర్ అంబేద్కర్ గురుకులంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందరర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయాధికారిణి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని చెడు ప్రవర్తన-మంచి ప్రవర్తన పట్ల అవగాహన కల్గిఉండాలన్నారు. వేసవి సెలవుల సమయంలో చుట్ట పక్కలవారితో జాగ్రత్త వహించాలన్నారు. ఈకార్యక్రమంలో కె.ప్రమీలా, న్యాయవాది సీహెచ్.రమణి, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాలికలకు రక్షణగా..

- న్యాయాధికారి సుధ

చీరాల : లైంగికంగా బాధింపబడే చిన్నారుల రక్షణకు పోక్సో చట్టం ప్రయోజనకరంగా ఉంటుందని న్యాయాధికారి సుధ అన్నారు. స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా న్యాయాధికారి సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రిహానా పాల్గొని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసరావు, నాగభూషణం, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



యద్దనపూడి గురుకులంలో విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారిణి కె.ప్రశాంతి

విద్యతోపాటు క్రమ శిక్షణను అలవర్చుకోవాలి

- న్యాయాధికారిణి పి.శాంతి

ఉప్పుటూరు(పర్చూరు) : విద్యతోపాటు, క్రమ శిక్షణను కూడా విద్యార్థులు అలవర్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పర్చూరు జూనియర్ సివిల్ న్యాయాధికారిణి పి.శాంతి అన్నారు. శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉప్పుటూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా బాలికలు చెడు ప్రవర్తన - మంచి ప్రవర్తన పట్ల అవగాహన కల్గిఉండాలన్నారు. ఎవరు అయినా చెడుగా ప్రవర్తిస్తే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వసుందరాదేవి, సీనియర్ న్యాయవాదులు రవీందర్‌రెడ్డి, పూరిమెట్ల జాన్‌బాబు, ఎస్సై మాల్యాద్రి, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాన నీటిని ఒడిసిపడదాం

జిల్లాలో అరకొర నీటి సౌకర్యాలు, అత్యధిక ప్రాంతం వర్షాధారమే. సరైన వర్షాలు లేక ఏటా కరువు బారిన పడుతూ సాగునీటికే కాక తాగు, ఇతర సాధారణ అవసరాలకు కూడా నీరు అందుబాటులో లేక అవస్థలు పడుతున్న పరిస్థితి. అయితే ప్రజల నీటి సమస్యలపై ప్రభుత్వం దృష్టిసారించింది. అందులో భాగంగా నీటిని నిల్వ చేసేందుకు అవసరమైన చర్యలు మొదలయ్యాయి. వాన నీటిని ఒడిసిపట్టేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఆ మేరకు పొలాల్లో భారీగా పంట కుంటలు తవ్వాలని నిర్ణయించింది. ఉపాధి హామీ పథకం అనుసంధానం చేసి కరువు బారిన పడుతున్న జిల్లాలో పెద్దఎత్తున నీటి సంరక్షణ పనులకు శ్రీకారం చుట్టింది. ఆ మేరకు శనివారం ఫాంపాండ్స్ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారీయా సింగరాయకొండ మండలం కనుమళ్లలో పంట కుంట తవ్వకాన్ని ప్రారంభించారు.


ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో ఇంకుడుగుంతల పనులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

జిల్లావ్యాప్తంగా భారీగా నీటి సంరక్షణ పనులు

ఉపాధి పథకంతో అనుసంధానం

పంట కుంటలు, ఇంకుడు గుంటలు, చెరువుల ఆధునికీకరణ పనులు ప్రారంభం

కనుమళ్లలో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్

ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రం ప్రారంభం

ఒంగోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భారీ పనులు కాకుండా వాన నీటిని వృథాగా వెళ్లకుండా ఒడిసి పట్టే లక్ష్యంతో చిన్న, మధ్యతరహా స్థాయిలో కుంటల తవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో ప్రధానంగా పంట పొలాల్లో అన్ని అవసరాలకు ఉపకరించేలా రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55వేల పంట కుంటలు(ఫాంపాండ్స్)ను 2025-26 ఆర్థిక సంవత్సరంలో తవ్వాలని నిర్ణయించారు. అలాగే ఇళ్లు, కార్యాలయాల్లో ఇంకుడు గుంటలు, ఊరూరా ఉండే చెరువులు, కుంటలలో పూడికతీత, ఇతర ఆధునికీకరణ పనులతో పాటు పది రకాల నీటి సంరక్షణ పనులు చేపట్టనున్నారు. రాష్ట్రంలో 380 గ్రామాల్లో భూగర్భజలాలు ఖాళీ అయినట్లు కేంద్రం గుర్తించగా అందులో అత్యధికంగా జిల్లాలోనే 93 ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాలో భారీగా నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌లు అందుకు కార్యచరణ రూపొందించారు. ప్రపంచ జలదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం నీటి సంరక్షణ పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత పొలాల్లో పంటకుంటలపై దృష్టిపెట్టారు, సంబంధిత శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కర్నూలు జిల్లాలో పంట కుంటల తవ్వకం పనులు ప్రారంభించగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పనులు ప్రాధాన్యత ఉన్న జిల్లాల్లో సంబంధిత జిల్లా మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల భాగస్వాములు కావాలని ప్రభుత్వం ఆదేశించింది.

కనమళ్లలో ప్రారంభం

జిల్లాలో శనివారం పంట కుంటల తవ్వకాల పనులకు యంత్రాంగం శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో లక్షా 55వేల పంట కుంటలు లక్ష్యం కాగా జిల్లాలో 9,500 లక్ష్యంగా నిర్ణయించారు. సగటున ఒక్కొక్క కుంట తవ్వకానికి రూ.50వేల వరకు ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఇవ్వనున్నారు. జిల్లావ్యాప్తంగా శనివారం ఈ పనులను జలదినోత్సవం సందర్భంగా డ్వామా ఆధ్వర్యంలో చేపట్టగా సింగరాయకొండ మండలం కనుమళ్లలో రాష్ట్రమంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పంట కుంటల తవ్వకం పనులు ప్రారంభించారు. కలెక్టర్ అన్సారియా, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌లు పాల్గొన్నారు. అక్కడ రూ.2.32లక్షలతో తవ్విన మోడల్ పంట కుంటను ఈ సందర్భంగా మంత్రి ప్రారంభించారు. మార్కాపురం మండలంలో 260 కుంటలు తవ్వనుండగా గోగులదిన్నె గ్రామంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ పనులను ప్రారంభించారు. పెద్దారవీడు మండలం శివాపురంలో పంటకుంట తవ్వకం పనులను వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబు ప్రారంభించగా జిల్లాలోని అన్ని మండలాల్లోనూ డ్వామా సిబ్బంది నేతృత్వంలో ఈ పనులు ప్రారంభమయ్యాయి.

డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రం ఏర్పాటు

ఇదిలా ఉండగా నీటి సమస్య పరిష్కారం, సంరక్షణ పనుల పర్యవేక్షణ లక్ష్యంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆలోచన మేరకు ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో జలశక్తి కేంద్రం పేరుతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. జలదినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి ఆ కేంద్రాన్ని ప్రారంభించగా కలెక్టర్ అన్సారియా, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, డ్వామా పీడీ జోసఫ్‌కుమార్‌లు పాల్గొన్నారు. జిల్లాలో నీటి వనరుల, భూగర్భజలాల స్థితిగతులు, వాటిని సంరక్షించుకునేందుకు ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా చేపట్టే పనుల నమూనాలు ఇందులో ఉంటాయి. డ్వామా సిబ్బందితోపాటు ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రౌండ్‌వాటర్ ఇతర సిబ్బంది సమన్వయంతో ఈ కేంద్రం నడవనుంది. అన్నిరకాల నీటి సమస్యలను ఈ కేంద్రం వారు తీసుకోనే కాల్ సెంటర్ లాగా కూడా ఇది ఉపకరించనున్నట్లు సమాచారం.

గేట్‌లో సాయి లోకేష్‌కు 81వ ర్యాంక్

పంగులూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి):గేట్ పోటీ పరీక్షలో పంగులూరు విద్యార్థి పొత్తూరి లక్ష్మీ శ్రీ సాయి లోకేష్ ఆలిండియా స్థాయిలో 81వ ర్యాంక్ సాధించాడు. పంగులూరుకు చెందిన పొత్తూరి సంజీవరావు కుమారుడు లక్ష్మీ శ్రీ సాయి లోకేష్ ఒంగోలులోని కీర్తి పబ్లిక్ స్కూల్లో 7వ తరగతి వరకు, 8,9,10 మోడరన్ పాఠశాల చిలకలూరిపేటలో చదివాడు. అనంతరం ఒంగోలులోని దామచర్ల ఆంజనేయులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన సాయి లోకేష్ బంగారు పతకం సాధించాడు. తండ్రి ప్రయివేట్ సంస్థలలో అకౌంటెంట్‌గా పని చేస్తుండగా తల్లి విశాలి గృహిణి. సాయిలోకేష్‌ను పంగులూరు నీటిసంఘం ఉపాధ్యక్షుడు రావూరి హరిబాబు, స్థానిక పెద్దలు అభినందించాడు.



ఏసీబీకి పట్టుబడిన అవినీతి ప్రిన్సిపాల్

- డబ్బులిస్తేనే జీతం బిల్లు చేస్తానని డిమాండ్
- అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన అటెండర్
- చీమకుర్తిలో ఆయన నివాసంలోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత

చీమకుర్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ అవినీతి ప్రిన్సిపాల్ ఏసీబీకి చిక్కారు. తన పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న అటెండర్ నుంచి డబ్బులు తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాడెడ్‌గా పట్టుకున్న సంఘటన శనివారం చీమకుర్తిలో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ శిరీష కథనం ప్రకారం.. చీమకుర్తి పట్టణంలో గరికమెట్ట వద్ద ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో ఎం.ప్రవీణ్‌కుమార్ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నాడు. అదే పాఠశాలలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఆఫీస్ సబార్డినేట్ (అటెండర్)గా వీరయ్య విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా వేసవి సెలవుల్లో పనిచేసినందుకు రెండు నెలల పాటు వచ్చే జీతానికి బిల్లులు పంపించాలంటే ఒక నెల జీతం తనకివ్వాలని ప్రిన్సిపాల్ డిమాండ్ చేశాడు. దీంతో వీరయ్య అంతమొత్తం ఇచ్చుకోలేక ఒంగోలు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారిచ్చిన ప్లాన్ ప్రకారం శనివారం చీమకుర్తి పట్టణంలో తూర్పుబజార్‌లో నివాసం ఉంటున్న ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ ఇంటికి వెళ్లిన వీరయ్య రూ.17,500ను ఇచ్చారు. అదే సమయంలో అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు ప్రవీణ్‌కుమార్‌ని పట్టుకున్నారు. అక్కడి నుంచి అతనిని పాఠశాలకు తరలించారు. తదుపరి ఒంగోలుకు తీసుకెళ్లారు.

ప్రిన్సిపాల్ వైఖరిపై పలు ఆరోపణలు...

ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్‌పై ఇప్పటికే పలు అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డి పాఠశాలను సందర్శించారు. నాసిరకం బియ్యం, సరుకులతో వంటలు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నట్లు ఆయన గుర్తించారు. దీనికి సంబంధించి వివరణ ఇవ్వాలని ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీస్ ఇచ్చారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్,ఎక్స్‌కవేటర్

ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు

- ట్రాక్టర్, జేసీబీ స్వాధీనం

ఈపూరుపాలెం(చీరాల), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :ఈపూరుపాలెం స్టేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈక్రమంలో రవాణాకు వినియోగిస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. అలాగే డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

అగ్ని ప్రమాదాలతో వారంలో ఇరువురు వృద్ధురాళ్ల మృతి

చీరాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదంతో ఇరువురు వృద్ధ మహిళలు మృత్యువాత పడ్డారు. స్థానిక బోస్ నగర్‌కు చెందిన దివ్వెల సీతామహాలక్ష్మి(70) కుటుంబ సభ్యులు పై అంతస్థులో ఉండగా ఈమె కింద గదిలో ఉంటోంది. ఈక్రమంలో దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకోవడంతో ప్రమాదం బారిన పడింది. దీంతో ఐదు రోజులుగా స్థానికంగా ఓ ప్రయివేట్ వైద్యశాలలో కుటుంబ సభ్యులు వైద్యం అందిస్తుండగా శనివారం ఉదయం మృత్యువాత పడింది. అలాగే సుమారు పది రోజుల క్రితం జాండ్రపేటకు చెందిన బండారు వెంకట శేషారత్నం(70) ఇంట్లో దీపారాధన చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. ఈక్రమంలో చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందింది. రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే రోజుల వ్యవధిలోనే రెండు ఘటనలు జరగడంపై పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని మోటర్ సైకిలిస్టు మృతి


మృతిచెందిన ఆదినారాయణ

మేదరమెట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందాడు. ఈఘటన శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. అద్దంకి పట్టణం దామావారిపాలెంకు చెందిన ఏలూరి ఆదినారాయణ(24) మేదరమెట్ల బైపాస్‌లో అద్దంకి వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారి మలుపు తిరుగుతుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆదినారాయణ తల రోడ్డుకు తగలడంతో అడికక్కడే మృతి చెందాడు. మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనాన్ని ఢీకొన్న కారు

జాతీయ రహదారిలో కొరిశపాడు ఫ్లైవోవర్‌పై శనివారం వేకువజామున ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో తెనాలి ఐతా నగర్‌కు చెందిన ఎస్. వెంకట సాయి కృష్ణ, మరొక వ్యక్తి ఉన్నారు. వీరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. కారు ముందుభాగం పూర్తి దెబ్బతినింది. మేదరమెట్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అవీ..ఇవీ


జాతీయ జెండాతో సందడి చేస్తున్న కమాండెంట్స్, పోలీసులు

దేశ రక్షణ ప్రతి పౌరుని బాధ్యత

రామాపురం(చీరాల), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : దేశాన్ని ఉగ్రవాదుల నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందని సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజిత్‌కుమార్ అన్నారు. కోస్టల్ సైక్లోథాన్ - 2025 సైకిల్ ర్యాలీ శనివారం రామాపురం నుంచి బయలు దేరే క్రమంలో ముందుగా తీరంలోని ప్రజలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే జాతీయ జెండా ఆవిష్కరణతో అందరిని ఉత్సాహ పరిచారు. తీరంలో ప్రమాదాల నియంత్రణకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ అభిషేక్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ప్రభాకర్, అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్‌సింగ్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్స్ ఎస్సై శశికుమార్, స్థానిక గ్రామ పెద్దలు, మత్స్యకారులు పాల్గొన్నారు.


ఉప్పుటూరులో ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న ఫాంపాండ్స్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ఉప్పుటూరు(పర్చూరు),మార్చి 22(ఆంధ్రజ్యోతి): జీవనోపాధిని పెంపొందించుకునే విధంగా ప్రభుత్వం కల్పించిన జాతీయ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఏవీ విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో రైతుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న ఫాం పాండ్స్(పంట కుంటలు)ను పరిశీలించారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ పంట కుంటలు పైర్లకు ఆరుతడులు అందించుకునేందుకు ఎంతగానో దోహద పడతాయని, రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉపాధి పనుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులను అందించే విధంగా ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్, ఏపీడీ కోటయ్య నాయక్, ఏపీవో డి.బుల్లయ్య, గ్రామ పెద్దలు, గ్రామస్థులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


అతిథులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కళాశాల విద్యార్థిని

జలమే జీవనాధారం

చీరాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్ తరాలకు జలమే జీవనాధారమని, నీటి వనరులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జలజ్యోతి మిషన్ శాస్త్రవేత్త డా.ఎం. సుధీర్ కుమార్, మునిసిపల్ డీఈ రఘురామ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వరల్డ్ వాటర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అతిథులు మాట్లాడుతూ నీటి వనరులు కలుషితం వలన ప్రాణాలు కోల్పోతున్నట్లు వివరించారు. నీటి విలువను అందరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, కిరణ్‌కుమార్, జ్యోతిస్వరూప్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మామిడి పూతను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారిణి దీప్తి

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పంగులూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి):మామిడిలో పూత బాగా వచ్చేందుకు అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అద్దంకి డివిజన్ ఉద్యానఅధికారి ఎస్.దీప్తి సూచించారు. మండలంలోని ముప్పవరం, కొండమూరు గ్రామాలలో శనివారం మామిడి తోటలలో పంట పరిస్థితిని స్థానిక రైతులతో కలసి పరిశీలించారు. మామిడి పంటలో పూత అధికంగా వచ్చేందుకు 13.0.45 ఒక లీటరు నీటికి 5 గ్రాములు, బోరాన్ ఒక లీటరికి 3 గ్రాములు చెట్లపై పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు దినేష్, దిల్షా, రైతులు పాల్గొన్నారు.

వెంటాడుతున్న అకాల వర్ష భయం


ఉప్పుటూరు గ్రామంలో వర్షపు భయంతో వాములుగా మండెవేసుకున్న వైట్‌బర్లీ పొగాకు

పంటలను కాపాడుకునేందుకు రైతుల ఉరుకులు పరుగులు

పర్చూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : పంట చేతికి అందే తరుణంలో అకాల వర్షం భయం అన్నదాతలను కలవరానికి గురిచేస్తోంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆరుగాలం చెమటోడ్చి వ్యవ ప్రయాసలకు ఓర్చి పండించిన పంటలను కాపాడుకునేందుకు రైతులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. ముఖ్యంగా భారీ పెట్టుబడులు పెట్టి సాగుచేసిన వైట్‌బర్లీ పొగాకు, మిర్చి పంటలు ఆరుబయటే ఎండబెట్టుకున్నారు. పొగాకు(వైట్‌బర్లీ) తాళ్లు అన్నీ పొలాల్లో పందిళ్లకు కట్టి ఉన్నాయి. మిరప కొంత కాయలు కోసి కల్లాల్లో ఆరబెట్టగా మరి కొంత పంట పొలంలోనే ఉంది. ప్రస్తుతం నాణ్యమైన రకం పొగాకు అంతా పొలాల్లో పందిళ్లకు కట్టిఉంది. పూర్తి స్థాయిలో ఎండనందున ఇప్పుడు తీసి మండెలు వేస్తే బూజుపట్టే ప్రమాదం ఉంది. అలానే ఉంచితే భారీ వర్షం పడితే పందిళ్లు నేలకు ఒరిగి పొగాకు మట్టికొట్టుకొని నాణ్యత పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో భారీ వర్ష సూచనలు అన్నదాతలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇక మిర్చి రైతుల పరిస్థితి దాదాపు ఇదే విధంగా ఉంది. కల్లాల్లో ఉన్న పంట పూర్తిగా ఎండకుండా బస్తాల్లో నింపి నిల్వచేస్తే బూజుపట్టి పాడయ్యే పరిస్థితి ఉంది. చేలో ఉన్న కాయలు తడిస్తే తాలుగా మారే అవకాశం ఉంది. అలా జరిగితే మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నదాతలు అంటున్నారు.


నూతలపాడు వద్ద నేలపై ఆరబోసి ఎండ పెట్టిన మిర్చి పైరు

బాపట్ల జిల్లా వ్యాప్తంగా సాగు విస్తీర్ణం

ఖరీఫ్ 2024-25 సాధారణ సాగువిస్తీర్ణం	3,50,682
పంటలు పడిన విస్తీర్ణం	2,71,941
ఖరీఫ్‌లో మిర్చి సాధారణ విస్తీర్ణం	26,126 ఎకరాలు
పడిన పంట	8,399
రబీలో మిరప సాధారణ విస్తీర్ణం	15,647 ఎకరాలు
పడిన విస్తీర్ణం	8,522 ఎకరాలు
రబీలో పొగాకు సాధారణ విస్తీర్ణం	15,647 ఎకరాలు
పడిన విస్తీర్ణం	63,471 ఎకరాలు

శరవేగంగా బీటీ రోడ్ల పనులు

మంత్రి రవికుమార్ చొరవతో గ్రామీణరహదారులకు మహర్దశ
హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


వైదన నుంచి నామ్ రోడ్డు హైవే వరకు జరుగుతున్న తారు రోడ్డు పనులు


సూరేపల్లి- వైదన గ్రామాల మధ్య చిల్లచెట్లను తొలగించి రోడ్డు పనులు చేస్తున్న ఎక్స్‌కవేటర్

బల్లికురవ,మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకొని గ్రామీణ బీటీ రోడ్ల పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతోనే ప్రజలు గ్రామీణ రోడ్ల సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు విన్నవించారు. వెంటనే ఆయన ఉపాధి హామీ పథకం నిధులను మంజూరు చేయించారు. దీంతో గత పది రోజుల నుంచి చెన్నుపల్లి- వైదన- సజ్జాపురం రోడ్డు అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. బల్లికురవ మండలం చెన్నుపల్లి నుంచి ముక్తేశ్వరం, సూరేపల్లి, వైదన గ్రామాల ప్రజలు నామ్ హైవే రోడ్డుకు వెళ్లాలన్నా, మండల కేంద్రానికి రావాలన్నా నానా ఇబ్బంది పడేవారు. కూటమి ప్రభుత్వం రావడంతో మంత్రి ఉపాధి హామీ పథకం కింద రూ. 3 కోట్లను మంజూరు చేయించారు. ఈ నిధులతో బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి.. రోడ్డు మార్జిన్‌లు కూడా బాగా అభివృద్ధి చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సంతమాగులూరు మండలంలోని సజ్జాపురం రోడ్డు పనులు కూడా వారం రోజుల నుంచి జరుగుతున్నాయి. గతంలో ఎవరూ రోడ్ల గురించి పట్టించుకోలేదని ఇప్పుడురోడ్లను అభివృద్ధి చేయడం ఎంతో ఆనందంగా ఉందని ప్రజలు అంటున్నారు.

హనుమంతరావుకు మంత్రి రవికుమార్ ఘన నివాళి

పాల్గొన్న గొట్టిపాటి అభిమానులు, టీడీపీనేతలు


దివంగత గొట్టిపాటి హనుమంతరావు సమాధిపై పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి రవికుమార్, నేతలు , బంధువులు

యద్దనపూడి,(మార్టూరు)మార్చి22(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివంగత గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. శనివారం మాజీ మంత్రి, దివంగత గొట్టిపాటి హనుమంతరావు 28 వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన యద్దనపూడి గ్రా మంలో నిర్వహించారు. తొలుత ఆయనకు గ్రామస్థులు, టీడీపీ నాయకులు,బంధువులు,గొట్టిపాటి అభిమానులతో కలిసి హనుమంతురావు సమాధి వద్దకు వెళ్లారు. అక్కడ హనుమంతరావు సమాధితోపాటు,తన తండ్రి గొట్టిపాటి శేషగిరిరావు సమాధి వద్ద కూడా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తరువాత యద్దనపూడి ప్రధానసెంటరులో ఉన్న హనుమంతరావు విగ్రహానికి, ఆయన కుమారుడు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గొట్టిపాటి నరసయ్యల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట ఈ కార్యక్రమంలో టీడీపీ దర్శి నియోజకవర్గ సమన్వయకర్త గొట్టిపాటి లక్ష్మి, గొట్టిపాటి భరత్, మాజీ ఎంపీపీ గొట్టిపాటి రాంబాబు,యద్దనపూడి ,అద్దంకి నియోజకవర్గాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అద్దంకిలో

అద్దంకి : అద్దంకి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో హనుమంతరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీడీపీ అద్దంకి పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు కాకాని అశోక్, కుందారపు రామారావు, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, అత్తులూరి రమేష్, లహరి, రాజశేఖర్, పుల్లయ్య పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు :సంతమాగులూరు మండలం పుట్టావారి పాలెం అడ్డరోడ్డులో శనివారం గొట్టిపాటి హనుమంతరావు కాంశ్య విగ్రహానికి స్థానిక టీడీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. నాయకులు తేలప్రోలు రమేష్, చేవూరు వాసిరెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, చింతా రామారావు, దుద్యాల గాలియ పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ : దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు వర్ధంతిని మండల టీడీపీ నేతలు శనివారం నిర్వహించారు. మండల సీనియర్ నాయకులు మలినేని గోవిందరావు హనుమంతరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, సీనియర్‌నాయకులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరి

కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రథమ వార్షికోత్సం

మార్టూరు,మార్చి22(ఆంధ్రజ్యోతి):స్థానిక బొడ్డురాయి సెంటరు సమీపంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రథమ వార్షిక వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా దేవస్థానం ప్రాంగణం అంతా రకరకాలపూలతో అలంకరించారు. అమ్మ వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.గ్రామంలోని ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి పసుపు,కుంకుమ,పూలు,గాజులను సమర్పించారు. దేవస్థానం కమిటీ అధ్యక్షులు కనమర్లపూడి సాంబ శివరావు,సెక్రటరీ కోటేశ్వరరావుల ఆధ్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

● వయోజన విద్య జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు


సమావేశంలో మాట్లాడుతున్న వయోజన విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి మధుసూదనరావు

చినగంజాం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్, నవభారత్ సాక్షరతా కార్యక్రమం ముఖ్యఉద్దేశమని వయోజన విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి కే.మధుసూదనరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నవభారత్ సాక్షరతా కార్యక్రమం, ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్ కార్యక్రమంపై స్వయం సహాయక మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెదసుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధుసూదనరావు మాట్లాడుతూ మండలంలో స్వయం సహాయక బృందాలలో మొదటి విడతలో, చదువురాని 680 మంది మహిళలను గుర్తించి, వారికి వారి గ్రూపులోనే ఉన్న చదువుకున్న మహిళలతో చదువు చెప్పించడం జరిగిందని తెలిపారు. ఇలా చదువు నేర్చుకున్న మహిళలు చదవడం, రాయడం, లెక్కలు చేయడం వంటి అంశాలలో వారు ఏ మాత్రం పురోగతి సాధించారో అంచనా చేయడానికి ఎఫ్ఎల్ఎన్ఏటీ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అసెస్‌మెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష 3గంటల పాటు ఉంటుందని, ఈ కార్యక్రమం ద్వారా చదువు నేర్చుకున్న మహిళలు వారికి వీలైన సమయంలో పరీక్షా కేంద్రానికి వచ్చి రాసుకొని వెళ్లవచ్చునని తెలిపారు. పరీక్షకు ఇన్విజిలేటర్లు, వ్యాల్యుయేటర్లుగా సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

నూతనంగా ఉల్లాస్ కేంద్రాల ద్వారా చదువు నేర్చుకున్న మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ పర్యవేక్షకులు కొణిదల మనోరంజన్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఆయా గ్రామాల వీవోఏలు, వలంటరీ ఉపాధ్యాయులు, సీసీలు పాల్గొన్నారు.


నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న అనిల్

నిస్సహాయులకు చేయూత

చీరాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నిస్సహాయులకు చేయూతను అందించడంలో ఎంతో ఆనందముందని పద్మ బాస్కర్ ఫౌండర్ గంటా అనిల్‌కుమార్ అన్నారు. తెలుగు, తమిళ పండుగలను పురస్కరించుకుని శనివారం పట్టణంలోని రోడ్ల వెంబడి చిత్తు కాగితాలు సేకరించి జీవనం సాగిస్తున్న తమిళ మహిళలకు హరిత యలమంచిలి, చరిత యలమంచిలి(యూఎస్ఏ) వారి ఆర్థిక సహాయంతో సుమారు 50 మందికి నూతన వస్త్రాలు బహూకరించారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు అనిల్ తెలిపారు.

దాతల సాయంతో ఉన్నత విద్య

దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని మునిసిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పేరాల ఆధ్వర్యంలో గత నెలలో స్థానిక కేజీఎం పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా లోపాలు గుర్తించిన 38 మంది విద్యార్థులకు శనివారం క్లబ్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లను కమిషనర్ అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమోహన్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు మార్టూరులో శ్రీనివాస కల్యాణం

మార్టూరు,మార్చి22(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆదివారం కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్నట్లు శ్రీవేంకటేశ్వరస్వామి భక్త సమాజం కమిటీ సభ్యులు తెలిపారు.తిరుమల తిరుపతి దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుందన్నారు.

నివేశన స్థలాలు ఇవ్వాలి

చీరాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన నిరుపేదలకు నివేశన స్థలాలు అందించి ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఎన్. బాబురావు డిమాండ్ చేశారు. శనివారం నాయకులు వసంతరావు, జయరాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో ఎక్కువ శాతం ఇళ్ల స్థలాల సమస్యలు గుర్తించినట్లు వివరించారు. ఈనేపథ్యంలో వాటి పరిష్కారం కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు.

26న ఇంకొల్లులో జాబ్‌మేళా

ఇంకొల్లు,మార్చి 22,(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా ఇంకొల్లులోని మారుతి ఐటీఐ కళాశాలలో ఈ నెల 26వ తేదీ బుధవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. 10వ తరగతి, డిప్లమో, డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు అర్హులని అన్నారు. ఎంపికైన వారికి అర్హతను బట్టినెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు జీతం ఉంటుందన్నారు.ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

నేడు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

బల్లికురవ. మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలలో ఆదివారం వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మార్టూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ నిలిపి వేస్తున్నామని, రైతులు గమనించాలని ఏఈ కోరారు.

జీతాలు ఇప్పించాలని మంత్రికి వినతి

యద్దనపూడి,(మార్టూరు)మార్చి22(ఆంధ్రజ్యోతి): మాకు మేనెలనుంచి జీతాలు రావడంలేదని, అలాగే 2019 నుంచి రావలసిన పెయిడ్ హాలిడేస్ ని మంజూరు చేయించాలని అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ ఉపకేంద్రాలలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు శనివారం యద్దనపూడిలో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.అద్దంకి డివిజన్ పరిధిలో అద్దంకి సౌత్,సాధునగర్,రావినూతల,యద్దనపూడిలోని 33-11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు వినతి పత్రం అందించిన వారిలో ఉన్నారు.

స్కౌట్‌తో విద్యార్థులలో క్రమశిక్షణ

బల్లికురవ. మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : భారత్ స్కౌట్ శిక్షణ ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ పెరుగుతుందని ఎంఈవో రమేష్ అన్నారు. శనివారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతనంగా అందుతున్న స్కౌట్ , గైడ్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఎంఈవో సమావేశం నిరహించారు. అనంతరం విద్యార్థులు స్కౌట్ డ్రస్సులు వేసుకోగా వారిని ఎంఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పురంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంకొల్లులో పొగాకు రైతుల సదస్సు

ఇంకొల్లు,మార్చి 22,(ఆంధ్రజ్యోతి) : బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో 23వ తేదీ ఆదివారం 10 గంటలకు ఇంకొల్లులోని మాదాల అంజయ్య బిల్డింగ్ వద్ద రైతుసదస్సు జరుగుతుందని బాపట్ల జిల్లా రైతుసంఘం కార్యదర్శి తలపనేని రామారావు తెలిపారు.జిల్లాలో పొగాకు పండించిన రైతులు అందరూ ఈ సదస్సుకు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

రుణాల దరఖాస్తులకు గడువు పొడిగింపు

అద్దంకిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి రుణాల దరఖాస్తుల గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య శనివారం ఒక ప్రకటన తెలిపారు. మండల ప్రజలు పెంచిన దరఖాస్తుల స్వీకరణ తేదీ ని గమనించి అర్హులు సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు.

పేదరికం లేని సమాజం కోసమే సర్వే

సంతమాగులూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టిన పీ ఫోర్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సచివాలయాల సిబ్బందిని డీఎల్‌డీవో పద్మావతి ఆదేశించారు. మండలంలోని గురిజేపల్లిలో శనివారంనిర్వహించిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. ఈ సర్వే వలన పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చటం, జీవన ప్రమాణాల్లో స్థాయిలో ఉన్న 20% గుర్తించి దూరం చేయడమే లక్ష్యమని తెలిపారు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లకు ఎస్ఐ పట్టాభి రామయ్య శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రౌడీ షీటర్లపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రైతుల ఖాతాల్లో రూ.60.36 కోట్ల జమ

నెల్లూరు (హరనాథపురం) మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ఇప్పటిదాకా రూ.60.36 కోట్లు జమ చేసినట్లు జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 32,275 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. శనివారం ఒక్కరోజే 4,363.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ 24 నుంచి 48 గంటల్లోగా వారి ఖాతాలకు డబ్బులు జమ చేస్తున్నట్లు తెలిపారు. రైతులందరూ దళారుల మాటలు విని తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు బహుమతుల బొనాంజా

'కార్ అండ్ బైక్ రేస్' విజేతల ప్రకటన

కూపన్లు తీసి విజేతలను ప్రకటించిన ఎమ్మెల్యే ప్రశాంతి, 'శుభమస్తు' అధినేత బయ్యా రవి

- **ప్రథమ బహుమతి**
  ఎస్‌కే. మస్తాన్‌బీ, 4/23-5, శ్రామికనగర్ రోడ్, కొత్తూరు, నెల్లూరు.
- **ద్వితీయ బహుమతి**
  పొన్నూరు గిరిబాబు, 7-8-40, కోటంరెడ్డివారి వీధి, కావలి
- **తృతీయ బహుమతి**
  మేకల రాజేశ్వరి, 26-3-883, జ్యోతినగర్, 6వ వీధి, వేదాయపాళెం, నెల్లూరు.
- **వంద మందికి కన్సొలేషన్ బహుమతులు**

అక్షరమే ఆయుధంగా పున:ప్రారంభమైన ఆంధ్రజ్యోతి జనాదరణే ఊపిరిగా 22 ఏళ్ల పూర్తి చేసుకున్నది. ఇన్నేళ్ల ప్రస్థానంలో చురకలంటించే కథనాలతోపాటు ఆదరాభిమానం చూపుతున్న పాఠకులకు ఎన్నో బహుమతులు అందజేస్తోంది. అందులోభాగంగా 22వ వార్షికోత్సవం సందర్భంగా 'కార్ అండ్ బైక్ రేస్' పేరిట పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024, నవంబరు 1 నుంచి 2025 ఫిబ్రవరి 28వ తేదీ మధ్య 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కూపన్లను పాఠకులు ఇప్పటికే 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి పంపారు. ఇలా వేలాదిగా వచ్చిన కూపన్లలో విజేతలను శనివారం సాయంత్రం నెల్లూరులోని ప్రధాన కార్యాలయం వద్ద ఎంపిక చేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత బయ్యా రవి, ఏజెంట్లు, పాఠకులు పాల్గొన్నారు. ముందుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అతిథులు ఎంపిక చేయగా, వంద కన్సొలేషన్ బహుమతుల విజేతలను ఏజెంట్లు, పాఠకులు కూపన్ల ద్వారా ప్రకటించారు.

వివరాలు 8లో..



వేలాది కూపన్ల నుంచి ప్రథమ బహుమతి విజేత డ్రా తీస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



కంట్రాట్స్ మా... బైక్ విజేత మస్తాన్‌బీని ఫోన్‌లో అభినందిస్తున్న ప్రశాంతి రెడ్డి



ద్వితీయ బహుమతి విజేత కూపన్‌ను చూపుతున్న బయ్యా రవి

అంతులేని అవినీతి

మండల సమాఖ్య పుస్తక నిర్వహణ చూడాల్సిన అకౌంటెంట్లు అంతులేని అవినీతికి, నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. జిల్లాలో 37 మండలాలుండగా మండలానికో 37 సమాఖ్య ఉంది. వీటిలో 37 మంది అకౌంటెంట్లు పనిచేస్తున్నారు. సమాఖ్య తీర్మానంతో ఈ అకౌంటెంట్లు నియమితులవుతారు. వీరికి ప్రభుత్వం నెలకు రూ.3వేల పారితోషికం ఇస్తోంది. మండల సమాఖ్య కూడా కొంత పారితోషికం ఇస్తుంది. వీరు సమాఖ్య పుస్తక నిర్వహణ బాధ్యత చూడాలి. అయితే చాలాచోట్ల అకౌంటెంట్లు సమాఖ్య అధ్యక్షురాలికి సహాయకులుగా కాకుండా సమాఖ్య అధిపతులుగా చలామణి అవుతున్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అదే మండలంలో ఏళ్ల తరబడి పని చేస్తూ అనేక ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నారు.

- మండల సమాఖ్యల్లో అకౌంటెంట్ల చేతివాటం
- ఏళ్ల తరబడి ఒక దగ్గరే పని
- అన్నింటా వారిదే పెత్తనం
- దొంగ బిల్లులతో నిధుల స్వాహా..!
- రుణ రికవరీలో తప్పుడు సమాచారం
- విచారణ అధికారులకు తప్పుదోవ...
- ఉద్యోగుల్లేకనే వేతనాలు జేబులోకి..

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.25 (ఆదివారం సాయంత్రం)
సహరి : 4.55 (సోమవారం ఉదయం)

నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్య అకౌంటెంట్లు ఇష్టారాజ్యం విధులు నిర్వహిస్తున్నారు. సమాఖ్య నిధులను అనుకూలమైన సభ్యులకు రుణాలుగా అందజేస్తున్నా రు. ఇందుకుగాను వారి నుంచి కొంత నగదు తీసుకుంటున్నట్లు ఆరోపణలు న్నాయి. అంతేకాదు రుణాల రికవరీ విషయంలో తప్పుడు లెక్కలు చూపుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నట్లు సమాచారం. నిధుల దుర్విని యోగంపై విచారణకు అధికారులు మండల సమాఖ్యలకు వెళ్లినప్పుడు అకౌంటెంట్లు వాస్తవాలను దాచిపెడుతున్నారని, విచారణ అధికారులకు సరైన సమాచారం ఇవ్వకుండా వారిని తప్పుదోవ పట్టిస్తున్నారన్న విమర్శలు న్నాయి. తమపై వచ్చిన అవినీతి ఆరోపణలు రుజువు కాకుండా జాగ్రత్తలు తీసుకుం టున్నారు.

నకిలీ బిల్లులతో స్వాహా..

ప్రభుత్వం వివిధ కార్యక్రమాల నిర్వహణ, సభ్యుల వీక్షణ, కార్యాలయ నిర్వహణకు మండల సమాఖ్యలకు నిధులు మంజూరు చేస్తుంది. అయితే ఈ నిధులను ఆయా కార్యక్రమాల కోసం వినియోగించకుండానే, వాటికే ఖర్చు చేసినట్లు నకిలీ బిల్లులు చూపి అకౌంటెంట్లు నిధులు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. కొందరు సమయపాలన పాటించ కుండా తమకు తోచినప్పుడు కార్యాలయాలకు వచ్చి వెళుతున్నారు. మరికొందరు కొందరు రాజకీయ నాయకులతో సత్సంబంధాలు పెట్టుకుని అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లుగా దర్పం చూపుతున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాదు, గ్రామ సమాఖ్య సహాయకులు (వీవోఏ)లేని సమాఖ్యల్లో వారికి అనుకూలమైన వారిని అకౌంటెంట్లు, వీవోఏలుగా నియమించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వారికి ప్రతి నెల గౌరవ వేతనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నారు. ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేస్తే ఆ వేతనాన్ని వీరే వాడుకుంటూ అవినీతికి పాల్పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా చేతివాటం చూపు తున్న అకౌంటెంట్ల వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.



అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం



మండల సమాఖ్యల అకౌంటెంట్లు వారి బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తరచూ మండల సమాఖ్యలో తనిఖీలు నిర్వహిస్తాం. పుస్తకాలను తనిఖీ చేస్తాం. అకౌంటెంట్లు మండల సమాఖ్య పుస్తక నిర్వహణ చూడాలే తప్ప, ఇతర రాజకీయ అంశాల్లో తలదూర్చినా, అవినీతికి పాల్పడినా చర్యలు తప్పవు.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించాలి

చేవూరు గ్రామసభలో అసైన్డ్ రైతుల మొర

గుడ్లూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామాయపట్నం పోర్టుకు అనుబంధంగా చేవూరు పరిధిలో ఏర్పాటు చేయనున్న (మారిటైమ్ బోర్డు) పరిశ్రమల ఏర్పాటుకు సేకరించే భూములలో పట్టా భూములతో సమానంగా అసైన్డ్ భూములకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరారు. భూ సేకరణపై రైతుల అభిప్రాయ సేకరణకు శనివారం మండలంలోని చేవూరులో కందుకూరు సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీపూజ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజశేఖర్ పాల్గొని రైతుల అభిప్రాయాలు, సమస్యలపై రాతపూర్వకంగా వినతులు స్వీకరించారు. రైతులు మాట్లాడుతూ పట్టా భూముల కంటే అసైన్డ్ భూములకు నష్టపరిహారం తగ్గించడం సరైనది కాదని, పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లించాలని కోరారు. అలాగే గత నెల 25న ఇచ్చిన నోటిఫికేషన్ సవరించాలన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వాస్తవ లబ్ధిదారులను గుర్తించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ అసైన్డ్ భూములు చేతులు మారి అగ్రిమెంట్‌లు రాయించుకున్న క్రమంలో కొనుగోలు చేసిన రైతుల నుంచి సమస్యలు తలెత్తుతున్నా యని, వీటిని పరిష్కరించే దిశగా గ్రామంలో ఐదుగురు పెద్దలతో కమిటీ ఏర్పాటు చేసి వారి నిర్ణయానికి అనుగుణంగా అర్హులకు న్యాయం చేస్తామ న్నారు. అనంతరం మోచర్ల, చేవూరు, చినటాలవరపి గ్రామ పంచాయతీలకు మంజూరైన చెత్త సేకరణ ట్రాక్టర్లను ప్రారంభించి ఆయా పంచాయతీ అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్ర మంలో తహసీల్దారు స్వర్ణ, ఎంపీడీవో వెంకటే శ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు పీ.మురళి, జీ.శ్రీనివాసులు, ఎం. శ్రీనివాసులు, గొల్లప్రోలు హరిప్రసాద్, నూతలపాటి బుల్లియ్య పాల్గొన్నారు.



గ్రామసభలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శ్రీపూజ, పక్కన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

రాజుపాళెం ఇసుక రీచ్ మూసివేత

కలువాయి, (ఆంధ్రజ్యోతి): రాజుపాళెం సమీపాన అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం రెవెన్యూ అధికారులు మూసివేశారు. వీఆర్వో వెంకటరమణయ్య రీచ్‌లోని వెళ్లే దారికి ఉన్న గేటు మూసి, రీచ్‌లోకి వాహనాలకు ప్రవేశం లేదని, ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు పెట్టారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'ఇంత బరితెగింపా?' అనే కథనం ప్రచురితమైంది. ఇందుకు రెవెన్యూ అధికారులు స్పందించారు. రీచ్ నుంచి ఇసుక తరలిస్తే, వాహనాలను స్వాధీనం చేసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దారు శ్యామ్ సుందర రాజు హెచ్చరించారు. కుల్లూరులోని ప్రభుత్వ భూమి వద్ద కూడా బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మొగళ్లపాళెం.. ఎప్పటికి మోక్షం!

అత్యాధునిక క్రీడావసతులు ఏర్పాటు చేసి జాతీయ స్థాయి క్రీడల నిర్వహణతోపాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మొగళ్లపాళెం క్రీడా గ్రామానికి గ్రహణం పట్టింది. కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అందులో ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తి చేసినా ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, శాప్ చైర్మన్ సైతం దీన్ని పరిశీలించి వెంటనే ప్రారంభిస్తామని ప్రకటించి నెలలు గడుస్తున్నా మోక్షం కలగడం లేదు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

- నేటికీ ప్రారంభం కాని ఇండోర్ స్టేడియం
- కోట్లాది రూపాయల ఖర్చు వృథాయేనా?
- పూర్తిస్థాయిలో నిర్మాణాలకు నోచుకోని క్రీడాగ్రామం
- వినియోగంలోకి తేవాలంటున్న క్రీడాకారులు



ప్రారంభానికి నోచుకోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం లోపలి భాగం

రాష్ట్రం లోనే ప్రతిష్టాత్మకమైన క్రీడామైదానంగా తీర్చి దిద్దడంతో పాటు జాతీయ క్రీడల నిర్వ హణే లక్ష్యంగా నెల్లూరు రూరల్ ప్రాంతంలోని మొగళ్ల పాళెంలో 2014లో క్రీడా గ్రామం కోసం 150 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) రూపొందించి పంపాలని నాటి కేంద్రమంత్రి ఎం.వెంకయ్య నాయుడు రాష్ట్ర సర్కారును కోరారు. 2016లో 150 ఎకరాలు శాప్ ఆధ్వర్యంలోకి వచ్చింది. అవుట్‌డోర్, ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కేంద్రాన్ని నెలకొల్పేందుకు అనువుగా భవనాలు నిర్మించేలా కేంద్ర సర్కారుకు ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర సర్కారు ఇందుకోసం శాప్ ద్వారా ప్రహరీగోడ, విద్యుత్, రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు రూ.4.6 కోట్లు విడుదల చేసింది. ఈ క్రీడాగ్రామం కోసం మరో రూ.200 కోట్లతో అంతర్జాతీయ క్రీడా ప్రమాణాల కలిగిన క్రీడా ప్రాంగణాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందని వెంకయ్య నాయుడు సూచనలు చేసినా నాటి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రాధాన్యత చూపలేక పోయింది. 2016లో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం రూ.6 కోట్లు విడుదల చేయగా, ఈ నిధులను భూ సేకరణలో భాగంగా రైతులకు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకుంది. అనంతరం పట్టించుకోకపోవ డంతో ఈ జాప్యాన్ని గుర్తించిన కేంద్ర సర్కారు వెంకయ్య నాయుడు ఆదేశాలతో తొలిదశలో రూ.8కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపట్టేందుకు 2017, మార్చిలో పనులు ప్రారంభిం చారు. ప్రస్తుతం ఇండోర్ నిర్మాణాలు మాత్రం పూర్తయి వినియోగానికి సిద్ధంగా ఉండగా మిగిలిన మైదానాల నిర్మాణాలు మాత్రం పనులు నేటికీ ప్రారంభించక పోవడంతో అసలు ఇది పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధత అందరిలో నెలకొంది.

రూ.కోట్ల ఖర్చు వృథాయేనా?

మొగళ్లపాళెం క్రీడా గ్రామంలో ఇప్పటికే రూ.3కోట్లతో ప్రహరీ, రూ.10 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణాలు పూర్తి చేసి 2022లోనే డీఎస్‌ఏకు అప్పగించారు. అనంతరం లక్ష లీటర్ల కెపాసిటీ కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను రూ.40లక్షలతో నిర్మించి రూ.10లక్షలతో వాటర్ పైప్‌లైన్‌లు కూడా సిద్ధం చేశారు. అలాగే రూ.46 లక్షలో విద్యుత్ సౌకర్యం కల్పించారు.

స్పోర్ట్స్ హబ్‌గా మారిస్తే..

మొగళ్లపాళెం స్పోర్ట్స్ కాంప్లెక్స్, శాయ్ రీజనల్ సెంటర్ ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తే క్రీడా గ్రామం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకుంటుంది. వసతులు కలిగిన అత్యాధునిక క్రీడా అకాడమీలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. వందలాది మంది క్రీడాకారులకు అకాడమీల్లో శిక్షణ అందిస్తే దేశం గర్వించేస్థాయి క్రీడాకారులు సిద్ధమవుతారని క్రీడా ప్రముఖులు చెపుతున్నారు. అంతేగాక క్రీడాగ్రామం పూర్తయితే దక్షిణ భారతంలోనే అతిపెద్ద స్పోర్ట్స్ హబ్‌గా మొగళ్లపాళెం మారే అవకాశం ఉంది. జాతీయ రహదారులు, తిరుపతి, చెన్నై విమానాశ్రయాలు అతి చేరువలో ఉండటం కూడా జిల్లాకు మరో అనుకూల అవకాశంగా మారనుంది. ఇప్పటికైనా రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి క్రీడాగ్రామం పూర్తిస్థాయి నిర్మాణానికి చొరవ చూపాలని క్రీడాప్రముఖులు, క్రీడాకారులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్నతాధికారులు, శాప్ చైర్మన్ సైతం వీటిని పరిశీలించి త్వరలోనే వినియోగంలోకి తెస్తున్నా మని ప్రకటించి నెలలు గడుస్తున్నా నేటికీ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పూర్తయిన నిర్మాణాలకు ఇద్దరు వాచ్‌మెన్‌లను నియమించడం మినహా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణ యాలు తీసుకోకపోవడంతో క్రీడాకా రులు, క్రీడాభిమానులు నిరాశలో ఉన్నారు. క్రీడాగ్రామాన్ని ఏర్పాటు చేసే విష యంలో నత్తనడక నడుస్తుండటంతో 150 ఎకరాల ప్రభుత్వ భూమి నేటికీ వృథాగానే మిగిలి ఉంది.

మితిమీరిన వేగం.. ప్రాణాలు తీసింది!

- ఆటోను ఢీకొట్టిన మోటార్‌సైకిల్
- ముగ్గురు మృతి.. మరో ముగ్గురికి గాయాలు

మనుబోలు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : 'మితిమీరిన వేగం.. అత్యంత ప్రమాదకరం. శిరస్త్రాణం ధరించి వాహనం నడపండి. ప్రాణాలు కాపాడుకోండి.' ఇలాంటి హెచ్చరికలు పోలీసులు పదే పదే చేస్తున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. స్నేహితులను కలిసిన ఆనందం.. మోటార్‌సైకిల్‌పై సవారీ చేస్తూ చేసిన చిన్న పొరపాటు ముగ్గురి ప్రాణాలను బలిగొంది. మూడు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చింది. మనుబోలు మండలం గొట్లపాళెం-వడ్లపూడి రహదారిపై శనివారం ఆటోను బైక్ ఢీకొంది. దీంతో వరుణ్‌కుమార్ (17), నంద కిషోర్ (18), ఆటో డ్రైవర్ తురకా సురేంద్ర (38) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు..

సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన నోసిన వరుణ్‌కుమార్ ఇంటర్ పరీక్షలు రాసి అమ్మమ్మ ఊరు అయిన మనుబోలు మండలం గొట్లపాళెంకు నాలుగురోజుల క్రితం వచ్చాడు. స్నేహితులైన అరసనాపల్లి నందకిషోర్, సిద్దులు వరుణ్‌ను చూసేందుకు ఊటుకూరు నుంచి బైక్‌పై గొట్లపాళెం వచ్చారు. వరుణ్‌ను తీసుకుని అదే బైక్‌పై వడ్లపూడికి వెళ్లారు. అక్కడి పొలాల్లో పని చేస్తున్న వరికోత యంత్రాల వద్ద ఊటుకూరు వాసులతో మాట్లాడారు. తిరిగి గొట్లపాళెం వచ్చేందుకు ముగ్గురు మోటార్ సైకిల్‌పై బయలు దేరగా మార్గమధ్యంలో ఓ గేదె అడ్డు రాగా దానిని తప్పించారు. మితి మీరిన వేగంతో వస్తూ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టారు. దీంతో మోటార్ సైకిల్ బోల్తా పడటంతో వరుణ్ కుమార్, నందకి షోర్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సిద్దుకు తీవ్ర గాయాలయ్యాయి.

- వడ్లపూడి గ్రామానికి చెందిన తురకా సురేంద్ర ఐదేళ్లుగా ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తు న్నాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు కలరు. నిత్యం పొదలకూరు నుంచి వడ్లపూడి వరకు ప్రయాణికులను తీసుకువస్తుంటాడు. ఈక్రమంలో ఇద్దరు ప్రయాణికులతో సురేంద్ర ఆటోలో వస్తుండగా మోటార్‌సైకిల్ ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ సురేంద్రకు, ఆటోలో ఉన్న ఇద్దరుకి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో పొదలకూరు సీహెచ్‌సీకి తరలించారు. కొద్ది నిమిషాలకే చికిత్స పొందుతూ సురేంద్ర ఆసుపత్రిలో చనిపోయాడు. విషయం తెలుసుకుని ఎస్‌ఐ శివరాకేష్, నెల్లూరు డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు ప్రమాదస్థలికి చేరుకుని, పరిశీలించారు. మృతుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఘటనాస్థలి వద్ద మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి. మరోపక్క పొదలకూరు సీహెచ్‌సీలో మృతుడు సురేంద్ర భార్య, బిడ్డల గుండెలవిసేలా విల పించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాలను గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఆటోను ఢీకొట్టిన మోటార్‌సైకిల్



సురేంద్ర మృతదేహంపై పడి రోదిస్తున్న భార్య



మనవడు వరుణ్‌కుమార్ మృతదేహాన్ని ఒళ్లో పడుకోబెట్టుకుని విలపిస్తున్న తాత



నందకిషోర్ మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	104
స్కిన్ చికెన్	192
స్కిన్‌లెస్	212
కోడిగుడ్ల ధర (100): 425	

కంప్యూటర్ ల్యాబ్ భవనం పనుల ప్రారంభం

లింగసముద్రం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం మంజూరు చేసిన కంప్యూటర్ ల్యాబ్ భవన నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఈ భవనానికి రూ.18.05 లక్షల మంజూరయ్యాయని సర్వ శిక్షాభియాన్ ఏఈ రాఘవేంద్రరావు చెప్పారు. 2, 3 నెలల్లో పనులు పూర్తి చేసి అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. అలాగే ఇదే విద్యాలయంలో విద్యార్థినుల కోసం డార్మెట్రీ భవనం నిర్మాణ కోసం సర్వ శిక్షాభియాన్ కింద రూ.1.30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ పనులకు వారం రోజుల క్రితం టెండరు ప్రక్రియ జరిగిందని, ఈ నెలాఖరులో డార్మెట్రీ భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.


కేజీబీవీలో చేస్తున్న కంప్యూటర్ ల్యాబ్ భవనం పనులు

న్యూస్ బాక్స్

మాలకొండ ఆదాయం రూ.7,03,980

వలేటవారిపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి రూ.7,03,980 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. అష్టోత్తరం టికెట్లకు రూ.7,950, కుంకుమార్చనకు రూ.17,520, తలనీలాలకు రూ.28,575, వాహనపూజలకు రూ.2500, ప్రత్యేక దర్శనానికి రూ.1,78,600, స్థలపురాణం పుస్తకాల విక్రయానికి రూ.660, రూము అద్దెలు రూ.33,280, కవర్లకు రూ.5,700, లడ్డుప్రసాదానికి రూ.1, 64,730, అన్నదానంకు రూ.1,59,349, విరాళాలు రూ.1,05,116 ఆదాయం వచ్చిందని తెలిపారు.

సేవ్ వాటర్-సేవ్ లైఫ్

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అయ్యపరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం సేవ్ వాటర్-సేవ్ లైఫ్ అంటూ ప్రకృతి వనరుల ద్వారా లభించే నీరు యొక్క ఉపయోగాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కందుల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు గాదిరెడ్డి మురళీకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్త సుంకర మాధవి, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జమాతే ఇస్లామి హింద్ కలిగిరి శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షుడు షేక్ ఖాజా అహమద్ రంజాను పండుగను పురస్కరించుకుని కుల మతాలకు అతీతంగా పలువురు నిరుపేద ముస్లిం, హిందువులకు శనివారం రంజాన్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు షేక్ నాయబ్ రసూల్, కార్యకర్తలు షేక్ మీరావలి, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

కూరగాయలు, పోషక విలువలపై అవగాహన

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు కూరగాయలు, వాటిలోని పోషక విలువలపై అవగాహన కల్పిస్తూ కూరగాయల ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు జీ.బాలభాస్కరరావు, బి.నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

కరేడుకు నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించండి

ఉలవపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామానికి కందుకూరు నుంచి నైట్ హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం గ్రామస్థులు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కోరారు. ఈ మేరకు కందుకూరులోని టీడీపీ కార్యాలయంలో ఆయనకు వినతి పత్రం అందజేశారు. 30 ఏళ్ల నుంచి ఉన్న నైట్ హాల్ట్ బస్సును. గత ఏడాది నుంచి తొలగించారని చెప్పారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచు కె సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యతో ప్రతిభను వెలికి తీయవచ్చు

బిట్రగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని టెక్నోపల్స్ కన్వీనర్ దిలీప్‌కుమార్ అన్నారు. బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో టెక్నోపల్స్ 2కే25 పేరుతో జాతీయస్థాయిలో సాంకేతిక విద్యపై ఒకరోజు సింపోసియం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ సింపోసియంకు జాతీయస్థాయిలో దాదాపు 1000 పేపర్ల వరకు రాగా వాటిలో మెరిట్ పేపర్లు 200 ఎంపిక చేశామన్నారు. అందులో బ్రాంచ్ వైజ్ 1 సెలెక్ట్ చేసి వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్వీ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మరుగుదొడ్ల నిర్మాణం ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఆదినారాయణ తెలిపారు. స్థానిక గృహనిర్మాణ శాఖ కార్యాలయంలో శనివారం ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 90 మంది లబ్ధిదారులు మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారని, అవి ఏదశలో ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జిలానీబాషా, హౌసింగ్ ఏఈ సల్మాన్ పాల్గొన్నారు.

పేదరికంలేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని గుడవళ్లూర సర్పంచు బద్దిపూడి మాచర్ల అన్నారు. స్థానిక సచివాలయంలో శనివారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ-4 పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణ, కార్యదర్శి ప్రదీప్, ఉపసర్పంచు వి.మణికుమార్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేరే కారణమా..

మామూళ్ల కోసమా..?

- భవన నిర్మాణాలకు నెల రోజులుగా ఆగిన అనుమతులు
- నిబంధనలు బూచిగా చూపుతున్న అధికారులు
- ఇదంతా లంచాల పెంపునకే అంటున్న భవననిర్మాణదారులు


మున్సిపల్ కార్యాలయం

కావలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో భవన నిర్మాణాలకు మున్సిపల్ కార్యాలయంలో నెల రోజులుగా అనుమతులు ఇవ్వడం లేదు. అదేమని అధికారులను ప్రశ్నిస్తే కొత్త సాఫ్ట్‌వేర్‌లో సమస్య అని చెబుతున్నారు. అయితే నిజంగా సాఫ్ట్‌వేరే కారణమా..? లేక మామూళ్లు పెంచుకోడానికా అన్న అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతోంది. గతంలో అక్రమ లేఅవుట్లు, ఆక్రమిత ప్రభుత్వ స్థలాల్లో పెద్దపెద్ద భవనాల నిర్మాణానికే అనుమతులిచ్చిన అధికారులు ఇప్పుడు సొంత స్థలాల్లో నిర్మాణాలకు ఎందుకు అనుమతులు ఇవ్వడంలేదనేది కావలిలో పెద్ద చర్చనీయాంశమైంది. ప్రధానంగా మున్సిపల్ నియమ నిబంధనలను పాటించాలంటే కావలిలో ఏ ఒక్క భవనానికి కూడా అనుమతులు రావు. చివరకు అపార్ట్‌మెంట్లు కూడా నిబంధనలను అతిక్రమించి కడుతున్నా పట్టించుకునే అధికారే లేడు. నిబంధనలు ఎంత అతిక్రమిస్తే అంత మొత్తంలో మామూళ్లు పెరగటం తప్ప రోడ్ల మీదకు వచ్చి కడుతున్నా అడగేవారు లేరు. ప్లాన్ అప్రూవల్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు చూపించే డిజైన్‌కు వాస్తవంగా నిర్మించే డిజైన్‌కు పొంతన ఉండదు. అలాంటప్పుడు అనుమతులు పొందిన భవనంలో నిర్మాణాలు చేపట్టాలంటే అధికారులు చేతులు తడపితే అంతా గప్‌చుప్ అయిపోతోంది. మరీ దుకాణాల నిర్మాణంలో నిబంధనలను భవన నిర్మాణదారులు పూర్తిగా తుంగలో తొక్కుతున్నా అధికారులు మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారు తప్ప ఏ కొంచం కూడా పాటించటంలేదనేది జగమెరిగిన సత్యం. ఇది గత కొంత కాలంగా జరుగుతున్న తంతు. ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా నిర్మాణాలలో నిబంధనలు మాత్రం అమలు కావటంలేదు.

● నిబంధనల బూచిగా చూపి..

పట్టణంలో అక్రమ లేఅవుట్లలో ఇటీవల భవన నిర్మాణాలకు పూర్తిగా అనుమతులు ఆపేశారు. అయితే భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలంటే అక్కడ రోడ్డు 30 అడుగుల వెడల్పు ఉండాలనే ప్రభుత్వ నిబంధన ఎప్పటి నుంచో ఉంది. అయితే దానిని బూచిగా చూపి అధిక మొత్తంలో మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు భవన నిర్మానాలకు అనుమతులు ఇవ్వాలంటే 30 అడుగుల రోడ్డుకు ఎంత తక్కువ ఉంటే తగ్గిన రోడ్డులో సగం మున్సిపాల్టీకి సొంత ఖర్చులతో తమ సొంత స్థలం రిజిస్టర్ చేయాలని చెప్తున్నారు. ఉదాహరణకు 20 అడుగుల రోడ్డు మాత్రమే ఉంటే 30 అడుగులకు 10 అడుగులు తగ్గుతున్నందున రోడ్డుకు ఇరువైపుల ఐదు అడుగులు వంతున సొంత స్థలాన్ని మున్సిపాల్టీకి వదలడటమే కాక దానిని రిజిస్టర్ చేయాలని చెబుతున్నారు. గతంలో రోడ్డు వదిలినట్లు ప్లానింగ్‌లో చూపిస్తున్నారు కానీ వదలకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అయితే తాజాగా రోడ్డు వదలటమే కాక మున్సిపాల్టీకి రిజిస్టర్ చేయాలని చెపుతుండడంతో దానికి భవన నిర్మాణదారులు ముందుకు రావడంలేదు. అధికారులు చెపుతుంటారులూ.. ఎక్కడా అమలు చేయరు.. కొంత కాలం ఆగితే వారే సర్దుకుపోతారులే అనే భావంతో ఉంటున్నారు. అయితే మున్సిపాల్టీకి భవన నిర్మాణాల అనుమతులకు డిజైన్ రూపొందించే లైసెన్స్‌డ్ ఇంజనీర్లు భవన నిర్మాణదారులకు మున్సిపల్ అధికారులకు మధ్య ఏజంట్లుగా వ్యవహరిస్తుంటారు. ఇచ్చి పుచ్చుకునేదంతా వారే చూసుకుంటారు. అయితే ప్రస్తుతం లైసెన్స్‌డ్ ఇంజనీర్లే కొంత కాలం ప్లాన్‌లు పెట్టకుండా ఉంటే అధికారులే దిగొస్తారులే అని భవన నిర్మాణదారులకు చెబుతుండడంతో ప్లాన్ అప్రూవల్‌కు పెద్దగా దరఖాస్తులు రావడం లేదనే ప్రచారం ఉంది. ఇదిలాఉంటే 30 అడుగుల బూచి చూపించి మామూళ్లు పెంచాలనే ఆలోచనలో అధికారులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ అధికారులు మాత్రం కొత్త సాఫ్ట్‌వేర్ వచ్చిందని, అది ప్రాసెస్‌లో ఉండడం వలన ప్లాన్ అప్రూవల్స్ తీసుకోవడంలేదని, త్వరలో ఆ సమస్య తొలగిపోతుందని చెపుతున్నారు. కానీ వాస్తవంలో రోడ్డు తగ్గిన చోట స్థలం రిజిస్టర్ చేయించుకుంటారా లేక దానిని బూచి చూపి మామూళ్ల మొత్తం పెంచి అనుమతులు ఇస్తారా అనేది కావలిలో పెద్ద చర్చనీయాంశంగా ఉంది.

కొత్త సాఫ్ట్‌వేర్ వల్లే సమస్య

ప్రస్తుతం ప్లాన్ అప్రూల్ ఆగి పోవడానికి కారణం కొత్త సాఫ్ట్‌వేర్. ఇది ప్రాసెస్‌లో ఉంది. అది వీలు కానప్పుడు పాత సాఫ్ట్‌వేర్‌నే పునరుద్ధరిస్తారేమో చూడాలి. స్లమ్ ఏరియాలలో తప్ప మిగిలిన చోట ప్లాన్ అప్రూల్‌కు 30 అడుగుల రోడ్డు తప్పనిసరిగా ఉండాలి.

- వివేకానంద్,
పట్టణ ప్రణాళికాధికారి, కావలి

నీటిని సంరక్షించుకోకుంటే మానవ మనుగడకే ముప్పు


మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు, పక్కన సిబ్బంది


కావలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పంచభూతాలలో ఒకటిగా భావించే నీటిని సంరక్షించుకోక పోతే మానవుల మనుగడకే ముప్పు ఏర్పడుతోందని ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజరు రాపూరు శ్రీనివాసులు తెలిపారు. కావలి ఆర్టీసీ డిపో గ్యారేజిలో శనివారం ప్రపంచ జల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి నీటిని పొదుపుగా వాడుకోవటం అలవాటు చేసుకోవాలని, వర్షపు నీటిని భూగర్భంలోకి వెళ్లేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఆర్టీసీ గ్యారేజిలో తక్కువ నీటితో బస్సులను శుభ్రపరచాలని, కుళాయిలను సకాలంలో కట్టివేయాలని, పైపులలో లీకేజీలను గమనించిన అరికట్టే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు కల్పనా రెడ్డి, గ్యారేజి ఇన్‌చార్జి ఎస్కే ఖాదర్ మొహిద్దీన్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎం.రామక్రిష్ణ, స్టోర్ సూపర్‌వైజర్ ఎం. వెంకటేశ్వర్లు, సెక్యూరిటీ అధికారి కేకే రావు, ఏడీసీ రవిప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్, ఏఐ ప్రాముఖ్యతపై దిశానిర్దేశం

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ల ప్రాముఖ్యతను విద్యార్థులు గుర్తించి ఆదిశగా తమ భవిష్యత్తు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే ఉన్నతస్థితికి చేరుతారని ఢిల్లీ దూరదర్శన్‌లో అదనపు డైరెక్టర్ జనరల్‌గా సేవలందించిన డాక్టరు ఆర్.అనంతపద్మనాభరావు సూచించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సమావేశమైన ఆయన సివిల్స్‌కు సన్నద్ధం కావడంలో పాటించాల్సిన మెలకువలు, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వివిధరంగాలలో ఉన్న ఉపాధి అవకాశాలను పొందేందుకు ఏయే గ్రంథాలను అధ్యయనం చేస్తే మెరుగైన ఫలితాలు దక్కుతాయో వివరించారు. పద్మనాభరావు కుమారుడు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణుడు జనార్ధన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎలా ఉపయోగించుకోవాలి, ఏఐతో తమ జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని ఎలా పెంపొందించుకోవచ్చునో వివరించటంతో పాటు ప్రపంచంలో జరుగుతున్న నూతన పరిశోధనలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పద్మనాభరావును ఘనంగా సత్కరించారు.

● ఆధునిక సాంకేతిక యుగంలో ఇంజనీరింగ్ విద్యార్థులు సివిల్స్‌కు సిద్ధమైతే సమాజానికి అత్యంత విలువైన పాలకులుగా మారవచ్చునని డాక్టరు ఆర్.అనంతపద్మనాభరావు సూచించారు. స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, కళాశాల ఎలక్ట్రిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ మీరాషరీఫ్, అత్తంటి మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థినికి ఆత్మరక్షణ అవసరం


శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న ఎస్ఐ ఉమాశంకర్

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థినికి ఆత్మ రక్షణ అవసరమని ఇందుకోసం ప్రత్యేక శిక్షణతో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్‌పై ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. శనివారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలోని విద్యార్థినులకు ఈ విషయమై ట్రైనర్ బోరెడ్డి సరిత ద్వారా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కేతు సుప్రియ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

చుండి హైస్కూల్‌లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ ప్రారంభం


చుండి మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

వలేటివారిపాలెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో శనివారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను ప్రిన్సిపాల్ శ్రీవెంకటేశ్వర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలపై చర్చ


తహసీల్దారుతో మాట్లాడుతున్న రైల్వే అధికారులు


బిట్రగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే స్టేషన్ పరిధిలోని ఎల్సీగేట్ 144, 143 ప్రాంతాల్లో ఫుట్ ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణాలపై రైల్వే అధికారులు శనివారం తహసీల్దారు సురేష్‌బాబుతో చర్చించారు. బోగోలు మండల పరిధిలోని రైల్వే భూముల సర్వే నెంబర్లు, ప్రభుత్వ ప్రైవేటు భూముల సర్వే నెంబర్ల వివరాలను స్థానిక రైల్వే ఐవోడబ్ల్యూ రాజేష్ తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, మండల సర్వేయరు శ్రీనివాసులు, రైల్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళలకు ఉల్లాస్ పరీక్షలు


అంగన్‌వాడీలకు పరీక్ష పత్రాలు, పెన్నులు అందచేస్తున్న ఏపీఎం

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పొదుపు మహిళలకు నిర్వహిస్తున్న ఉల్లాస్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఏపీఎం కాంతారావు తెలిపారు. పరీక్షల విధానంపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలు, పెన్నులు అందజేశారు. మండలంలో 505 మంది మహిళలు పరీక్షలు రాయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆదినారాయణ, ఎంఈవో ఆనందరావు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

మోటారు బైక్ ఢీకొని మున్సిపల్ ఉద్యోగికి గాయాలు


గాయపడిన రసూల్

కావలి రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్ ఢీకొని మున్సిపల్ ఉద్యోగి రసూల్‌కి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. శనివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో రసూల్ నడుచుకుంటూ రోడ్డు దాటే క్రమంలో వెనుక వైపున వస్తున్న మోటారు బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించారు.

తీర ప్రాంతాల పరిరక్షణపై అవగాహన

● షార్ కమాండెంట్ సంజిత్‌కుమార్ ● కావలికి చేరిన సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాన్లు

కావలి రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల పరిరక్షణ ధ్యేయంగా తీర ప్రాంతాల పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు శ్రీహరికోట స్పేస్ సెంటర్ కమాండెంట్ సంజిత్‌కుమార్ పేర్కొన్నారు. కోల్‌కత్తా నుంచి కన్యాకుమారి వరకు తీరప్రాంతాల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీఐఎస్ఎఫ్ జవాన్లు చేపట్టిన సైకిల్ ర్యాలీ శనివారం సాయంత్రం కావలికి చేరింది. వీరికి స్థానిక పోలీసులు పట్టణంలోని ది క్లాత్ మర్చంట్ అసోసియేషన్ కల్యాణ మండపంలో రాత్రి బస ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంజిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ యాత్ర ఈనెల 31 వరకు కొనసాగుతుంద న్నారు. ఆదివారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు తీరప్రాంత భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని, అనంతరం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించం

● సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి


ధాన్యాన్ని పరిశీలిస్తున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

అల్లూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యం విక్రయించుకునేందుకు అవసరమైన సదుపాయాలు కల్పించాలని అలాకాకుండా ఇబ్బందులు పెడితే సహించేది లేదని సివిల్ సప్లయ్స్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి హెచ్చరించారు. అల్లూరు ఏఎంసీ గోదాముల్లోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోనె సంచులు తక్కువగా ఇస్తున్నారని తెలుసుకుని జిల్లా అధికారులతో మాట్లాడి గోనె సంచులు అధికంగా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జిల్లాలో 40 వేల పుట్ల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని, ఆ రైతుల ఖాతాల్లోకి 24 గంటలలోపు రూ.79 కోట్లు జమ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, మేడా కృష్ణారెడ్డి, మేడా రమణారెడ్డి, రాఘయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీలకు న్యాయం చేయండి

● కలెక్టర్ ఆనంద్‌కు ఏపీ ఎరుకుల సేవా సంఘం నేతల వినతి


జిల్లా కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందచేస్తున్న గిరిజన నేతలు

బిట్రగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో వడ్డెర (బీసీ-ఏ) కులానికి చెందిన కొందరు ఎస్టీలుగా నకిలీ ధ్రువీకరణ పత్రాలతో విద్య, ఉద్యోగాలలో లబ్ధిపొందుతున్నారని, వారిపై చర్యలు చేపట్టి అసలైన ఎస్టీలకు న్యాయం చేయాలని ఏపీ ఎరుకుల సేవా సంఘం నేతలు కోరారు. ఈ మేరకు శనివారం నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎరుకుల సేవా సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ, రాష్ట్ర గిరిజన నాయకులు నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మా, మండల అధ్యక్షుడు బోగిరి యోహాన్, ఎరుకుల సంఘ నాయుకులు నల్గొండ పోలయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల ఉద్యోగుల సంఘం నిరసన


నిరసన కార్యక్రమంలో మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం నేతలు

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాజ్యాగానికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రప్రభుత్వం పూనుకుంటున్నదని, సుప్రీం కోర్టు తీర్పు అసంబద్ధమని మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం నేతలు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర శాసనసభ, శాసనమండలిలో తీర్మానించటం న్యాయం కాదని, ఎస్సీలపై నిజంగా ప్రేమ ఉంటే బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘాల నేతలు లింగాబత్తిన బ్రహ్మయ్య, పాలేటి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోండి

కొండాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దారు ఎమ్.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వండి

లింగసముద్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని తహసీల్దారు ఎస్ సీతామహాలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

ఆటల పోటీలు స్నేహానికి దోహదం


వాలీబాల్ ఆడుతున్న యువకులు

ఉలవపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఆటల పోటీలు స్నేహానికి దోహదపడతాయని రామాయపట్నం కోస్టల్ సెక్యూరిటీ సీఐ జీ.శివన్నారాయణ చెప్పారు. శనివారం మండలంలోని రామాయపట్నంలో సీఐ శివన్నారాయణ ఆధ్వర్యంలో మత్స్యకార గ్రామాల భాగస్వామ్యంతో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పెదపట్టపుపాలెం సర్పంచు ఆవుల జయరాం ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొననున్నాయి. ఈ కార్యక్రమంలో కరేడు హైస్కూల్ పీఈటీ ఓగుబోయిన శ్రీను, కొండూరి ప్రదీప్, వాయల బాబులు, ఎస్సైలు మస్తాన్ షరీఫ్, పి ఈశ్వరయ్య, సర్పంచులు ఎ వెంకటేశ్వర్లు, సీహెచ్ రమణయ్య, గ్రామ పెద్దలు ఎ కృష్ణారావు, తూపిలి రవి, పెద కాపు వి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన తప్పనిసరి


కలిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కలిగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి పేర్కొన్నారు. జాతీయ క్షయ నియంత్రణ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సాయిలక్ష్మి, వింజమూరు టీబీ యూనిట్ ల్యాబ్ సూపర్‌వైజర్ శివ, ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ షబ్బీర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

● కందుకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోపాడులో క్షయవాధిపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ కే. శ్రీమన్నారాయణ, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

క్రసంఖ్య	పేరు	ఊరు	మండలం
1.	బత్తినేని వెంకటేశ్వర్లు	వేదాయపాళెం	నెల్లూరు
2.	ఎస్.ముత్తుకుమార్	పొదలకూరు రోడ్డు	నెల్లూరు
3.	కె.రాజగోపాల్	వేదాయపాళెం	నెల్లూరు
4.	కొండూరు శ్రీనివాసాచారి	దొడ్లసుబ్బారెడ్డినగర్	నెల్లూరు
5.	గండికోట సుధీర్‌కుమార్	శ్రీరామ్‌నగర్	బుచ్చి
6.	చెరువుపల్లి వెంకట ధీరజ్	యల్లాయపాళెం	కొడవలూరు
7.	నల్లా జయరామయ్య	బాలాజీనగర్	నెల్లూరు
8.	కె.సాయి వర్షిత	శ్రీనగర్ కాలనీ	నెల్లూరు
9.	కలిచేటి సుబ్బారెడ్డి	దూర్జటినగర్	గూడూరు
10.	కంచర్ల ప్రవల్లిక	శాంతినగర్	కావలి
11.	ఎస్.రాజేంద్రప్రసాద్	కొత్తూరు	ఇందుకూరుపేట
12.	బక్కముంతల దయాకర్	వాలాయనందపురం	గూడూరు
13.	మాదాల రామ్‌ప్రసాద్	కామాటివీధి	ఇందుకూరుపేట
14.	జి.నవనీతమ్మ	నెల్లూరు	నెల్లూరు
15.	చల్లాకొలను మల్లికార్జునరావు	బుచ్చిరెడ్డిపాళెం	బుచ్చిరెడ్డిపాళెం
16.	పొన్నూరు వెంకట నవదీప్	కోటంరెడ్డివారివీధి	కావలి
17.	తోట వెంకటేశ్వర్లు	బాలాజీనగర్	నెల్లూరు
18.	జి.రేవతి	కేపీహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
19.	కాకర్ల వెంకటయ్య	రామ్మూర్తినగర్	నెల్లూరు
20.	ఆకుల పద్మావతి	పోలీసు కాలనీ	నెల్లూరు
21.	సిహెచ్.సురేష్	వేదాయపాళెం	నెల్లూరు
22.	డి.ఆదిత్య అభిరామ్	అనంతవరం	దగదర్తి
23.	బొల్లినేని వెంకట రవికుమార్	జగదేవిపేట	ఇందుకూరుపేట
24.	పుచ్చలపల్లి జీవన్‌కుమార్‌రెడ్డి	పెనుబర్తి	నెల్లూరు రూరల్
25.	సోమిశెట్టి సుబ్బారావు	ములుమూడి బస్టాండ్	నెల్లూరు
26.	కొమ్మి మస్తానయ్య	సండే గాంధీనగర్	నెల్లూరు
27.	బి.శ్రీధర్షిణి	కొండాయపాళెం	నెల్లూరు
28.	శాఖవరపు వేణుగోపాల్	బుజబుజనెల్లూరు	నెల్లూరు
29.	వావింటపర్తి అనిల్‌కుమార్	నెల్లూరు	నెల్లూరు
30.	పప్పు దిలీప్‌కుమార్	బీవీ.నగర్	నెల్లూరు
31.	వి.జానకిరామయ్య	కస్తూర్తిదేవి నగర్	నెల్లూరు
32.	కోట వెంకట కరుణాకర్‌రెడ్డి	సంగం	సంగం
33.	కె.వెంకట లాస్యప్రియ	రంగనాయకులపేట	నెల్లూరు
34.	కందుకూరు జయమ్మ	ఏసీనగర్	నెల్లూరు
35.	మలిశెట్టి ఈశ్వరయ్య	హరనాథపురం	నెల్లూరు
36.	కటమూడి నరసింహం	నవాబుపేట	నెల్లూరు
37.	పి.కామేశ్వరి	జలదంకి	జలదంకి
38.	జి. శ్రీనివాస హేమంత్	కావలి	కావలి
39.	పి.వెంకటేశ్వర్లునాయుడు	బజారువీధి	నాయుడుపేట
40.	బొప్పిన రామకృష్ణ	వేదాయపాళెం	నెల్లూరు
41.	పల్లాపు శ్రావణి	జమ్మవరం	ఏఎస్‌పేట
42.	యల్.డి.ఆర్.గోపాల్‌రెడ్డి	విక్రమ్‌నగర్	నెల్లూరు
43.	పుల్లా కుమార్	బుచ్చిరెడ్డిపాళెం	బుచ్చిరెడ్డిపాళెం
44.	యస్.కె.అబ్దుల్ అలీమ్	నవాజ్‌కట్ట	గూడూరు
45.	వి.సత్యనారాయణ	సరస్వతినగర్	దర్గామిట్ట
46.	సిఎస్.శారీస్	ఉండిగంవారి వీధి	కావలి
47.	ఎమ్.వెంకటరామిరెడ్డి	పడుగుపాడు	కోవూరు
48.	పార్థసారథి	ప్రశాంతినగర్	నెల్లూరు
49.	పోట్లూరు నందకిషోర్	ముత్తుకూరు	విడవలూరు
50.	పొట్లాపు శ్రీతులసి	మూలాపేట	నెల్లూరు
51.	ఏ.అరుణ్‌కుమార్	బాలాజీనగర్	నెల్లూరు
52.	కె.దశరథరామయ్య	గూడూరు	గూడూరు
53.	పి.వెంకటరమణయ్య	పోలీస్‌కాలనీ	నెల్లూరు
54.	కంకణాల చైతన్య దుర్గా	కొత్తబజార్	కావలి
55.	డి.హేమంత్‌కుమార్	పాటూరు వారివీధి	ఇందుకూరుపేట
56.	కె.రామ్మూర్తి	లేక్వ్యూకాలనీ	నెల్లూరు
57.	ఉచ్చూరు శ్రీనివాసులు	లక్ష్మీపురం	నెల్లూరు
58.	టి.పద్మావతి	పప్పులవీధి	నెల్లూరు
59.	దువ్వూరు లక్ష్మి	పూసలవారి వీధి	కావలి
60.	కలవకూరి బాలచెన్నయ్య	వాయినందన ప్రెస్‌వీధి	కావలి
61.	సున్నా పెంచలయ్య	తూకుమానిమిట్ట	నెల్లూరు
62.	ఉరటూరు మాల్యాద్రి	సంతపేట	నెల్లూరు
63.	ఆర్ఎన్ఎస్ భరద్వాజ్	బుజబుజనెల్లూరు	నెల్లూరు
64.	కె.జయమ్మ	జలదంకి	జలదంకి
65.	పి.శ్రీనివాసకుమార్	ఉస్మాన్‌సాహెబ్‌పేట	నెల్లూరు
66.	వడ్లమూడి సుప్రియ	వెంగమాంబ వీధి	నెల్లూరు
67.	పవన్‌కుమార్	వేదాయపాళెం	నెల్లూరు
68.	పి.ప్రమీల	చంద్రమౌళినగర్	నెల్లూరు
69.	వై.స్వప్న	కొత్తపాలెం	వాకాడు
70.	ఆర్.రామసుబ్బమ్మ	బుజబుజనెల్లూరు	నెల్లూరు
71.	బుట్టి బాలాజీ	కొత్తమినగల్లు	బుచ్చిరెడ్డిపాళెం
72.	అమరనాథ్	కావలి	కావలి
73.	వై.రామ్మోహన్‌రావు	బి.వి.నగర్	నెల్లూరు
74.	ఎమ్.రామలక్ష్మి	గూడూరు	గూడూరు
75.	చల్లాకొలుసు శివతేజ	బుచ్చి	బుచ్చి
76.	కట్టా సుబ్రమణ్యం	సర్వేపల్లి	వెంకటాచలం
77.	ఆర్.సీతారామలక్ష్మి	నెల్లూరు	నెల్లూరు
78.	యస్.కె.షరీన్	నవాజ్‌కట్ట	గూడూరు
79.	వి.సాయిలక్ష్మి	నారాయణ ట్రైనింగ్ సెంటర్	నెల్లూరు
80.	ఎస్‌కే.జిలానీ బాషా	మెట్టు	చిట్టమూరు
81.	అవ్వారు లక్ష్మి	అరుణాచలం వీధి	లక్ష్మీపురం
82.	పరుచూరు వెంకటేశ్వర్లు	చంద్రమౌళినగర్	నెల్లూరు
83.	ఎస్.కుమార్	ఏ.కె.నగర్	నెల్లూరు
84.	వి.శ్రీనివాసులు	పొదలకూరు రోడ్డు	నెల్లూరు
85.	కె.నిత్య	చంద్రమౌళినగర్	నెల్లూరు
86.	కొండ్లపూడి చంద్రారెడ్డి	ఆకిలి వలస	రాపూరు
87.	షేక్ మస్తాన్	బిట్రగుంట	బోగోలు
88.	టి.శ్రీలక్ష్మి	ఎ.పి.హౌసింగ్‌బోర్డు	నెల్లూరు
89.	కొత్తూరు కామాక్షి	కెపిహెచ్‌బి కాలనీ	నెల్లూరు
90.	బాణాల గౌతమ్	చముడుగుంట	వెంకటాచలం
91.	ఎన్.మనోహర్	బలిజపాళెం	నెల్లూరు
92.	బి.నవీన్	దగదర్తి	దగదర్తి
93.	వైష్ణవి	రైల్వేస్టేషన్ రోడ్	కావలి
94.	యస్.బలరామ్‌రెడ్డి	వేదాయపాళెం	నెల్లూరు
95.	జి.జయప్రసాద్	కేపీహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
96.	డి.సంధ్యారాణి	కెపిహెచ్‌బీ కాలనీ	నెల్లూరు
97.	కె.శివరాం	పొదలకూరు రోడ్డు	నెల్లూరు
98.	పి.రాకేష్	మర్రిపాడు	సంగం
99.	పి.రాధ	నాయుడుపేట	నాయుడుపేట
100.	కె.అనూష	శ్రీకొలను	ఏఎస్‌పేట

యథార్థ వార్తలకు ప్రతీక ఆంధ్రజ్యోతి-ఏబీఎన్

- కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి
- వార్తలే కాదు బహుమతులూ ఇవ్వడం శుభపరిణామం
- 'శుభమస్తు' అధినేత బయ్యా రవి
- 'ఆంధ్రజ్యోతి కార్ అండ్ రేస్' విజేతల ప్రకటన

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉన్నది ఉన్నట్లు నిష్పక్షపాతంగా ప్రజలకు వార్తలు అందిస్తూ ప్రజలు, పాఠకుల మన్ననలు పొందిన పత్రిక ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ చానల్ అని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కితాబిచ్చారు. శనివారం సాయంత్రం నెల్లూరు నగరం లోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయంలో జరిగిన 'ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్' లక్కీ డ్రా కార్యా క్రమంలో ప్రశాంతిరెడ్డి పాల్గొని మాట్లాడారు. యథార్థ వార్తలకు ప్రతీకేగాక పాఠకులకు 22వ వార్షికోత్సవం కానుకగా రూ.కోటి విలువ కలిగిన బహుమతులు అందించడం అభినందనీయం అన్నారు. లక్కీ డ్రా విజేతలను ఎంపిక చేసే అవ కాశం కల్పించిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధా కృష్ణకు, ఆంధ్రజ్యోతి సిబ్బందికి ధన్యవాదాలు తెలి పారు. మరెన్నో మంచి వార్తలు అందిస్తూ ఆంధ్రజ్యోతి - ఏబీఎన్ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె ఆకాం క్షించారు. అనంతరం మరో అతిథి శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేత బయ్యా రవి మాట్లా డుతూ అక్షరమే ఆయుధం అనే నినాదంతో అడుగుపెట్టిన ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి పాఠకుల ఆదరాభి మానాలు పొందిందన్నారు. తీసుకోవ డమే కాదు ఇవ్వడం కూడా మాకు తెలుసంటూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యం గత 22 సంవత్సరాలుగా పాఠకులకు పట్టాభిషేకం పేరుతో బహుమతులు ఇవ్వడం పత్రికా ప్రపంచంలో మరే పత్రిక, ఛానల్ చేయడం లేద న్నారు. పత్రిక నడపడం అంటే ఎన్నో ఒడిదుడు కులు ఉంటాయని, అన్ని సవాళ్లను ఎదుర్కొని వార్తా ప్రపంచంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అగ్రభాగాన నిలిచిందని అన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని వేలాదిమంది పాఠకుల నుంచి వచ్చిన కూపన్లలో మొదటి విజేతను ఎమ్మెల్యే ప్రశాంతి, రెండో విజేతను బయ్యా రవి, మూడో విజేతను ఆంధ్రజ్యోతి ఏజెంట్ సత్యనారాయణ ప్రకటించారు. మొదటి విజేత నెల్లూరు రూరల్ మండలం కొత్తూరులోని శ్రామిక్ నగర్‌కు చెందిన ఎస్‌కే.మస్తాన్‌బీకి ఎమ్మెల్యే స్వయంగా ఫోన్ చేసి అభినం దించారు.



మొదటి విజేత కూపన్‌ను చూపుతున్న కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పక్కన 'శుభమస్తు' అధినేత బయ్యా రవి తదితరులు



విజేతల కూపన్లను చూపుతున్న ఆంధ్రజ్యోతి ఏజెంట్లు

అనంతరం పాఠకులు, ఏజెంట్లు తదితరులు వంది మంది కన్సొలేషన్ విజేతలను కూపన్ల ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్య క్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజరు బీఎం కే.హరికృష్ణ, ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, సర్క్యులేషన్ ఇన్‌చార్జ్ నాగేశ్వరరావు, ఏడీవీటీ ఇన్‌చార్జ్ అబ్దుల్ రహీం, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి నాగరాజు, ఏబీఎన్ స్టాఫ్‌రిపోర్టర్ కె.మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

డీలర్ల సమావేశంలో డీఎస్‌వో అంకయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌వో అంకయ్య

నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్ర జ్యోతి) : రేషన్ కార్డుదా రులు ఈకేవైసీ చేయించు కోవాలని డీఎస్‌వో అంకయ్య కోరారు. శనివారం ఆయన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిం చారు. కార్డుదారులు ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందు తాయని చెప్పారు. రేషన్‌కార్డు లోని సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ విషయంలో డీలర్లు కార్డుదారులందరికీ అవగాహన కల్పించా లని సూచించారు. ఈ సమావేశంలో చౌక దుకాణాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రమేష్, ఉపాధ్య క్షుడు వీ వెంకట సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడిస్తారు?

కొత్త రేషన్‌కార్డుల కోసం ప్రజలు ఎదురుచూస్తు న్నారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రక్రియ మొదలు పెడుతుందా?, ఎప్పుడు దరఖాస్తు చేసుకుం దామా? అని నిరీక్షిస్తు న్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి 9 నెలలు అవుతున్నా ఇంకా ప్రక్రియ ప్రారంభం కాకపోవ డంతో నిరాశ చెందుతున్నారు. తొలుత ఈ ఏడా ది సంక్రాంతికి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయడానికి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఆ తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదు.



రేషన్‌షాపులో సరుకులు పంపిణీ చేస్తున్న డీలర్ (ఫైల్)

నెల్లూరు (హరనాథపురం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడేళ్ల నుంచి కొత్త రేషన్‌కార్డులు మంజూ రు కావడంలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి రెండు సంవత్సరాలు రేషన్ కా ర్డుల పేరిట బియ్యం కార్డు లు మంజూరు చేసిం ది. తరువాత మూడేళ్లు ఒక్క కార్డు కూడా ఇవ్వలేదు. వైసీపీ హయాంలో దరఖాస్తు చేసు కున్న చాలా మం ది అర్హులకు కార్డులు రాలేదు. ఆ పార్టీ మద్దతుదారులకు అధికంగా కార్డులు జారీ చేసినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే అర్హులు అందరికీ కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామని ప్రకటిం చింది. మొన్న సంక్రాంతికి కార్డులు ఇస్తామని పేర్కొంది. జిల్లా పౌరసరఫరాల అధికారులు కూడా కొత్త కార్డులు ఇస్తా మని గత డిసెంబర్‌లో ప్రకటించారు. డిసెంబరు 2వతేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపడ తామని, కొత్త రేషన్‌కార్డులే కాదు, ఇప్పటికే ఉన్న కార్డుల్లో మార్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కానీ ఆ తర్వాత పురోగతి లేకుండా పోయింది.

ప్రభుత్వ పథకాలకు అదే ప్రామాణికం

ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసు కుంటుండటంతో కొత్త కార్డులు కావాలని కోరుతూ జిల్లా, మండల స్థాయి లో నిర్వహించే ప్రజా సమస్యల పరి ష్కార వేదికలో ప్రజలు పెద్ద ఎత్తున అర్జీ లు సమర్పిస్తున్నారు. మూడేళ్ల నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవ కాశాలు లేకపోవడంతో ఇప్పుడు అందు కోసం అనేక మంది అటు తహసీల్దార్ కార్యాలయాలు, ఇటు పౌర సరఫరాల శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతు న్నారు. కుటుంబంలో ఒకరు చని పోయి ఉంటే వారి తొలగింపు, పుట్టిన వారి పేర్ల చేర్పు, కుటుం బంలో ఐదారు మంది గతం లో కలిసి ఉండి ఇప్పుడు విడిపోయి ఉంటే ఇటువంటి వారు కొత్త కార్డుల కోసం కార్యాల యాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కొత్త రేషన్‌కార్డులతోపాటు చేర్పులు, మార్పుల కోసం వస్తున్న అర్జీలు విషయా న్ని జిల్లా అధికారులు ప్రస్తావిం చినట్లు తెలిసింది. ఈ విషయమై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని, త్వరలోనే ప్రకటన వస్తుందని ఉన్నతాధికారులు చెప్పినట్లు తెలిసింది.

రేషనలైజేషన్ ప్రక్రియ..

జిల్లాలో ప్రస్తుతం 7.38 లక్షల కార్డులున్నాయి. 1513 రేషన్‌షాపులు న్నాయి. 438 ఎండీవో వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నారు. రేషన్‌కార్డుల రేషనలైజేషన్ ప్రక్రియ గతంలోనే పూర్తయింది. 800కు మించి కార్డులున్న రేషన్‌షాపులను అధికారులు గుర్తించారు. కొత్త రేషన్‌షాపుల ఏర్పాటుకు కార్డుల విభజన ప్రక్రియ కూడా చేశారు. నిరుద్యోగ యువతకు కొత్త రేషన్ షాపుల ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలనుకు న్నారు. గ్రామాల్లో ఒక్కో చౌక దుకాణానికి 400 నుంచి 450 కార్డులు ఉండాలని, మున్సిపాలిటీల్లో 500 నుంచి 550 కార్డులు ఉండాలని, కార్పొరేషన్ పరిధిలో 600 నుంచి 650 కార్డులు ఉండాలని అధికారులు నిర్ణయించి, ఆ ప్రకరం రేషనలైజేషన్ పూర్తి చేశారు. అయితే షాపుల విభజన విషయంలో కొందరు డీలర్లు కోర్టును ఆశ్రయించారు. తమకు ఒక్కొక్కరికి 1000 రేషన్‌కార్డులు ఉంటేనే జీవనం సాగించగలమని తెలియ జేశారు. ఈ నేపథ్యంలో కొత్త కార్డుల జారీకి బ్రేక్ పడింది. అయితే కోర్టు వ్యవహారం ఇటీవల ముగిసింది. చనిపోయిన వారి కార్డులు తొలగించిన తర్వాత కార్డులు విభజన చేపట్టాలని న్యాయస్థానం సూచించినట్లు సమా చారం. ఈ క్రమంలో కొత్త కార్డుల జారీ మొదలయ్యే అవకాశం ఉంది.

దుకాణానికి 1000 కార్డులు ఉండేలా చూడాలి



జిల్లాలో రేషన్ షాపుల నిర్వహణ ఖర్చులు బాగా పెరిగిపోయా యి. ఒక్కొక్క దుకా ణానికి వెయ్యి కార్డులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. గతంలో అంగన్‌వాడీలకు సరుకులు పంపిణీ చేసినందుకు డీలర్లకు కమీషన్ రావాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రూ.1.20 కోట్లను ప్రభుత్వం జిల్లాకు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని అధికారులు వెంటనే డీలర్లకు చెల్లించాలి.

- కృష్ణారెడ్డి, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

మోదీ పాలనలో పెరిగిన మతోన్మాదం

● డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి

కావలిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దేశాన్ని సమగ్రా భివృద్ధి చేస్తే ప్రధాని నరేంద్ర మోదీ మతోన్మాదాన్ని అభివృద్ధి చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆరోపిం చారు. శనివారం కావలిలోని పార్టీ నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్యాణ్ అధ్యక్షతన జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ట్రంకురోడ్డులోని అంబేడ్కర్, మాజీ మంత్రి దివంగత యానాదిరెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ చంద్ర బాబు సూపర్‌సిక్స్ అని అధికారంలోకొచ్చి సిక్స్ కాదు కదా కనీసం ఫోర్ కూడా కొట్టలేకపోతున్నారన్నారు. చంద్రబాబు, నితీష్‌ల పుణ్యంతో మోదీ మూడవసారి ప్రధాని అయ్యారని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకునేందుకు చంద్రబాబుకు మంచి అవకాశం వచ్చినందున ప్రత్యేక హోదా సాధించాలని డిమాండ్ చేశారు. పేదల అభివృద్ధి సంక్షేమం కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. చంద్ర బాబు, జగన్ ఇద్దరిది కాంగ్రెస్ డీఎన్ఏ అని, కాంగ్రెస్‌ని విమ ర్శించే హక్కు వారికి లేదన్నారు. జగన్ తిరిగి కాంగ్రెస్‌లో వస్తా రని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి, కార్యదర్శి నరసింహులు, మానస, హుస్సేన్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతకు క్రీడలు దోహదం

● డీఎస్పీ శ్రీధర్
● జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు ప్రారంభం

కావలిటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యతకు క్రీడలు దోహదం చేస్తాయని కావలి డీఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. అఫిషియల్ క్లబ్, కావలి టెన్నిస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీనరసారెడ్డి, సుజనమ్మ ట్రస్ట్ జాతీయస్థాయి డబుల్స్ టెన్నిస్ టోర్నమెంట్‌ను శని వారం అఫిషియల్ క్లబ్ కోర్టులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందరంగా డీఎస్పీ మాట్లాడుతూ 60, 70 ఏళ్ల క్రీడాకారులు ఇత ర రాష్ట్రాల నుంచి కావలికి వచ్చి టెన్నిస్ పోటీల్లో పాల్గొనడం యువ క్రీడాకారులకు గొప్ప స్ఫూర్తిదా యకమన్నారు. అనుమలశెట్టి రామకృష్ణ మాట్లా డుతూ 30 ప్లస్ నుంచి 70 ప్లస్ వరకు 5కేటాగిరీ లలో డబుల్స్ పోటీలు నిర్వహిస్తున్నామని, 6 రా ష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. టోర్న మెంట్ కమిటీ అధ్యక్షుడు అనుమలశెట్టి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, తహసీల్దారు పీ.శ్రావ ణ్‌కుమార్, క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాల్‌బా ట్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యులు విజయ్‌శం కర్‌రెడ్డి, వంశీమోహన్, టీచర్ ప్రతాప్, బీజేపీ నేత చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



టెన్నిస్ పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన తహసీల్దారు శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

ఎన్ఎస్ఎస్ వలంటీర్‌కు ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్ తేజస్వి

వెంకటాచలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): విక్ర మ సింహపురి యూని వర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్ ఎల్. తేజస్వికి శనివారం విజయ వాడలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ ఏడాది జనవరి 26న న్యూ ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినందు కుగాను ఈ ప్రశంసాపత్రాన్ని అందించి అభినందించారు. ఈ సందర్భంగా వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు మాట్లాడారు. ఎన్ఎస్ ఎస్ వాలంటీర్ తేజస్వి అందుకున్న గౌరవం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయ కమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే.సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజయ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కే.విద్యప్రభాకర్, డాక్టర్ ఎస్‌బీ.సాయినాథ్, డాక్టర్ బీవీ.సుబ్బారెడ్డి తదితరులు ఉన్నారు.

మోయలేని భారంగా కరెంటు చార్జీలు

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ ● విద్యుత్ భారాలపై పుస్తకావిష్కరణ



విద్యుత్ చార్జీల భారాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విద్యుత్ చార్జీల భారాలతో ప్రజలు అల్లాడిపోతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విద్యుత్ భారాలు - ప్రజలపై ప్రభావం అన్న పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెరిగితే వ్యతిరేకించిన టీడీపీ, అధికారంలోకి రాగానే విద్యుత్ భారాలను కొనసాగిం చటం దుర్మార్గమ న్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపటం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని గతంలో లోకేష్ పిలుపునివ్వగా, ప్రస్తుతం ప్రీపెయిడ్ స్మార్ట్‌మీటర్లతో ఉదయం, మధ్యా హ్నం, రాత్రి పూట వేరువేరుగా విద్యుత్ చార్జీలు భారాన్ని మోపేందుకు నిర్ణయం తీసుకోవటం ఏమిటని ప్రశ్నించారు. ఈ భారాలను ఎత్తివేయక పోతే ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అజయ్‌కుమార్, రెహనా బేగం, మూలి వెంగయ్య, పుల్లయ్య, గోగుల శ్రీనివాసులు, మోహన్ రావు, మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ ప్రజలందరి బాధ్యత


సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఎస్ఏ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(విద్య), మార్చి 22 (ఆంధ్ర జ్యోతి) : నీటి సంరక్షణ బాధ్యత ప్రజలందరిపై ఉందని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డి నేటర్ డీ వెంకట సుబ్బ య్య అన్నారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్రశిక్ష కార్యాలయంలో శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఆయన మాట్లాడుతూ నీటి వినియోగం లేనిదే మానవ జీవనం లేదని, అమూల్య మైన నీటి వనరులను పరిరక్షించుకోవా లన్నారు. అనంత రం నీటిని వృథా చేయబోమంటూ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

సోమశిలలో 54.449 టీఎంసీల నిల్వ



అనంతసాగరం మార్చి22 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, శనివారం నాటికి 54.449 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలు వకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.